శుక్రవారం
21-11-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 10, సంచిక : 60
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

పాక్‌కు చైనా జలాంతర్గాములు!

న్యూఢిల్లీ: పాకిస్థాన్‌కు జలాంతర్గాములు, నౌకలను చైనా అందిస్తోందని భారత నౌకాదళ వైస్ చీఫ్ వైస్ అడ్మిరల్ సంజయ్ వాత్సాయన్ తెలిపారు. దేశ రక్షణ వ్యవస్థలను బలోపేతం చేస్తున్నామని, జలాంతర్గామి వ్యతిరేక యుద్ధానికి సామర్థ్యాలు పెంచుకుంటున్నామని వాత్సాయన్ వెల్లడించారు. ఈనెల 25-26 తేదీల్లో దిల్లీలోని భారత నేవీ స్వావలంబన్ 2025 జరగనున్న సందర్భంగా మాట్లాడుతూ చైనా అమ్ములపొదిలో మూడో విమాన వాహక నౌక చేర్చుకోబోతోందన్నారు. మరో రెండేళ్లలో భారత నేవీలో బహుళ విమాన వాహన నౌక విమానాలు చేరబోతున్నాయని తెలిపారు.

కేటీఆర్ విచారణకు గవర్నర్ అనుమతి

విశాలాంధ్ర-హైదరాబాద్: ఫార్ములా ఈ-కార్ రేసింగ్ కేసులో మాజీ మంత్రి కేటీఆర్‌ను ఏసీబీ విచారించేందుకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అనుమతించారు. ఈ కేసులో ఇప్పటికే పలుమార్లు కేటీఆర్ ఏసీబీ విచారణకు హాజరయ్యారు. ఫార్ములా ఈ-కార్ రేసింగ్‌లో రూ.54.88 కోట్ల నిధుల దుర్వినియోగం జరిగినట్లు ఆరోపణలు. ఈక్రమంలో కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ అనుమతి కోరుతూ గతంలో ఏసీబీ లేఖ రాసింది. ఆయన పాత్రపై సాక్ష్యాలు ఉన్నాయంటూ అందులో పేర్కొంది. ఈక్రమంలో తాజాగా ఏసీబీ అధికారులకు అనుమతి ఇస్తూ గవర్నర్ ఉత్తర్వులు జారీ చేశారు.

దేవ్‌జీ, రాజిరెడ్డి మా అదుపులో లేరు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మావోయిస్టులు దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డిని కోర్టులో హాజరుపర్చేలా పోలీసులను ఆదేశించాలని దాఖలయిన హెబియస్ కార్పస్ పిటిషన్‌పై హైకోర్టు విచారణ జరిపింది. వారిద్దరూ తమ వద్ద లేరని ఉన్నత న్యాయస్థానానికి పోలీసులు తెలిపారు. అరెస్టు చేసిన ఇతర మావోయిస్టులను సంబంధిత మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చినట్లు పేర్కొన్నారు. దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డి పోలీసుల వద్ద ఉన్నారనేందుకు ఆధారాలను కోర్టు ముందు ఉంచాలని పిటిషనర్లను హైకోర్టు ఆదేశించింది. మావోయిస్టు కీలక నేతలు తమ ఆధీనంలో ఉన్నారని

- మిగతా 2 లో

రాబర్ట్ వాద్రాపై ఈడీ చార్జిషీట్

న్యూఢిల్లీ: బ్రిటన్‌కు చెందిన ఆయుధ సలహాదారు సంజయ్ భండారీకి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా భర్త, వ్యాపారవేత్త రాబర్ట్ వాద్రాపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) చార్జిషీట్ దాఖలు చేసిందని అధికారిక వర్గాలు తెలిపాయి. ప్రత్యేక మనీలాండరింగ్ నిరోధక చట్టం కోర్టులో ప్రాసిక్యూషన్ ఫిర్యాదు దాఖలు అయిందని వివరించింది. ఇది వాద్రాపై రెండవ మనీలాండరింగ్ చార్జిషీట్... జులైలో హర్యానాలోని షికోహ్‌పూర్‌లో జరిగిన ఒక భూ ఒప్పందంలో అక్రమాలకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఈడీ వాద్రాపై చార్జిషీట్

- మిగతా 2 లో

రాష్ట్రపతి, గవర్నర్లకు గడువుపై
సుప్రీం యూటర్న్



న్యూఢిల్లీ: రాష్ట్రాల శాసనసభలు ఆమోదించి పంపించిన బిల్లులకు సమ్మతి తెలిపే అంశంలో సుప్రీంకోర్టు గురువారం కీలక తీర్పు వెలువరించింది. ఈ విషయంలో రాష్ట్రపతి, గవర్నర్లకు న్యాయస్థానం గడువు విధించడంపై దేశ ప్రథమ పౌరురాలు ద్రౌపదీ ముర్ము సంధించిన ప్రశ్నల (ప్రెసిడెన్షియల్ రిఫరెన్స్)పై అత్యున్నత న్యాయస్థానం సమాధానమిచ్చింది. పెండింగ్ బిల్లుల ఆమోదం కోసం రాష్ట్రపతి, గవర్నర్లకు గడువు విధించడం తగదని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం స్పష్టంచేసింది. అయితే, కారణం చెప్పకుండా గవర్నర్లు బిల్లులు వెనక్కి పంపలేరని వెల్లడించింది. ఈ మేరకు దీనిపై గతంలో ద్విసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పును సీజేఐ ధర్మాసనం పక్కనబెట్టింది. గవర్నర్‌కు రాజ్యాంగపరంగా మూడు అవకాశాలు మాత్రమే ఉంటాయని స్పష్టంచేసింది. అందులో ఒకటి...బిల్లులకు సమ్మతి తెలియజేయడం, రెండు... కారణం చెప్పి బిల్లును రిజర్వ్‌లో పెట్టడం లేదా రాష్ట్రపతికి పంపడం, మూడు... బిల్లును తిరస్కరించి అసెంబ్లీకి పంపడం మాత్రమేనని తెలిపింది. ఇంతకుమించి మరో అధికారం గవర్నరుకు లేదని తేల్చిచెప్పింది. ఈ మూడు ఆప్షన్లు ఎంచుకోవడంలో గవర్నర్ విచక్షణాధికారం ఉపయోగిస్తారని, ఇందుకు న్యాయస్థానాలు గడువు విధించడం సబబు కాదని అభిప్రాయపడింది. గవర్నర్ల విధుల నిర్వహణ వ్యవహారాల్లో కోర్టులు జోక్యం చేసుకోవని, కానీ, కారణం లేకుండా దీర్ఘకాలంగా బిల్లులు పెండింగ్‌లో ఉంచిన సందర్భాల్లో కోర్టులు పరిమిత విచక్షణతో వ్యవహరించవచ్చని వెల్లడించింది. నిరవధిక జాప్యం కొనసాగుతున్న సందర్భాల్లో అది న్యాయసమీక్ష పరిధిలోకి వస్తుందని ధర్మాసనం స్పష్టంచేసింది.

గవర్నర్ బిల్లును రాష్ట్రపతికి రిజర్వ్ చేసిన ప్రతిసారీ ఆర్టికల్ 143 కింద రాష్ట్రపతి సుప్రీంను సంప్రదించాల్సిన

- మిగతా 2 లో

బీహార్‌లో కొలువైన ఎన్డీయే సర్కార్

10వ సారి సీఎంగా నితీశ్

- మంత్రులుగా 26 మంది ప్రమాణస్వీకారం
- బీజేపీ నుంచి ఇద్దరు డిప్యూటీ సీఎంలు
- ప్రధాని మోదీ సహ హాజరైన ప్రముఖులు

పట్నా: జనతాదళ్ (యునైటెడ్) అధినేత నితీశ్ కుమార్ బీహార్ ముఖ్యమంత్రిగా పదోసారి ప్రమాణస్వీకారం చేసి రికార్డు సృష్టించారు. పట్నాలోని గాంధీ మైదానంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్‌సింగ్, ఏపీ సీఎం చంద్రబాబు, ఎన్డీఏ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యారు. ముఖ్యమంత్రి నితీశ్ కాకుండా మరో 26 మందితో గవర్నర్ మంత్రులుగా ప్రమాణం చేయించారు. ఇందులో బీజేపీ నేతలు

- మిగతా 2 లో

గ్రామీణ భారత్ అభివృద్ధికి
నాబార్డ్ వెన్నెముక

- సంస్థాగత విప్లవంతోనే గ్రీన్ రివల్యూషన్ సాధ్యం
- రూ. 21 వేల కోట్లతో రైతు రుణమాఫీ
- 22 లక్షల కుటుంబాలకు ఉపశమనం: భట్టి

విశాలాంధ్ర - హైదరాబాద్: రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ధృఢ సంకల్పంతో ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. మాదాపూర్ హైటెక్స్ లో గురువారం నాబార్డ్ ప్రథమ ఎర్త్ సమ్మిట్ జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన భట్టి మాట్లాడుతూ... రూ. 21 వేల కోట్లతో రుణమాఫీ చేసి 22 లక్షల కుటుంబాలకు ఉపశమనం కల్పించామన్నారు. పారదర్శకంగా రైతు భరోసా అమలు చేస్తున్నామన్నారు. ఒక్క సంక్షోభ సమయాల్లోనే కాదు, ప్రతి నిత్యం అన్నదాతలకు ప్రజా ప్రభుత్వం తోడుగా ఉంటుందన్నారు. ప్రతికూలతను సైతం సమృద్ధిగా మార్చే నిశ్శబ్ద ధైర్యంలో ఉందన్నారు. ఈ జాతీయ కార్యక్రమం హైదరాబాద్‌లో ప్రారంభం కావడం చాలా సముచితమని తెలిపారు. దూరదృష్టి కలిగిన జాతీయ నాయకులు నిర్మించిన

- మిగతా 2 లో

అటవీ సంపద దోపిడీకే ఎన్‌కౌంటర్లు

- ఉగ్రవాదులతో చర్చిస్తారు... మావోయిస్టులకు అవకాశమివ్వరా?
- ఎన్‌కౌంటర్లపై శ్వేతపత్రం ఇవ్వాలి
- మృతదేహాలకు శవపరీక్షలు జరపాలి
- రౌండ్ టేబుల్‌లో వక్తలు
- నేడు అఖిలపక్షాల ధర్నా

విశాలాంధ్ర-హైదరాబాద్: శాంతి చర్చల కోసం మావోయిస్టుల పిలుపును విస్మరిస్తున్న మోదీ ప్రభుత్వం బూటకపు ఎన్‌కౌంటర్లు చేయిస్తూ నరమేథం సృష్టిస్తోందని వక్తలు విమర్శించారు. ఉగ్రవాదులతో చర్చలు జరుపుతారు కానీ మావోయిస్టులతో చర్చలు జరిపేందుకు ఎందుకు ముందుకు రావడం లేదని ప్రశ్నించారు. అభివృద్ధి నమూనా నెపంతో అటవీ సంపద, ఖనిజాలను కార్పొరేట్లకు దారాదత్తం చేయకుండా అడ్డుపడుతున్నారనే ఎన్‌కౌంటర్ల పేరుతో మావోయిస్టులను కేంద్ర ప్రభుత్వం హత్యలు చేయిస్తున్నదని వ్యాఖ్యానించారు. 2026 మార్చికి అటవీ సంపదను కార్పొరేట్లకు అప్పగిస్తామని ఇచ్చిన మాట కోసమే మావోయిస్టుల హత్యలు జరుగుతున్నాయని వక్తలు ఆగ్రహం వ్యక్తంచేశారు. లొంగిపోయేందుకు ప్రయత్నిస్తున్న మావోయిస్టులను కాల్చి చంపుతున్నారని విమర్శించారు. బూటకపు ఎన్‌కౌంటర్లకు నిరసనగా శుక్రవారం హైదరాబాద్‌లో 'అఖిలపక్షాల ధర్నా'ను సీపీఐ నిర్వహించబోతోంది. దీనిని పురస్కరించుకొని గురువారం పార్టీ కార్యాలయం మఖ్దూంభవన్‌లో రౌండ్ టేబుల్ జరిగింది. సమావేశానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అధ్యక్షత వహించారు. వామపక్ష, రాజకీయ మేధావులు, ప్రజా సంఘాలు, పౌర సంఘాల నాయకులు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా సంతకాల సేకరణ చేపట్టాలని వక్తలు సూచించారు. కమ్యూనిస్టులను, వామపక్ష భావజాలమున్న వారిని బలహీనపర్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. మత రాజకీయం చేస్తూ, సమాజాన్ని విభజిస్తూ, అధికారమే పరమపదిగా ఎంతకైనా తెగిస్తోందని అన్నారు. బీజేపీ-ఆర్‌ఎస్‌ఎస్ ఉచ్చులో విద్యావంతులు చిక్కుకోవడం

- మిగతా 2 లో

నివాసయోగ్య నగరంగా
తీర్చిదిద్దుతాం

రేవంత్‌తో అనలాగ్ ఏఐ సీఈవో భేటీ

విశాలాంధ్ర - హైదరాబాద్: హైదరాబాద్‌ను దేశంలోనే అత్యంత నివాసయోగ్య నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం వీలైనంత సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. అనలాగ్ ఏఐ సీఈఓ అలెక్స్ కిప్‌మన్ గురువారం ఉదయం సీఎంతో భేటీ అయ్యారు. ట్రాఫిక్, అర్బన్ ఫ్లడ్డింగ్, సరస్సుల రక్షణ, వాతావరణ అంచనా, పరిశ్రమల కాలుష్య నియంత్రణకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పరిష్కరించే మార్గాలపై చర్చించారు. 'ఫిజికల్ ఇంటెలిజెన్స్' ఆధారంగా రియల్ టైమ్ సెన్సార్ నెట్వర్క్, స్మార్ట్ సిటీ నిర్వహణ పద్ధతులను అమలు చేసే వీలుందని అభిప్రాయపడ్డారు. ఇందులో

- మిగతా 2 లో

80 కోట్ల మంది పేదలకు ఉచిత బియ్యం

దేశవ్యాప్తంగా 2 కోట్ల 50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

తెలంగాణలో రూ.2.25 లక్షల కోట్లు రైతు ఖాతాల్లో జమ: ప్రహ్లాద్ జోషి

విశాలాంధ్ర బ్యూరో-నల్లగొండ: ఆహార భద్రతలో భాగంగా దేశంలోని 80 కోట్ల మంది పేద ప్రజలకు ప్రతినెల ఐదు కిలోల చొప్పున ఉచితంగా బియ్యాన్ని అందజేస్తున్నట్లు కేంద్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి చెప్పారు. నల్లగొండలో నూతనంగా నిర్మించిన భారత ఆహార సంస్థ డివిజనల్ కార్యాలయాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. కేంద్ర మంత్రి మాట్లాడుతూ కోవిడ్ విపత్తు నుంచి ఏ ఒక్కరూ ఆకలితో చనిపోకూడదన్న ఉద్దేశంతో పేదలకు ఐదు కిలోల చొప్పున ఉచిత బియ్యం ఇస్తున్నామని తెలిపారు. ఈ పథకాన్ని 2030 వరకు కొనసాగించాలని ప్రధాని మోదీ నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ప్రపంచంలో ఏ దేశంలోనూ ఇంత పెద్ద మొత్తంలో పేదలకు ప్రతినెల ఐదు కిలోల బియ్యం ఇవ్వటం లేదని అన్నారు. ప్రపంచ బ్యాంకు సైతం తన నివేదికలో దేశంలో అత్యంత

- మిగతా 2 లో

అందరికీ సన్న బియ్యం

- ధాన్యం కొనుగోళ్లు పెంచండి
- ఎగుమతి అవకాశాలు పరిశీలించండి
- కేంద్రానికి సీఎం రేవంత్ వినతి

విశాలాంధ్ర - హైదరాబాద్: తెలంగాణలో అమలు చేస్తున్న సన్న బియ్యం పంపిణీ విజయవంతమైందని... దేశమంతటా ఈ పథకాన్ని విస్తరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి... కేంద్ర ఆహార, పౌర సరఫరాల శాఖమంత్రి ప్రహ్లాద్ జోషిని కోరారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని సీఎం వివరించారు. దీంతో పీడీఎస్ బియ్యం రీసైక్లింగ్ తగ్గిందని, బహిరంగ మార్కెట్లోనూ ధరలు స్థిరపడ్డాయని చెప్పారు. ప్రజలు తినే బియ్యాన్ని పంపిణీ చేయటంతో ఈ పథకం ఆశించిన లక్ష్యం నెరవేరిందని అన్నారు. తెలంగాణ వలెనే కేంద్రం కూడా దేశవ్యాప్తంగా సన్న బియ్యం పంపిణీ చేసే అంశాన్ని పరిశీలించాలని సీఎం సూచించారు. పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి దేశవ్యాప్తంగా సన్న బియ్యం పంపిణీ అంశంపై నిర్ణయం తీసుకుంటామని కేంద్ర మంత్రి ఈ సందర్భంగా బదులిచ్చారు. గురువారం హైదరాబాద్‌కు విచ్చేసిన కేంద్ర మంత్రితో హోటల్ తాజ్ కృష్ణాలో సీఎం భేటీ అయ్యారు. సీఎంతో పాటు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, సీఎస్ రామకృష్ణారావు, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సివిల్ సప్లయిస్ ప్రిన్సిపల్ సెక్రటరీ స్టీఫెన్ రవీంద్ర ఉన్నారు. రాష్ట్రానికి తగిన సహకారం అందించాలని కోరారు. 2024-25 రబీ సీజన్‌కు సంబంధించి అదనంగా 10 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ కోటా పెంచాలని కోరారు. పీడీఎస్ కింద సరఫరా చేసిన లెవీ రైస్‌కు సంబంధించిన రూ.1,468 కోట్లు, పీఎంజీకేవైకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రూ. 343.27 కోట్లు విడుదల చేయాలని కోరారు. 2024-25 ఖరీఫ్ కస్టమ్ మిల్లింగ్ రైస్ వ్యవధి పొడిగించాలని కోరారు. ఎఫ్‌సీఐ గోదాముల్లో నిల్వ ఇబ్బందులను అధిగమించేందుకు అదనపు బాయిల్డ్ రైస్

- మిగతా 2 లో

ఇదీ లోకం!

ఇక మిగిలింది ' మైనింగ్ ఎన్‌కౌంటర్'

మతోన్మాదుల మెడలు వంచేది కమ్యూనిస్టులే

- బీజేపీని ఓడించడంలో చతికిలపడిన కాంగ్రెస్
- మావోయిస్టులు ప్రజా ఉద్యమాల్లో భాగస్వామ్యం కావాలి
- బస్సు జాతాలో ఈటి నర్సింహ

విశాలాంధ్ర- కాప్రా: దేశంలో మతోన్మాదుల మెడలు వంచేది కమ్యూనిస్టులేనని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి. నర్సింహ అన్నారు. డిసెంబరు 26న ఖమ్మంలో జరగనున్న సీపీఐ శతవసంతాల ముగింపు బహిరంగ సభను పురస్కరించుకుని పార్టీ రాష్ట్ర సమితి అధ్వర్యంలో బాసర నుంచి ప్రారంభమైన బస్సు జాతా మేడ్చల్ జిల్లా ఈసీఐఎల్‌లోకి గురువారం ప్రవేశించింది. దమ్మాయిగూడా నుంచి అంబేద్కర్ కూడలి వరకు ఉప్పల్ నియోజకవర్గ నాయకత్వం భారీ ఎత్తున జాతా బృందానికి స్వాగతం పలికింది. జాతాకు నాయకత్వం వహిస్తున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ, వలి ఉల్లా ఖాద్రి, ఉప్పలయ్య, నరేంద్ర ప్రసాద్‌కు నాయకులు పూలమాలలు, ఎర్రని కండువాలు వేసి ఆహ్వానించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు

- మిగతా 2 లో

హామీ ఇవ్వలేం

- కోర్టు కార్యకలాపాల వేగవంతానికి ఆదేశాలిస్తాం
- ఉమర్, షర్జిల్ బెయిల్‌పై సుప్రీం కోర్టు
- 'మేధావి' ఉగ్రవాదులతో ఎక్కువ ప్రమాదం
- దిల్లీ పోలీసుల వాదన

న్యూఢిల్లీ: దిల్లీ అల్లర్ల కేసులో హక్కుల కార్యకర్తలు ఉమర్ ఖాలీద్, షర్జిల్ ఇమామ్ బెయిల్‌కు హామీ ఇవ్వలేమని సర్వోన్నత న్యాయస్థానం గురువారం తేల్చిచెప్పింది. కార్యకలాపాలు వేగవంతం చేసేలా కిందిస్థాయి కోర్టుకు ఆదేశాలు ఇవ్వగలమని పేర్కొంది. కేసులో నిందితుల్లో ఉన్న ప్రతి ఒక్కరిపై ఆరోపణలకు సంబం ధించి దిల్లీ పోలీసుల నుంచి స్పష్టతను సుప్రీంకోర్టు కోరింది. వాదనలను బెయిల్ వరకే పరిమితం చేయాలని అదనపు సొలిసిటర్ జన రల్‌కు సూచించింది. ఈ వ్యవహారంలో ప్రతి నిందితుడి పాత్రను ప్రత్యేకంగా గుర్తించి, వివరించాలని ప్రాసిక్యూషన్‌ను జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ ఎన్‌వీ అంజరియాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఆదేశించింది. దీర్ఘకాలం కస్టడీలో ఉన్నారు కాబట్టి యూఏపీఏ కేసులో బెయిల్ ఇవ్వాలనడం సమంజసం కాదని పేర్కొంది. ఒక్కొక్కరిపై ఆరోపణలను విడివిడిగా పరిశీలిస్తామని, విచారణ పురోగతిని గమనిస్తామని వెల్లడించింది. అయితే ఉమర్ ఖాలీద్‌తో పాటు మిగతా నిందితులకు బెయిల్ ఇవ్వొద్దని దిల్లీ పోలీసుల తరపు న్యాయవాదులు బలంగా వాదించారు. దిల్లీ

- మిగతా 2 లో

సుంకాలతో యుద్ధాలు ఆపాను

350 శాతం విధిస్తామంటేనే భారత్-పాక్ శాంతించాయి: ట్రంప్

వాషింగ్టన్: భారత్, పాకిస్థాన్ మధ్య యుద్ధం ఆపిన ఘనత తనకే దక్కుతుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మళ్లీ చెప్పుకున్నారు. '350 శాతం సుంకం విధిస్తానని హెచ్చరిస్తే ఆ దేశాలు వెనక్కు తగ్గాయి. లేదంటే ఇది అణు యుద్ధంగా మారేది' అని అమెరికా-సౌదీ పెట్టుబడుల ఫోరం సందర్భంగా ఆయన అన్నారు. ఘర్షణ ప్రారంభంలోనే ఆర్థికపరంగా తీవ్ర పరిణామాలు తప్పబోవంటూ భారత్, పాక్‌ను హెచ్చరించినట్లు చెప్పుకున్నారు. 'ఓ దేశం లేదు, మీరు అలా చేయడానికి వీల్లేదని చెబితే... చేసి చూపిస్తానంటూ గదమాయించాను. ఒకరిపై ఒకరం అణు దాడులు చేసుకోవడానికి నేను ఒప్పుకోను అని చెప్పాను. మీరు అలా చేయడం మాకు ఇష్టం లేదని వాళ్లు అన్నప్పుడు.... మీకు ఇష్టం ఉన్నా లేకపోయినా నేను ఇలానే చేస్తా అంటూ కరాఖండీగా చెప్పేశాను' అంటూ నాడు భారత్-పాక్‌తో జరిపిన సంభాషణను ట్రంప్ గుర్తుచేసుకున్నారు. 'యుద్ధం ఆపకపోతే 350 శాతం సుంకం విధిస్తా... ఆపేస్తే మంచి వాణిజ్య ఒప్పందం చేసుకుందాం అని వాళ్లతో నేను చెప్పాను. వేరొక అధ్యక్షుడైతే ఇలా చేసేవారు కాదు. జో బైడెన్ లాంటి వారికైతే అసలు దేశాల మధ్య ఏం జరుగుతుందో కూడా తెలిసేది కాదు. ప్రపంచం ఏమైపోయినా ఎలాంటి చర్యలు తీసుకునే వారు కాదు. చాలా ఘర్షణలకు సుంకాల హెచ్చరికలతో పరిష్కారించాను. ఎనిమిదిలో ఐదు యుద్ధాలకు పరిష్కారం వాణిజ్యం, సుంకాలతోనే లభించింది' అని ట్రంప్ వెల్లడించారు.

సుడాన్ శాంతికి కృషిచేస్తా

సూడాన్‌లో కిరాతక పౌర యుద్ధాన్ని ముగించేందుకు కృషి చేస్తానని డొనాల్డ్ ట్రంప్ అన్నారు. సౌదీ యువరాజు విజ్ఞప్తి మేరకు ఈ యుద్ధం ముగింపునకు చర్యలపై దృష్టిని కేంద్రీకరిస్తానని చెప్పారు. ఇప్పటివరకు దీని ఆలోచన కూడా లేదన్నారు. మహమ్మద్ బిన్ సల్మాన్‌తో ఈ విషయంలో సుదీర్ఘ చర్చ జరిగిందని, యుద్ధాన్ని ముగించేలా అక్కడి నాయకత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు మీకున్న పలుకుబడి, అధికారాన్ని వినియోగించాలని ఆయన కోరడంతో ఆ మేరకు కృషి చేస్తానని మాట ఇచ్చానని ట్రంప్ చెప్పారు.

విదేశీ నిపుణులు లేకుండా పనిజరగదు

నైపుణ్యతగల విదేశీ ఉద్యోగులను అమెరికా స్వాగతిస్తుందని అధ్యక్షుడు ట్రంప్ మరోమారు అన్నారు. అమెరికా కార్మికులకు చిప్పులు, క్షిపణుల తయారీ వంటి క్లిష్టమైన విధానాలను నేర్పేందుకు నిపుణులైన వలస ఉద్యోగుల అవకాశం తమ దేశానికి ఉందని చెప్పారు. అయితే ఇమిగ్రేషన్ ఆంక్షలకు మద్దతిచ్చే వర్గం నుంచి వచ్చే కొద్దిపాటి వ్యతిరేకతను నిలద్రొక్కుకుంటానన్నారు. అమెరికన్లు అసమర్థులు కాదు కానీ అవసరమైన నైపుణ్యత వారిలో కొరవడిందని, అందుకే విదేశీ నిపుణుల శిక్షణ అవసరమని ఆ వర్గాన్ని సముదాయించాలి. అది నేను చూసుకుంటా. ఇది ఆందోళన కలిగించే విషయం కాదు. అమెరికా ఆర్థికాభివృద్ధికి గణనీయమైన తోడ్పాటు అందించలా ప్లాంట్లు సహా అతి సంక్లిష్టమైన నిర్మాణాలు దేశంలో జరుగుతున్నాయి. వీటిలో పనిచేసే నైపుణ్యతను అమెరికన్లు పెంచుకోవాలి. అప్పటివరకు విదేశీ నిపుణులను దేశంలోకి స్వాగతిస్తాం' అని ట్రంప్ అన్నారు.

నేడు మమ్దానీ-ట్రంప్ భేటీ

న్యూయార్క్ నూతన మేయర్‌గా ఎన్నికైన జొహ్రాన్ మమ్దానీతో ట్రంప్ శుక్రవారం తొలిసారి భేటీ కానున్నారు. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా సామాజిక మాధ్యమం ద్వారా ప్రకటించారు. 'న్యూయార్క్ నగరానికి కమ్యూనిస్టు మేయర్ జొహ్రాన్ 'ఖ్వామే' మమ్దానీ విజ్ఞప్తి మేరకు శుక్రవారం అనగా 21వ తేదీన ఒవల్ కార్యాలయంలో సమావేశం జరగబోతోంది. తదుపరి వివరాలు తర్వాత తెలియజేస్తాం' అని ట్రంప్ పోస్టు పేర్కొంది. ఎన్నికలప్పుడు మమ్దానీకి వ్యతిరేకంగా ట్రంప్ ప్రచారం చేసిన నేపథ్యంలో ఈ సమావేశానికి ప్రాధాన్యత ఏర్పడింది. ప్రజా భద్రత, ఆర్థిక భద్రత తదితర అంశాలపై చర్చించేందుకు ట్రంప్ సమయాన్ని కోరినట్లు మమ్దానీ అధికార ప్రతినిధి వెల్లడించారు.

రష్యాకు ట్రంప్ మద్దతు...

ఉక్రెయిన్‌కు షాక్

వాషింగ్టన్: ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీకి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గట్టి షాక్ ఇచ్చారు. రష్యాకు అనుకూలంగా ఉన్న శాంతి ప్రణాళికను ఆమోదించారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగించేందుకు అమెరికా, రష్యా సంయుక్తంగా రూపొందించిన 28 అంశాల ప్రణాళికలో చాలా వరకు ప్రతిపాదనలు రష్యాకు అనుకూలంగా ఉన్నాయి. ట్రంప్ ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్, ఉక్రెయిన్ జాతీయ భద్రతాధిపతి రుస్తుమ్ ఉమరోవ్ మధ్య దీనిపై చర్చ జరిగింది. ఆమోదించాలని అమెరికా కోరుగా జెలెన్‌స్కీ ఒప్పుకోలేదు. రష్యాకు అనుకూలంగా ఉన్న ఈ ప్రతిపాదనలకు అంగీకరిస్తే తమ దేశం సార్వభౌమత్వాన్ని కోల్పోతుందన్నారు. జెలెన్‌స్కీ వ్యతిరేకిస్తున్నప్పటికీ ఈ ప్రణాళికకు ట్రంప్ మద్దతిచ్చినట్లు తెలుస్తోంది.

'జెఫ్రీ ఎప్‌స్టీన్' దస్త్రాల విడుదల బిల్లుపై ట్రంప్ సంతకం

జెఫ్రీ ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణానికి సంబంధించిన దస్త్రాలు (ఫైళ్లు) విడుదల చేసేందుకు తీసుకొచ్చిన బిల్లుపై ట్రంప్ సంతకం చేశారు. ఈ విషయాన్ని ఆయన ట్రూత్ సోషల్‌లో ప్రకటించారు. 'డెమోక్రాట్ల గురించి.. నిందితుడు జెఫ్రీతో వారికి ఉన్న అనుబంధాల గురించి నిజాలు బయటకు రానున్నాయి' అంటూ పోస్టు పెట్టారు. ఈ కేసు ఫైళ్ల విడుదలకు ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు. ఎప్‌స్టీన్ కేసును అనేక అంశాలపై ప్రజల దృష్టిని మళ్లించడానికి ఓ ఆయుధంగా పదేపదే వినియోగమవుతోందని ట్రంప్ వ్యాఖ్యానించారు. 'ఎప్‌స్టీన్ ఫైల్స్ ట్రాన్స్‌పరెన్సీ యాక్ట్' అని ఈ బిల్లుకు పేరు పెట్టారు. ఎప్‌స్టీన్ ఫైల్స్ విడుదలకు ప్రతినిధుల సభ 427-1 ఓట్లతో ఆమోదించింది. ఆ తర్వాత సెనెట్ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఇప్పుడు అధ్యక్షుడు ట్రంప్ ఆ బిల్లుపై సంతకం చేశారు. ఎప్‌స్టీన్ ఫైళ్లు, 2019లో జైలులో అతడి మరణంపై దర్యాప్తు సమాచారాన్ని 30 రోజుల్లోగా న్యాయ వ్యవస్థ విడుదల చేయాలి. బాధితుల వివరాలు, దర్యాప్తును ప్రభావితం చేసే వివరాలను బయటపెట్టకపోవచ్చని సమాచారం.

సుప్రీం యూటర్న్

(మొదటిపేజీ తరువాయి)

అవసరం లేదని, ఆర్టికల్ 200 కింద గవర్నర్లకు విచక్షణాధికారం ఉంటుందని, అయితే, దాన్ని అపరిమితంగా వినియోగించలేరని పేర్కొంది. కాగా, శాసనసభలు ఒకటికి రెండుసార్లు ఆమోదించిన బిల్లులను గవర్నర్లు ఆమోదం తెలపకుండా కాలయాపన చేయడం, రాష్ట్రపతి పరిశీలనలో ఉన్నవీ తీవ్ర జాప్యానికి గురికావడంపై ఈ ఏడాది ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు సంచలన నిర్ణయం తీసుకున్నది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ అంశంలో గవర్నర్‌తో పాటు రాష్ట్రపతికీ గడువు విధించింది. గరిష్ఠంగా మూడు నెలల్లోగా ఆ బిల్లులను ఆమోదించడమో, తిప్పి పంపించడమో చేయాలని జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహాదేవన్ ధర్మాసనం నిర్దేశించింది. దీంతో రాజ్యాంగ అధికరణం 143(1) ప్రకారం తనకున్న అధికారాన్ని వినియోగిస్తూ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము మే నెలలో కొన్ని ప్రశ్నలతో సీజేఐకి లేఖ రాశారు. రాష్ట్రపతి విచక్షణ అధికారాల పరిధిలోకి వచ్చే రాష్ట్రాల బిల్లులకు ఆమోదం తెలిపే అంశంలో న్యాయస్థానం గడువు విధించడం ఎంతవరకు న్యాయ సమ్మతమో తెలపాలంటూ సుప్రీంకోర్టు అభిప్రాయాన్ని కోరారు. దీనిపై సీజేఐ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటైంది. పది రోజుల పాటు అన్ని పక్షాల వాదనలు ఆలకించిన ధర్మాసనం... సెప్టెంబరు 11న తీర్పు రిజర్వు చేసింది. ఈ విషయంలో రాష్ట్రపతి, గవర్నర్లకు గడువు విధించలేమని తాజాగా తీర్పు వెలువరించింది.

రాబర్ట్ వాద్రాపై ఈడీ చార్జిషీట్

(మొదటిపేజీ తరువాయి)

దాఖలు చేసింది. గతంలో భండారీకి సంబంధించిన కేసులో 56 ఏళ్ల వాద్రాను ఈడీ ప్రశ్నించింది. అయితే భండారీని అప్పగించాలని చేసిన అభ్యర్థనను బ్రిటన్ కోర్టు తిరస్కరించింది. దీంతో జులైలో పారిపోయిన భండారీని ఆర్థిక నేరస్థుడిగా ఢిల్లీ కోర్టు ప్రకటించింది. 63 ఏళ్ల ఆయుధ సలహాదారుడు 2016లో ఢిల్లీలో ఆదాయపు పన్ను శాఖ దాడులు చేసిన వెంటనే లండన్‌కు పారిపోయాడు. 2015 నాటి నల్లధన నిరోధక చట్టం కింద భండారీ, ఇతరులపై దాఖలు చేసిన ఐటీ శాఖ చార్జిషీట్‌ను పరిగణనలోకి ఈడీ ఫిబ్రవరి 2017లో పీఎంఎల్‌ఏ కింద క్రిమినల్ కేసు నమోదు చేసింది. లండన్‌లో ఉన్న ఇంటికి సంబంధించి వాద్రాతో భండారీ సంబంధాలపై దర్యాప్తు చేస్తున్నప్పటికీ, దర్యాప్తు సంస్థ గతంలో అతని కేసులో రెండు చార్జిషీట్‌లు దాఖలు చేసింది. తనకు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా లండన్‌లో ఎలాంటి ఆస్తి లేదని వాద్రా ఖండించారు.

హామీ ఇవ్వలేం

(మొదటిపేజీ తరువాయి)

పోలీసుల తరపున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్‌వీ రాజు తాజాగా వాదనలు వినిపించారు. క్షేత్రస్థాయి ఉగ్రవాదుల కంటే ఉగ్రవాదులుగా మారిన మేధావులతోనే ఎక్కువ ప్రమాదమన్నారు. షర్జిల్ ఇమామ్ సీఏఏకు వ్యతిరేకంగా 'రెచ్చగొట్టే' ప్రసంగాలు చేసినట్లు కోర్టుకు కొన్ని వీడియో క్లిప్పులు చూపించారు. షర్జిల్ ఇమామ్ ఇంజినీరింగ్ చదివారని చెబుతూ దేశ వ్యతిరేక కార్యకలాపాల్లో డాక్టర్లు, ఇంజినీర్లు ఉండటం ప్రస్తుత ట్రెండ్ అని రాజు వ్యాఖ్యానించారు. జస్టిస్ కుమార్ స్పందిస్తూ ఈ ప్రసంగాలు చార్జిషీటులో ఉన్నాయా అని ప్రశ్నించారు. అందుకు అవునంటూ రాజు బుదలిచ్చారు. అమెరికా అధ్యక్షుడు భారత్ పర్యటన సమయంలో అంతర్జాతీయ మీడియా దృష్టి దేశంపై ఉంటుందని తెలిసే పౌరసత్వ సవరణ చట్టం వ్యతిరేక ఆందోళనలు, అల్లర్లు పథకం ప్రకారం జరిగాయని ఆరోపించారు. పరిపాలన మార్పు, దేశంలో గందరగోళ పరిస్థితులు సృష్టించడమే వీటి అసలు ఉద్దేశమని రాజు వాదించారు. గతంలో ముగ్గురికి బెయిల్ ఇవ్వడాన్ని చూపి వీరు బెయిల్ కోరలేరన్నారు. ఉమర్, షర్జిల్ సహా మిగతా వారికి బెయిల్ మంజూరు చేయెుద్దని న్యాయస్థానాన్ని రాజు కోరారు. షర్జిల్ ఇమామ్ తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ దవే వాదనలు వినిపించారు. దాదాపు మూడు గంటలు సాగిన ప్రసంగాలలో కొంత భాగాన్ని కత్తిరించి కోర్టులో వీడియోలు చూపించారని అన్నారు. ఎంపిక చేసిన క్లిప్పులు చూపించి కేసును తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఇమామ్ ప్రకటనల పూర్తి పాఠం ప్రతిబింబించేలా ఆ వీడియోలు లేవని దవే వాదించారు.

తీర్చిదిద్దుతాం

(మొదటిపేజీ తరువాయి)

భాగంగా హైదరాబాద్ సిటీలో ఫిజికల్ ఇంటెలిజెన్స్‌ను పైలట్ ప్రాజెక్టుగా చేపట్టాలని నిర్ణయించారు. ఎనిమిది వారాల పాటు ఈ ప్రోగ్రాం అమలవుతుంది. ఇందులో భాగంగా సీసీ టీవీ వ్యవస్థను రియల్ టైమ్ సిటీ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫామ్‌గా మారుస్తారు. ట్రాఫిక్, ప్రజా భద్రత, అత్యవసర సేవలన్నీ ఏఐ ఆధారిత అంచనాలతో ఒకేచోట సమన్వయం చేస్తారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి దీన్ని నిర్వహిస్తారు. ఫ్యూచర్ సిటీని పరిశోధన.. సుస్థిర పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం సంకల్పించిందని సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యాలను వివరించారు. ఆర్థిక వృద్ధికి సైతం ఫిజికల్ ఇంటెలిజెన్స్ అత్యుత్తమ పరిష్కారాలను అందిస్తుందని అలెక్స్ తన నమ్మకాన్ని వ్యక్తం చేశారు. డిసెంబరు ఎనిమిది, తొమ్మిది తేదీల్లో జరిగే గ్లోబల్ సమ్మిట్ కు రావాలని సీఎం ఆయనను ఆహ్వానించారు.

పెట్టుబడుల పేరుతో కారుచౌకగా భూములిస్తారా?

ఏపీ సీఎస్‌కు ఈఏఎస్ శర్మ లేఖ

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: పెట్టుబడులకు ఆహ్వానం నెపంతో ప్రైవేటు యాజమాన్యాలకు, కారుచవకగా ప్రజల భూములను, ఇతర వనరులను, వేలాది కోట్ల రూపాయల రాయితీలను కూటమి ప్రభుత్వం అందిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వ మాజీ కార్యదర్శి ఈఏఎస్ శర్మ విమర్శించారు. ఇదే అంశమై ఆయన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాశారు. 'తెలంగాణ రాష్ట్రంలోని సంగారెడ్డి జిల్లాలో ఐదు నెలల కిందట సిగాచీ కంపెనీలో జరిగిన ప్రమాదంలో 50 మందికి పైగా కార్మికులు మరణించగా, 30 మందికి గాయలయ్యాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇది తెలియనట్టు నటిస్తూ... అదే కంపెనీకి 95 ఎకరాల విలువైన ప్రభుత్వ భూమిని, వేలాది కోట్ల రూపాయల రాయితీలతో ఇవ్వడం బాధాకరం' అని శర్మ పేర్కొన్నారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కలిగిస్తామని ప్రైవేట్ ప్రమోటర్లులు గతంలోనూ హామీలు ఇచ్చారని, అవేవీ కార్యరూపం దాల్చలేదని అన్నారు. ప్రైవేట్ పెట్టుబడులలో 50 శాతానికి పైగా, రాష్ట్ర ప్రజలే భరించే పరిస్థితి ఉన్నదని, ఇలాంటి వాటితో ప్రయోజనం ఏమిటని శర్మ ప్రశ్నించారు. ఎస్సీ ఎస్టీ బీసీలకు ప్రభుత్వరంగ సంస్థల్లో కల్పించేలా ప్రైవేటు సంస్థల్లో రిజర్వేషన్లు ఉండవని, అంటే ఆ వర్గ యువతకు అన్యాయం జరుగుతుందన్నారు. ప్రైవేటు పరిశ్రమల్లో ప్రమాదాల కారణంగా వాటిలో పనిచేసే కార్మికులకు, చుట్టుపక్కల ప్రజల ప్రాణాల రక్షణకు హామీ లేదన్నారు.

80 కోట్ల మంది పేదలకు ఉచిత బియ్యం

(మొదటిపేజీ తరువాయి)

ఎక్కువ మందికి ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తున్న విషయాన్ని పేర్కొన్నట్లు వెల్లడించారు. దేశవ్యాప్తంగా వ్యాప్తంగా రెండు కోట్ల 50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరిస్తున్నామని, ప్రస్తుతం 915 లక్షల మెట్రిక్ టన్నుల నిలువ సామర్థ్యం ఉందని, తెలంగాణతో కలిపి 2023-24లో రూ.2.25 లక్షల కోట్లు కేంద్ర ప్రభుత్వం నేరుగా రైతుల ఖాతాలలో జమ చేసిందని తెలిపారు. ప్రతినెల తెలంగాణకు 1.11 లక్షల మెట్రిక్ టన్నుల ఆహార ధాన్యాలను కేటాయిస్తున్నామని, లక్ష మెట్రిక్ టన్నుల బియ్యం, 3,370 మెట్రిక్ టన్నుల గోధుమలను కేటాయిస్తున్నట్లు వివరించారు. ఆహార భద్రత వ్యవస్థను పటిష్టం చేసేందుకు రేషన్ కార్డులన్నిటిని డిజిటలైజ్ చేసినట్టు పేర్కొన్నారు. నల్లగొండ జిల్లా... ధాన్యం ఉత్పత్తి, సేకరణలో తెలంగాణలోనే ప్రముఖ పాత్ర పోషిస్తుందని చెప్పారు. ఎఫ్‌సీఐ డివిజనల్ కార్యాలయ గోదాం 62 వేల మెట్రిక్ టన్నుల నిలువ సామర్థ్యం ఉందని, ప్రభుత్వం భూమి ఇస్తే మరో ఎఫ్‌సీఐ గోదాంను ఇదే జిల్లాలో ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం ప్రపంచ దేశాలన్నీ ద్రవ్యోల్బణంతో బాధపడుతున్నాయని, ఇండియాలో కేవలం .25 శాతం మాత్రమే ఉందని, పీఎం సూర్యఘర్ ముక్త్ బిజిలి పథకం కింద 20,175 ఇళ్లకు రూ.20 వేల కోట్ల రాయితీతో పథకాన్ని అమలు చేసినట్టు తెలిపారు. రైతులు వరి వైపే కాకుండా ఆయిల్ సీడ్స్, వాణిజ్య పంటలు పండించాలని కోరారు. కోవిడ్ సమయంలో ప్రజా పంపిణీ వ్యవస్థకు రావాల్సిన సబ్సిడీ రూ.343 కోట్లను వెంటనే విడుదల చేస్తామని చెప్పారు. సరైన రికార్డులు సమర్పిస్తే సీఎంఆర్ డెలివరీకి సంబంధించి పదేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న రూ.1,400 కోట్లు మంజూరు చేస్తామని తెలిపారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణకు బాయిల్డ్ రైస్ లక్ష్యాన్ని పెంచాలని కోరారు. సీఎంఆర్ డెలివరీ కాలపరిమితిని 60 రోజులకు, యాసంగి 120 రోజులకు పెంచాలని, 2025- 26 కు సంబంధించి ధాన్యం సేకరణ టార్గెట్ ను 80 లక్షల మెట్రిక్ టన్నుల పైబడి పెంచాలని, ప్రస్తుత ఎఫ్‌సీఐ గోదాం లక్ష మెట్రిక్ టన్నుల సామర్థ్యం వరకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఖరీఫ్‌లో తెలంగాణ 150 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పండించిందని, 80 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరిస్తున్నామని, ఇదివరకే రూ.29 వేల కోట్లు ధాన్యం కొనుగోలుపై ఖర్చు చేసినట్టు చెప్పారు. రాష్ట్రంలో 8,800 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని, ఆహార భద్రత కింద ప్రతి ఒక్కరికి ఆరు కిలోల సన్నబియ్యాన్ని ఇస్తున్నామని తెలిపారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ నల్లగొండ జిల్లా బత్తాయి పంటకు ప్రసిద్ధి చెందిందని, అందువల్ల 2,500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన బత్తాయి కోల్డ్ స్టోరేజ్ మంజూరు చేయాలని, ప్రైవేటు... ప్రభుత్వ భాగస్వామ్యంలో లక్ష మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోదామును మంజూరు చేయాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి, ఎఫ్‌సీఐ ఈడీ వనిత శర్మ, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ , కలెక్టర్ ఇలా త్రిపాఠి, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, ఎఫ్‌సీఐ జిల్లా మేనేజర్ రాజు, అధికారులు పాల్గొన్నారు.

మతోన్మాదుల మెడలు వంచేది కమ్యూనిస్టులే

(మొదటిపేజీ తరువాయి)

వి.ఎస్. బోస్ మాట్లాడుతూ... దేశంలో అనేక రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్... బీజేపీని ఓడించడంలో చతికిలపడిందని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా కమ్యూనిస్టులు పురోగమిస్తున్నారని అన్నారు. భారత దేశంలో మావోయిస్టులు... తుపాకీ గొట్టం ద్వారానే రాజ్యాధికారం అన్న తమ పంథాను వీడి ప్రజాస్వామ్య ఉద్యమాలలో కమ్యూనిస్టులతో కలిసి రావాలని పిలుపునిచ్చారు. చీలిపోయిన కమ్యూనిస్టులు సైతం ఏకం కావాలని అన్నారు. దేశంలో నిరుద్యోగం, అధిక ధరలు, రూపాయి పతనంతో మరింత ఆర్థిక మాంద్యం ఏర్పడిందని... ఈ క్రమంలో ప్రజలు కమ్యూనిస్టుల వైపు చూస్తున్నారని, దేశంలో మతోన్మాద శక్తులను ఎదుర్కొనేందుకు కమ్యూనిస్టులే ప్రత్యామ్నాయంగా నిలిచారని అన్నారు. విద్యార్థి, యువజన, మహిళా, కార్మిక, కర్షక, మేధావి వర్గాలతో సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయాలని ప్రజా సంఘాలకు దిశానిర్దేశం చేశారు. మావోయిస్టు నాయకులను పట్టుకొని కాల్చి చంపి... ఎదురుకాల్పులు అంటూ తప్పుడు ప్రకటనలు ఇస్తున్నారని మండిపడ్డారు. బూటకపు ఎదురుకాల్పులు, బీజేపీ చేస్తున్న మానవ హననానికి వ్యతిరేకంగా ప్రజాస్వామిక వాదులు రోడ్ల మీదికి రావాలని పిలుపునిచ్చారు. బీజేపీ చేస్తున్న దుర్మార్గ రాజకీయాలను తిప్పి కొట్టడానికి కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని అన్నారు. పశ్య పద్మ మాట్లాడుతూ నిత్యం ప్రజా సమస్యల పరిష్కారమే అజెండాతో ప్రజల మన్ననలు పొందిన ఏకైక రాజకీయ పార్టీ సీపీఐ అని అన్నారు. సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, రాష్ట్ర సమితి సభ్యుడు జీ దామోదర్ రెడ్డి, సాయిలు గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు శంకర్ రావు, ధర్మేంద్ర, సత్య ప్రసాద్, శంకర్, రచ్చ కిషన్, నర్సింహ, సీపీఐ ఉప్పల్ నియోజకవర్గ నేతలు నారా నర్సింహ, బాబురావు, సాంబశివరావు, జాన్, మిరియాల సాయిలు, స్వరూప, రాజేశ్వరి, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ నేతలు గిరిబాబు, వికాస్, నదీమ్, మహేష్, అజీమ్, సమీర్, శబాజ్, షోయబ్ పాల్గొన్నారు.

అటవీ సంపద దోపిడీకే ఎన్‌కౌంటర్లు

(మొదటిపేజీ తరువాయి)

బాధాకరమన్నారు. బీజేపీ విధానాలను వ్యతిరేకించాలని, ఇందుకోసం అన్ని వర్గాల ప్రజలు కలిసి రావాలని వక్తలు పిలుపునిచ్చారు. కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ఎన్‌కౌంటర్ల పేరిట కాల్చి చంపిన మావోయిస్టుల మృతదేహాలకు న్యాయమూర్తి, కుటుంబ సభ్యుల సమక్షంలో శవపరీక్షలు నిర్వహించాలని, ప్రక్రియను వీడియో తీయాలని డిమాండ్ చేశారు. రాముడి పేరు జపిస్తున్న మోదీ సర్కారు కనీసం రాక్షస నీతిని పాటించడం లేదని విమర్శించారు. మానవ హననాన్ని ఏ శాస్త్రం, ఏ ధర్మం చెబుతోందని నిలదీశారు. ఎన్‌కౌంటర్ అంటే ఏమిటో తెలియనివారు కేంద్ర మంత్రులుగా ఉన్నారని కూనంనేని ఎద్దేవా చేశారు. కమ్యూనిస్టులు, మావోయిస్టులకు మధ్య భావజాలంలో తేడా ఉన్నప్పటికీ పేదల కోసమే పని చేస్తాయన్నారని తెలిపారు. ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ చేపట్టాలని, ఇప్పటివరకు జరిగిన ఎన్‌కౌంటర్లపై శ్వేతపత్రం విడుదల చేయాలని కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ మాట్లాడుతూ ప్రజా జీవితంలోకి వస్తామనే మావోయిస్టులకు అవకాశం ఇవ్వకుండా కాల్చి చంపేస్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. ఫాసిస్టు శక్తులు బలపడితే దేశానికి, సమాజానికి ప్రమాదకరమన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించాలని, కమ్యూనిస్టులు, కాంగ్రెస్ ఏకం కావాలన్నారు. బీహార్ తరహా తెలంగాణలోనూ ఎస్ఐఆర్‌కు ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఓటర్లు అప్రమత్తంగా ఉండాలని గౌడ్ సూచించారు. భారత్‌ను కార్పొరేట్ దేశంగా చేసే ప్రయత్నాలను తిప్పికొట్టాలన్నారు. మావోయిస్టులు కీలక నాయకులు హిడ్మా, కేశవరావు, తిరుపతి వంటి వారు ఎంచుకున్న పద్ధతి ప్రభుత్వాలకు నచ్చకపోయినాగానీ వారు తమ జీవితాన్ని ప్రజల కోసం పోరాటానికి అంకితం చేశారని మహేశ్ కుమార్ గౌడ గుర్తు చేశారు. ప్రజాస్వామ్యంలో చంపడం ఒక్కటే పరిష్కారం కాదన్నారు. చత్తీస్‌గఢ్, జార్ఖండ్ వంటి రాష్ట్రాల్లో ఉన్న విలువైన ఖనిజ సంపదను కార్పొరేట్లకు అప్పగించేందుకే కేంద్రం ప్రయత్నిస్తోందని దుయ్యబట్టారు. టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ రాజకీయ ఉద్యమాలను హింసతో రూపుమపలేమన్నారు. మనుషులను చంపే అధికారం చట్టం ఎవరికీ ఇవ్వలేదన్నారు. ఎన్‌కౌంటర్లలో పాల్గొన్న పోలీసులపై కేసు పెట్టి, విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. జాతీయ కమిషన్ మార్గదర్శకాలు పాటించాలన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ ప్రశ్నిస్తే దాడి చేయడం మోదీ ప్రభుత్వానికి పరిపాటైందని విమర్శించారు. మావోయిస్టులతో పాటు అన్ని రంగాలు, వ్యవస్థలపైన కేంద్రం ఎన్‌కౌంటర్ చేస్తోందన్నారు. బీజేపీ అధికారంలో లేని రాష్ట్రాల ప్రభుత్వాలను గవర్నర్ల ద్వారా ఇబ్బంది పెడుతోందని జూలకంటి అన్నారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ కేంద్రం చెప్పే అభివృద్ధి నమూనాలో మానవతా విలువలు లేవని, వనరులు కార్పొరేట్లకు అప్పగిస్తే ప్రకృతి నాశనమవుతుందని వ్యాఖ్యానించారు. ఆదివాసీల హక్కులను కాలరాస్తున్నారని, రాజ్యంగం, చట్టాలను సక్రమంగా అమలు చేయడం లేదని, సుప్రీం కోర్టు చీవాట్లు పెట్టినా మార్పు రాలేదని అన్నారు. జస్టిస్ చంద్ర కుమార్ మాట్లాడుతూ బూటకపు ఎన్‌కౌంటర్లు మానుకోవాలని, మావోయిస్టులతో చర్చలు జరిపి, సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సాయుధ పోరాటాన్ని వదిలి ప్రజా జీవితంలోనికి రావాలని మావోయిస్టులను అరుణోదయ సాంస్కృతిక మండలి నాయకురాలు విమలక్క మాట్లాడుతూ మావోయిస్టులు చేసేది హింస అయితే, వారిని చంపేందుకు కేంద్రం చేస్తున్న ప్రతి హింస కాదా అని ప్రశ్నించారు. సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ మాస్ రాష్ట్ర నాయకుడు హన్మేశ్, చలపతిరావు (సీపీఐ (ఎంఎల్) న్యూడెమొక్రసి), రమేశ్ రాజా (సీపీఐ (ఎంఎల్) లిబరేషన్), సీపీఐ (ఎంఎల్) చంద్రన్న గ్రూప్ నాయకుడు భాస్కర్, ఎస్‌యూసీఐ (యు) మురహరి, సీపీఐ(ఎంఎల్) నాయకులు గుర్రం విజయ్‌కుమార్ ప్రశంగించారు. సమావేశంలో తెలంగాణ పౌర హక్కుల నాయకుడు నారాయణతో, సీపీఐ నాయకులు ఈటీ నరసింహ, చాయాదేవి, నెదునూరి జ్యోతి, రమావత్ అంజయ్య నాయక్, స్టాలిన్, ఫైమిదా తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ భారత్ అభివృద్ధికి నాబార్డ్ వెన్నెముక

(మొదటిపేజీ తరువాయి)

సంస్థల పునాదిపై ఈ నగరం ఎదిగింది అని తెలిపారు. సంస్థాగత విప్లవం లేకుండా ఏ గ్రీన్ రివల్యూషన్ సాధ్యం కాదని గుర్తు చేసుకోవాలని సూచించారు. "మిగతా అన్నీ ఆగొచ్చు, వ్యవసాయం ఆగకూడదు" అనే నమ్మకంతో వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, సాగునీటి సంఘాలు, శాస్త్రీయ పరిశోధనా సంస్థలు వంటి వ్యవస్థాగత నిర్మాణాలను జవహర్‌లాల్ నెహ్రూ సృష్టించారని పేర్కొన్నారు. డా. వై.ఎస్. రాజశేఖర రెడ్డి ఉచిత విద్యుత్, గ్రామీణ ఆరోగ్య వసతులు, ఎస్‌హెచ్‌జీలకు మద్దతు వంటి రైతు-కేంద్రీకృత సంక్షేమ నమూనాతో దయ, అభివృద్ధి రెండూ కలిసిపోవచ్చని నిరూపించారన్నారు. జాతి నిర్మాణ కాలంలో పుట్టి, శాంతియుతంగా పనిచేస్తూ నిలిచిన గొప్ప సంస్థల్లో నాబార్డ్ అత్యుత్తమమైందని తెలిపారు. నాబార్డ్ ప్రచారం కోసం పోరాడిన సంస్థ కాదు, నాబార్డ్ లేకపోతే గ్రామీణ భారత్ ఈ రోజు ఇలా అభివృద్ధి చెందేది కాదన్నారు.

స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయండి

స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఆర్థిక శాఖ అధికారులను డిప్యూటీ సీఎం భట్టి ఆదేశించారు. ప్రజాభవన్ లో ఆర్థిక శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో ఉన్న 2,813 కళాశాలలకు సంబంధించిన రూ.161 కోట్ల బకాయిలు ఉన్నట్టుగా నిర్ధారించారు. ఈ మొత్తాన్ని వెంటనే విడుదల చేయాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా తదితరులు పాల్గొన్నారు.

ఖనిజ రంగంలో చొరవకు నీతి ఆయోగ్ గుర్తింపు

ఖనిజ రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని భట్టి పేర్కొన్నారు. ఇటీవల నీతి ఆయోగ్ ఏర్పాటు చేసిన జాతీయ స్థాయి కీలక ఖనిజ కమిటీలో రాష్ట్ర ప్రభుత్వ సంస్థ అయిన సింగరేణికి ప్రముఖ స్థానం కల్పించడం దీనికి నిదర్శనమని పేర్కొన్నారు. జాతీయ స్థాయి కీలక ఖనిజాల గుర్తింపు, అన్వేషణ కమిటీలో సింగరేణి సంస్థ కు ప్రాధాన్యతనిస్తూ ఆ సంస్థ సీఎండీని సభ్యునిగా పేర్కొంటూ మెమోరాండం విడుదల చేసిందన్నారు. కీలక ఖనిజాల అన్వేషణను తెలంగాణ ప్రభుత్వం ప్రాధాన్య అంశంగా పరిగణిస్తూ ప్రభుత్వ సంస్థలను ప్రోత్సహిస్తుందని గుర్తుచేశారు. ఇప్పటికే ఆస్ట్రేలియా, రష్యా, ఘనా వంటి దేశాలతో వ్యాపార విస్తరణ అవకాశాలపై చర్చలు జరుపుతున్నామని, కీలక ఖనిజరంగంలో గల అవకాశాలను అధ్యయనం చేయటానికి ఇప్పటికే ఏజెన్సీలను నియమించామని తెలిపారు. కేంద్రం నిర్వహించిన ఖనిజాల అన్వేషణ వేలంలో సింగరేణి పాల్గొని బంగారం, రాగి ఖనిజాల అన్వేషణకు లైసెన్స్ కూడా సాధించిందన్నారు. గుట్టల్లో, ఓపెన్ కాస్ట్ గనుల మట్టిలో, థర్మల్ విద్యుత్ కేంద్రం నుంచి వెలువడే ఫ్లై యాష్ ... బాటమ్ యాష్ లో ఉన్న కీలక ఖనిజాలు, ఎర్త్ ఎలిమెంట్స్ ను గుర్తించడానికి జాతీయస్థాయి సంస్థలైన ఎన్ఎఫ్ టీడీసీ, ఐఎంఎంటీ, జెఎన్ఏఆర్ డీడీసీ వంటి సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకున్నామన్నారు. గ్రీన్ ఎనర్జీ రంగంలోనూ సింగరేణి విస్తరణ కోసం ఎన్టీపీసీ అనుబంధ సంస్థ అయిన ఎన్జీఇఎల్ సంస్థతో కలిసి పని చేయడానికి ఒప్పందం కుదుర్చుకున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ చొరవతో రాజస్థాన్ విద్యుత్ ఉత్పదాన్ నిగమ్‌తో కలిసి సింగరేణి సంస్థ 2300 మెగావాట్ల థర్మల్, సోలార్ విద్యుత్ ఉత్పాదనకు కుదుర్చుకున్న ఒప్పందానికి ఆ రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలపడం హర్షణీయమని పేర్కొన్నారు.

అందరికీ సన్న బియ్యం

(మొదటిపేజీ తరువాయి)

ర్యాక్‌లు కేటాయించాలని, రాష్ట్రంలో 15 లక్షల మెట్రిక్ టన్నుల గోదాముల నిల్వ సామర్థ్యం పెంచుకునేందుకు కేంద్రం సాయం అందించాలని కోరారు. 2025-26 ఖరీఫ్ లో అత్యధికంగా 148 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చిందని, ధాన్యం కొనుగోలు లక్ష్యాన్ని 80 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. విజ్ఞప్తులన్నీ సానుకూలంగా పరిశీలిస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారు. దేశవ్యాప్తంగా బాయిల్డ్ రైస్ అవసరం తగ్గిందని, అందువల్ల మిల్లింగ్‌కు అనువైన ముడి బియ్యం రకాల సాగును ప్రోత్సహించాలని సూచించారు. రాష్ట్రంలో మిగులు ధాన్యం నిల్వల ఎగుమతి అవకాశాలను పరిశీలించాలని అన్నారు. రారైస్ కు అనువైన రకాల వరి సాగును ప్రోత్సహించేందుకు రైతులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపడతామన్నారు.

బీహార్‌లో కొలువైన ఎన్డీయే సర్కార్

(మొదటిపేజీ తరువాయి)

సామ్రాట్ చౌదరి, విజయ్‌కుమార్‌సిన్హా ఉప ముఖ్యమంత్రులుగా బాధ్యతలు చేపట్టారు. మొత్తంగా మంత్రి పదవులు పొందినవారిలో బీజేపీ నుంచి 14మంది, జేడీయూ-8, ఎల్జేపీ(ఆర్‌వి)-2, హెచ్ఏఎం-1, ఆర్ఎల్ఎం-1 ఉన్నారు. జనవరిలో మంత్రివర్గ విస్తరణ ఉంటుందని ఎన్డీయే వర్గాలు తెలిపాయి. నితీశ్ ప్రమాణస్వీకారానికి హాజరైన ప్రముఖుల్లో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, అసోం, మహారాష్ట్ర, ఢిల్లీ ముఖ్యమంత్రులు వరుసగా యోగి ఆదిత్యనాథ్, మోహన్ యాదవ్, హిమంత బిశ్వ శర్మ, దేవేంద్ర ఫడ్నవీస్, రేఖాగుప్తా తదితరులు ఉన్నారు. ఇటీవల జరిగిన బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. మొత్తం 243 అసెంబ్లీ స్థానాలకు గాను, నితీశ్ కుమార్ నేతృత్వం లోని కూటమి ఏకంగా 202 సీట్లను కైవసం చేసుకుంది. ఇందులో బీజేపీ 89 స్థానాల్లో గెలుపొందగా, జేడీయూ 85 స్థానాల్లో విజయం సాధించింది.

10వ సారి సీఎంగా...

నితీశ్ కుమార్ దాదాపు 19 ఏళ్లుగా బీహార్ ముఖ్యమంత్రి పదవిలో కొనసాగుతున్నారు. 2000 సంవత్సరంలో తొలిసారి సీఎంగా ఏడు రోజులు మాత్రమే పనిచేసిన ఆయన, ఇప్పుడు పదోసారి ముఖ్యమంత్రి పగ్గాలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఎక్స్ వేదికగా నితీశ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. "రాజకీయాల్లో ఎంతో అనుభవం, రాష్ట్రానికి మంచి పాలన అందించిన అద్భుతమైన రికార్డు నితీశ్‌కు ఉంది" అని ఆయన కొనియాడారు.

తేజస్వీయాదవ్ శుభాకాంక్షలు

బీహార్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నితీశ్ కుమార్‌కు ఆర్జేడీ నేత తేజస్వీయాదవ్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు. 'బీహార్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నితీశ్ కుమార్‌కు హృదయపూర్వక అభినందనలు. మంత్రి మండలి సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేసిన బీహార్ ప్రభుత్వ మంత్రులందరికీ కూడా అభినందనలు' అని ఆయన పేర్కొన్నారు. "కొత్త ప్రభుత్వం తమ హామీలను, ప్రకటనలను బాధ్యతాయుతంగా నెరవేరుస్తుందని, ప్రజల ఆశలు మరియు అంచనాలకు అనుగుణంగా పాలన చేస్తుందని ఆశిస్తున్నాను. బీహార్ ప్రజల జీవితాల్లో సానుకూల మరియు గుణాత్మక మార్పును ఈ ప్రభుత్వం తీసుకువస్తుందని ఆశిస్తున్నాము" అని తేజస్వి యాదవ్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

దేవ్‌జీ, రాజిరెడ్డి మా అదుపులో లేరు

(మొదటిపేజీ తరువాయి)

పోలీసులు పత్రికా ప్రకటన ఇచ్చారని పిటిషనర్ తరపు న్యాయవాది తెలిపారు. పత్రికా ప్రకటనను కోర్టు ముందు ఉంచుతామన్నారు. రెండు వైపులా వాదనలు విన్న హైకోర్టు తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది.

రాజ్యాంగ హక్కుల సాధన సభ విజయవంతం చేయండి

విశాలాంధ్ర-మరిపెడ: జాతీయ మాల మహానాడు ఆధ్వర్యంలో ఈనెల 26న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించే రాజ్యాంగ హక్కుల సాధన సభను విజయవంతం చేయాలని జాతీయ మాల మహానాడు మరిపెడ మండల అధ్యక్షుడు గుమ్మడి ప్రభాకర్ పిలుపునిచ్చారు. సభకు సంబంధించిన వాల్ పోస్టర్లను గురువారం ఆయన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం కేంద్రంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో మాల మహానాడు నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ప్రభాకర్ మాట్లాడుతూ రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలిగించేలా మతోన్మాద సంస్థల మనువాద, ఎజెండాకు పాలకులు తమకు అనుకూలంగా రాజ్యాంగాన్ని మార్చుకోవాలనే లక్ష్యంతో భారత రాజ్యాంగంపై వివిధ రూపాల్లో దాడి చేస్తున్నారన్నారని ఆరోపించారు. రాజ్యాంగాన్ని సనాతనం పేరుతో మార్చాలని కుట్రలకు పాల్పడుతున్నారని, దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయి పై సనాతనం పేరుతో షూ విసిరేయాలని ప్రయత్నించాడని, ఈ ఘటన మరువక ముందే హర్యానా ఐపీఎస్ ఆఫీసర్ పురన్‌ను కులంపేరుతో వేధించి తన మరణానికి కారణమైనారని అన్నారు. శాస్త్రీయమైన లెక్కలు లేకుండా చేసిన ఎస్సీ వర్గీకరణ రోస్టర్ జీవో 99, జీవో 20 రాజ్యాంగ వ్యతిరేకమని తక్షణమే పునః సమీక్షించాలన్నారు.దళితులపై దాడులను అరికట్టి ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు మండల నాయకులు పోకబత్తిని చిన్నిరి,బల్లెం అప్పయ్య,కొప్పుల గోపి,కొప్పుల నాగరాజు,పోకబత్తిని రాకేశ్, గుమ్మడి నారాయణ,మెరుగు రాము,మెరుగు దేవయ్య, జి.రమేష్,పి వినయ్ తదితరులు పాల్గొన్నారు.

జ్ఞానదీపాలు గ్రంథాలయాలు : కలెక్టర్

విశాలాంధ్ర-సూర్యాపేట బ్యూరో : జీవితానికి వెలుగు నిచ్చే జ్ఞానదీపాలు గ్రంథాలయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. సూర్యాపేట జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు గ్రంథాలయాలు ఎంతో పెద్ద వేదికగా నిలుస్తున్నాయని, అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ ఉద్యోగాలు సాధించే వైపు పయనించాలని సూచించారు. విద్యార్థులు ప్రతిరోజూ కనీసం ఒక పేజీలు చదివే అలవాటు పెంపొందించుకోవాలని అభిప్రాయపడ్డారు. త్వరలో అధునాతన సౌకర్యాలతో కొత్త గ్రంథాలయ భవనం సిద్ధమై ప్రజల ఉపయోగానికి అందుబాటులోకి రానున్నట్లు వెల్లడించారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాస, చిత్రలేఖన పోటీలలో ప్రతిభ కనబరిచిన విజేతలకు కలెక్టర్ బహుమతులు అందజేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, గ్రంథాలయ అభివృద్ధికి రెండు వేల రూపాయల చెక్కును విరాళంగా అందించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు, కార్యదర్శి బాలమ్మ, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్ అభిలాష అభినవ్‌కు ఘన స్వాగతం

విశాలాంధ్ర బ్యూరో నిర్మల్ జిల్లా : ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో నవంబర్ 18న జరిగిన కార్యక్రమంలో కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్. పాటిల్ చేతుల మీదుగా ప్రతిష్ఠాత్మక 'జల సంచయ్ – జన భాగీదారి' అవార్డును స్వీకరించి గురువారం కలెక్టరేట్‌కు వచ్చిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌కు కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా అధికారులు పూలమాలలు, బ్యాండ్ మేళాలతో ఘన స్వాగతం పలికారు. పలువురు అధికారులు కలెక్టర్‌కు పూల మొక్కలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ప్రాంగణం సందడిగా మారింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జాతీయ స్థాయి జల అవార్డుల్లో భాగంగా దక్షిణాది రాష్ట్రాల విభాగంలో నిర్మల్ జిల్లా రెండవ స్థానంలో నిలవడం గర్వకారణమన్నారు. జిల్లాకు కోటి రూపాయల రివార్డు లభించడం విశేషమని తెలిపారు. అధికారుల సమిష్టి కృషి, ప్రజల విలువైన భాగస్వామ్యంతోనే ఈ ఘనత సాధ్యమైందని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరింత ఉత్సాహంతో పనిచేసి, జిల్లాకు మరిన్ని ప్రతిష్ఠాత్మక అవార్డులు సాధించేందుకు కృషి చేయాలని అధికారులకు పిలుపునిచ్చారు. జిల్లాకు ఇంతటి ప్రతిష్ఠాత్మక అవార్డు రావడంతో సర్వత్రా హర్షం వ్యక్తమైంది. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, జిల్లా ఎస్పీ జానకి షర్మిలతో పాటు అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్న కళ్యాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది కలెక్టర్‌కు కలిసి పూల మొక్కలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

రైతులకు యూరియా సరఫరా :ఎమ్మెల్యే

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి,సింగరేణి: రామగుండం,అంతర్గాం మండలాల్లో ఎక్కడా యూరియా కొరత రాకుండా రైతులందరికీ యూరియా సరఫరా చేశామని రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ అన్నారు. గురువారం అంతర్గాంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేసినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అవసరమైన యూరియా అందించిందన్నారు. ఈ ప్రాంతంలో లిఫ్ట్ ఇరిగేషన్ సౌకర్యం తీసుకురావడం ద్వారా వ్యవసాయానికి నీరు అందుతుందని, ఈ రెండు మండలాల్లో వేగంగా అభివృద్ధి జరుగుతోందని, రోడ్లు, బ్రిడ్జ్ ఏర్పాటు పటిష్టంగా కొనసాగుతోందని అంతర్గాం నుండి గోలివాడ వరకు రోడ్ పనులు పూర్తిచేస్తున్నామని వివరించారు. బుగ్గగూడెం నుండి గోదావరి వరకు రూ.50 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నామని, ఎల్లంపల్లి నుండి ఎఫ్‌సిఐ వరకు రూ.25 కోట్లతో రోడ్డు పనులు,పెద్దంపేట రైల్వే ఓవర్ బ్రిడ్జ్ పనులు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

బాల్య వివాహాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

విశాలాంధ్ర : తుంగతుర్తి : బాల్య వివాహాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీడీపీఓ శ్రీజ అన్నారు. గురువారం మండల పరిధిలోని సింగారం, వెంపటి, మానాపురం గ్రామాల్లో బాల్య వివాహాల నిర్మూలనపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. బాల్యవివాహాల వల్ల కలిగే దుష్ప్రభావాలు, చట్టపరమైన శిక్షలు, పిల్లల భవిష్యత్తుపై కలిగే దుష్ప్రభావాలను వివరించి అవగాహన కల్పించారు. సమాజంలోని ప్రతి వ్యక్తి చిన్నారుల భవిష్యత్తు రక్షణలో భాగస్వాములు కావాలని, బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించేందుకు గ్రామస్థుల సహకారం అత్యంత కీలకమన్నారు. అనంతరం గ్రామస్థులతో కలిసి బాల్య వివాహాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు. సూపర్‌వైజర్ శ్యామల, శ్రీలక్ష్మి, ఉమా మహేశ్వరి, శైలజ, భవ్యశ్రీ, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా పోరాటాలతో పునీతమైన ఎర్రజెండా : ఎమ్మెల్సీ నెల్లికంటి

విశాలాంధ్ర- నేరేడుచర్ల : ప్రజా పోరాటాలతో ఎర్రజెండా పునీతమైందని వంద ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో ఎన్నో ప్రజాఉద్యమాలకు నాయకత్వం వహించిన ఘన చరిత్ర సీపీఐ పార్టీది అని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా నేరేడుచర్లలో ప్రారంభమైన సీపీఐ 100వ వార్షికోత్సవాల ప్రచార జాతను ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తూ.....100 సంవత్సరాలుగా భారత దేశంలో జరిగిన అన్ని ప్రజా ఉద్యమాల్లో పాల్గొన్న ఏకైక పార్టీ సిపిఐ అని స్వాతంత్ర పోరాటమైనా, తెలంగాణ సాయుధ పోరాటమైనా, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమమైనా అన్ని ఉద్యమాలకు నాయకత్వం వహించి ప్రజలకు అండగా నిలబడి భాధ్యతాయుతమైన పాత్ర పోషించిన పార్టీ సిపిఐ అని, కొన్ని పార్టీలు ప్రజా ఉద్యమాలకు దూరంగా ఉంటూ ఏ ఉద్యమంలో పాల్గొనకుండా ప్రజలకు దూరం అయ్యారని ఆ పార్టీల చరిత్ర ముగిసిపోయిందని కానీ అధికారం పట్ల ఏ లేకపోయినా ఓట్లతో సీట్లతో సంబంధం లేకుండా, రైతాంగ ఉద్యమాలు వ్యవసాయ ఉద్యమాలు విద్యార్థి ఉద్యమాలు యువజన ఉద్యమాలు మహిళా ఉద్యమాలు లాంటి అనేక ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహించి వందేళ్లుగా దేశంలోని 29 రాష్ట్రాల్లో శాఖలు కలిగి ఉన్న ఏకైక పార్టీ సిపిఐ ఆయన సగర్వంగా ప్రకటించారు. భూమికోసం భుక్తి కోసం వెట్టిచాకిరి విముక్తి కోసం నిరంకుశ నిజాముని గద్దె దించడానికి జరిగిన మహత్తర తెలంగాణ సాయుధ పోరాటంలో నాలుగున్నర వేల మంది ప్రాణాల త్యాగాలతో మూడు వేల గ్రామాలకు విముక్తి కలిగించి పది లక్షల ఎకరాల భూములు పంచిన ఘన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీది అని అనాటి సాయుధ పోరాటానికి అనేక ఉద్యమాలకు నాంది అయిందని అనేకమంది వీరులకు జన్మనిచ్చింది ప్రపంచానికి పోరాటం నేర్పింది తెలంగాణ కమ్యూనిస్టు పార్టీ అని ఆయన అన్నారు. జాతాలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం బాల నరసింహా సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు కుమమిద్దె శ్రీనివాస్, సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యులు ధూళిపాళ ధనుంజయ నాయుడు, ఉస్తెల సృజన, ఎల్లావుల రాములు, ఉప్పల కోటమ్మ, మండల సిపిఐ కార్యదర్శి కత్తి శ్రీనివాసరెడ్డి, రావుల సత్యం, లక్ష్మి దిలకరావు, శ్రీను, కొమ రాజు వెంకట్, ముక్క జానయ్య, అవరారపు పున్నయ్య, బెల్లంకొండ గోవిందగౌడ్, తిప్పన రామిరెడ్డి, బొల్లం అశోక్, బత్తిని శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సన్నద్ధంగా ఉండాలి

విశాలాంధ్ర బ్యూరో ఖమ్మం : గ్రామపంచాయతీ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అధికారులు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసి, సన్నద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ ఐ. రాణి కుముదిని అధికారులను ఆదేశించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ, ఓటర్ జాబితా తయారీపై రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్, జిల్లా కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. హైదరాబాద్ నుండి జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొనగా, కలెక్టరేట్ నుండి పోలీస్ కమిషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి పాల్గొన్నారు. కమిషనర్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికలు త్వరలో ప్రభుత్వం నిర్ణయించిందని, సజావుగా ఎన్నికలు జరిగేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. 3 విడతల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని అనుకుంటే, ప్రతి ఫేజ్‌లో ఏ మండలాలు ఎన్నికలు జరగాలో జిల్లా వారీగా ప్రణాళికలు అందించాలని అన్నారు. తుది ఓటర్ జాబితాకు సంబంధించి ఫిర్యాదులు, అభ్యంతరాలను స్వీకరించి పరిష్కరించాలని, ప్రతి గ్రామ పంచాయతీకి పోలింగ్ కేంద్రాలు, ఫోటోలతో కూడిన ఓటర్ జాబితా ప్రచురణకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తర్వాత ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని అన్నారు. ఎంసిసి ఉల్లంఘనపై వచ్చే ప్రతి ఫిర్యాదు పరిష్కారానికి యంత్రాంగం సిద్ధం చేసుకోవాలని , సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ అధికారులతో మాట్లాడుతూ గ్రామ పంచాయతీ, వార్డులకు సంబంధించి రిజర్వేషన్ ప్రక్రియ ఖరారు చేసి చెక్ చేసుకోవాలని, ప్రతి వర్గంలో మహిళలకు రిజర్వేషన్ 50 శాతం అమలు కావాల్సి ఉంటుందని అన్నారు. జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత, జెడ్పీ డిప్యూటీ సీఈఓ నాగపద్మజ, డివిజనల్ పంచాయతీ అధికారులు విజయలక్ష్మి, రాంబాబు, ఎన్నికల విభాగం సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

శివాలయ భూములను ఆక్రమిస్తే చర్యలు

విశాలాంధ్ర కారేపల్లి: మండల పరిధిలోని లింగంబంజరలో గల శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయం పేరు మీద గల మూడు ఎకరముల ఎనిమిది గుంటల భూమిని దేవాదాయ శాఖ అనుమతి లేకుండా ఎవరైనా ఆక్రమిస్తే చర్యలు తీసుకోబడుతుందని ఉసిరికాయలపల్లి కోట మైసమ్మ దేవాలయ కార్యనిర్వహణ అధికారి వేణుగోపాలాచారి అన్నారు. గురువారం కారేపల్లిలో ఈవో విలేకరులతో మాట్లాడుతూ విశ్వనాథపల్లి రెవెన్యూ సర్వేనంబర్ 362/10లో రామలింగేశ్వర స్వామి పేరు మీద మూడు ఎకరాల ఎనిమిది గుంటల భూమి కలదని అట్టి భూమిలో ఎవరైనా ఆక్రమించిన గృహ నిర్మాణాలు చేసినా చర్యలు తప్పవన్నారు. దేవాదాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దేవాలయ భూములను ఆక్రమిస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

స్వయం ఉపాధికి యువత, మహిళా సంఘాలు ముందుకు రావాలి

విశాలాంధ్ర-ములుగు జిల్లా బ్యూరో: గ్రామీణ యువత , మహిళా సంఘాల సభ్యులు స్వయం ఉపాధి వ్యాపారాల ఏర్పాటుకు కృషి చేయాలని - సిద్ధార్థ రెడ్డి , ములుగు జిల్లా ఇండస్ట్రీస్ జనరల్ మేనేజర్ సిద్ధార్థ రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సంక్షేమ భవన్ కార్యాలయంలో ఇ డి ని మేనేజ్ విక్రమ్ దాతార్ , అసిస్టెంట్ మేనేజర్ భట్ట శ్రీకాంత్ ఆధ్వర్యంలో పి ఎం ఈ జి పి (ప్రైమ్ మినిస్టర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రామ్) పై ఒకరోజు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ములుగు జిల్లా ఇండస్ట్రీస్ జనరల్ మేనేజర్ సిద్ధార్థ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ఉండే స్థానిక యువత మహిళా సంఘాల సభ్యులు స్వయం ఉపాధి వ్యాపారాలు ప్రారంభించడానికి ఆసక్తి చూపించాలని అన్నారు. పలు అంశాలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ అశోక్ ,ఎల్డీఎం జయప్రకాష్ , ఈడీఎన్సి కార్పొరేషన్ తుల రవి, డి పి ఎం శ్రీనివాస్ ,ఎ పి ఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు

విశాలాంధ్ర ప్రతినిధి - మంచిర్యాల జిల్లా: ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ మండలం తాళ్లపల్లి సమీపంలో గోదావరి నది తీరం వద్ద సాండ్ రీచ్‌ను నస్పూర్ మండల తహసిల్దార్ సంతోష్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం వినియోగదారుల సౌకర్యార్థం ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేసి నిబంధనల ప్రకారం ఆన్ లైన్‌లో ఇసుక బుక్ చేసుకున్న వినియోగదారులకు రవాణా చేస్తుందని తెలిపారు. నిరుపేదల కోసం ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో లబ్ధిదారులకు ఇంటి నిర్మాణం కోసం ఇసుకను ఉచితంగా అందిస్తుందని, ప్రభుత్వ అభివృద్ధి పనులకు రీచ్‌ల ద్వారా ఇసుకను అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఇసుక అక్రమ రవాణా జరగకుండా సంబంధిత శాఖల అధికారులు పర్యవేక్షించాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇసుక రీచ్ కు రాకపోకలు కొరకు అనువైన తాత్కాలిక దారి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు. అనంతరం జిల్లాలోని హాజీపూర్ మండలం ముల్కల్ల సమీపంలోని ఇసుక రీచ్ ప్రాంతాన్ని హాజీపూర్ మండల తహసీల్దార్ శ్రీనివాస్ రావు దేశ్ పాండే తో కలిసి సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. మండలంలోని గుడిపేట, నంనూర్ గ్రామాలలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ప్రభుత్వం రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లిస్తుందని, ఈ క్రమంలో రైతుల వద్ద నుండి నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేసేలా కేంద్రాల నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. వరి ధాన్యం విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతుల సౌకర్యం ట్రాగునీరు, నీడ మౌలిక వసతులు కల్పించడంతో పాటు గోనె సంచులు, టార్పాలిన్లు, తూకం యంత్రాలు, తేమ యంత్రాలు, ప్యాడీ క్లీనర్లు ఇతర సదుపాయాలు సమకూర్చడం జరిగిందని, రైతులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టులు బలంగా ఉంటేనే ప్రజలకు రక్షణ

విశాలాంధ్ర గూడూరు: కమ్యూనిస్టులు బలంగా ఉంటేనే సమాజంలో ప్రజలకు రక్షణ ఉంటుందని, దేశంలో వంద సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన ఏకైక పార్టీ సిపిఐ అని రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు అన్నారు. సిపిఐ వందేళ్ల ఉత్సవాల సందర్భంగా ఆసిఫాబాద్ జిల్లా జోడేఘాట్ నుండి ప్రారంభమైన సిపిఐ బస్సు యాత్ర అదిల రోజు మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రానికి చేరింది. బైక్ ర్యాలీతో స్వాగతం పలుకగా, అంబేద్కర్, కొమురం భీం విగ్రహాలకు శ్రీనివాస్ రావు నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ దేశంలో రానున్న రోజులలో కమ్యూనిస్టులకే భవిష్యత్తు ఉంటుందని, ప్రజలు చట్టసభల్లో కమ్యూనిస్టులు బలంగా ఉండాలని కోరుకుంటున్నారన్నారు. సమాజంలో అన్ని వర్గాల సంక్షేమం కోసం సిపిఐ ఉద్యమిస్తున్నదన్నారు.సిపిఐ వందేళ్ల ఉత్సవాల జాతీయస్థాయి ముగింపు సభ డిసెంబర్ 26న ఖమ్మంలో లక్షలాదిమందితో భారీ బహిరంగ సభ జరగనుందని తెలిపారు. ఈ బస్సు జాతాలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహంకాళి అనిల్ కుమార్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, ప్రజానాట్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మీ నారాయణ, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రెహమాన్,సిపిఐ జిల్లా కార్యదర్శి విజయ్ సారథి రెడ్డి, మండల నాయకులు చొప్పరి శేఖర్, మాలోత్ రవీందర్, మంద భాస్కర్, దాసరి సాయిలు, పూజారి రవి, కుంజా కర్, చంద్రయ్యపల్లెన్నారు.

భార్యను హత్య చేసిన భర్త..?

అడ్డొచ్చిన కూతురుపై కత్తితో దాడి

విశాలాంధ్ర ఖమ్మం (క్రైమ్) : ఖమ్మం నగరంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం సమీపంలో భార్య గోగుల సాయివాణి (36) ను భర్త భాస్కర్ కత్తితో దాడి చేసి హత్య చేశాడు. ఈ ఘటనతో ఖమ్మం నగరం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. చింతకాని మండలం నేరడా గ్రామానికి చెందిన వీరు కుటుంబ పోషణ కోసం పిల్లలతో కలిసి మూడు నెలల క్రితం ఖమ్మం వచ్చి నగరంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వెనుక అద్దెకు ఉంటున్నారు. ఇరువురు భార్యాభర్తలు కూలిపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. భార్యాభర్తలు ఇరువురు ఓ ఫంక్షన్ హాల్‌లో క్లీనింగ్‌పనిలో కుదిరి పనిచేసుకుంటున్నారు.ఆ పనికి కూడా భర్త రాకుండా మద్యం తాగుతూ జులాయిగా తిరిగేవాడని తెలుస్తోంది.ఈ తరుణంలో ఇద్దరు తరచూ భార్యతో భర్త భాస్కర్ ఏదో ఒక గొడవ పెట్టుకునేవాడని ఈరోజు ఉదయం మద్యం సేవించి కత్తి తీసుకుని ఇంటికి వచ్చి భార్యను హత్య చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. తల్లిని కత్తితో దాడి చేస్తుండగా అడ్డువచ్చిన పిల్లలను కత్తితో భర్త దాడి చేశారని స్థానికులు భావిస్తున్నారు. భార్యను కత్తితో హత్య చేయడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు భార్యను హత్య చేసిన భాస్కర్‌ను అప్పటికే పట్టుకొని స్థానికులు దేహశుద్ధి చేశారు. అతనిని పోలీసులు అప్పగించారు. భార్య సాయి వాణి మృతదేహాన్ని పోలీసులు ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీ కి తరలించారు. నిందితుడు భాస్కర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. మద్యం మత్తులో ఈ ఘటన జరిగిందని స్థానికులు భావిస్తున్నారు.

మూర్ఛకు శస్త్రచికిత్సలో మంచి ఫలితాలు

విశాలాంధ్ర బ్యూరో, సంగారెడ్డి : పిల్లలలో జెనెటిక్-నిరోధక మూర్ఛ వారి జీవన నాణ్యత, అభ్యాసం రోజువారీ పనితీరును గణనీయంగా ప్రభావితం చేస్తుందని కన్సల్టెంట్ న్యూరాలజిస్ట్, ఎపిలెప్టాలజిస్ట్ డాక్టర్ సాగర్ గుల్వడ్డి అన్నారు. గురువారం సంగారెడ్డిలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధునాతన ఇమేజింగ్, ఇంట్రా ఆపరేటివ్ ఇసిజి అందుబాటులోకి మూర్ఛ, చూపు సమస్యలను ముందుగా ఖచ్చితంగా గుర్తించి శస్త్రచికిత్స చేయడం మంచి ఫలితాలను ఇస్తుందన్నారు. 7 ఏళ్ల చిన్నారికి డ్రగ్-రిఫ్రాక్టరీ ఎపిలెప్సీకి ఇమేజ్-గైడెడ్ డిస్కనెక్షన్ సర్జరీ విజయవంతంగా నిర్వహించిన హైటెక్ సిటీ యశోద హాస్పిటల్స్ , లెఫ్ట్ హెమిస్పెరిక్ ఫోకల్ కార్టికల్ డిస్ప్లాసియా వల్ల కలిగిన డ్రగ్-రిఫ్రాక్టరీ ఫోకల్ ఎపిలెప్సీతో బాధపడుతున్న 7 ఏళ్ల బాలుడు కపిల్‌రెడ్డి ప్రభావితమైన విజయవంతంగా చికిత్స అందించింది. మూడు యాంటీ-ఎపిలెప్టిక్ మందులు వాడుతున్నప్పటికీ, ఆ బాలుడు తల మరియు కళ్లలో టానిక్ డీవియేషన్ లక్షణాలను అనుభవిస్తున్నాడు, దానితో పాటు కొంత సమయం స్పృహ కోల్పోతున్నాడు.మల్టీమోడల్ ఇమేజింగ్ న్యూరోలాజికల్ పరీక్షల తర్వాత, వైద్య బృందం శస్త్రచికిత్సను సిఫార్సు చేసింది. ఫిబ్రవరి 21, 20256, పేషెంట్ కు ఎలక్ట్రోకార్టికోగ్రామ్ తో లెఫ్ట్ ఇమేజ్- గైడెడ్ క్రానియోటమీ డిస్కనెక్షన్ విజయవంతంగా నిర్వహించారు. అధునాతన మ్యాపింగ్, గైడెడ్ రిసెక్షన్ ఎపిలెప్టిక్ నెట్ వర్క్ యొక్క ఖచ్చితమైన గుర్తింపు పూర్తి తొలగింపును సాధ్యం చేసింది. శస్త్రచికిత్స మరియు శస్త్రచికిత్స తర్వాత కోలుకోవడం సజావుగా జరిగింది మరియు బాలుడిని ఆరోగ్యకరమైన స్థితిలో డిశ్చార్జ్ చేశామని తెలిపారు. యశోద హాస్పిటల్స్ పీడియాట్రిక్ పిల్లలకు మూర్ఛ సమస్యకు చికిత్సకు అత్యుత్తమ చికిత్స అందిస్తుంది, అధునాతన న్యూరోఇమేజింగ్, ఇంటర్వెన్షనల్ న్యూరాలజీ మరియు మినిమల్లీ ఇన్వాసివ్ న్యూరో సర్జికల్ విధానాలను అందిస్తోందని తెలిపారు. గత 30 సంవత్సరాలుగా హైదరాబాద్‌లోని యశోదహాస్పిటల్స్ ప్రపంచ స్థాయి ప్రమాణాలతో 4 బ్రాంచ్‌లు (సికింద్రాబాద్, సోమాజిగూడ, మలక్‌పేట్, హైటెక్ సిటీ) 4 వేల పడకలు కలిగి ఉన్న అతిపెద్ద సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్. తెలంగాణలోని హైదరాబాద్‌లో 4000 పడకల సామర్థ్యంతో 20 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో విస్తరించి ఉంది. సరసమైన ధరల్లో యశోద హాస్పిటల్స్ ప్రపంచ స్థాయి ఆరోగ్య సంరక్షణ సేవలను అందిస్తుందని తెలిపారు.

ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ఏర్పాట్లు పరిశీలన

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లాకు రానున్నారు. డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ప్రారంభోత్సవంలో పాల్గొనేందుకు వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ గురువారం ప్రత్యక్షంగా పరిశీలించారు. యూని వర్సిటీ క్యాంపస్ మొత్తం పర్యటించిన కలెక్టర్ అకాడమిక్ బ్లాక్ రిపేర్ పనులు, ఆడిటోరియం మరమ్మతులు, బాలుర కామన్ మెస్, బాలికల హాస్టల్ పనుల పురోగతిని పరిశీలించారు. ఆడిటోరియంలో మౌలిక వసతులు, సీటింగ్ ఏర్పాట్లు, స్టేజ్ సెటప్, లైటింగ్, ఎలక్ట్రికల్ పనులు వంటి అంశాలన్నీ నాణ్యతతో పూర్తవ్వాలని కలెక్టర్ సూచించారు. యూనివర్సిటీ పాత, కొత్త భవనాల సుందరీకరణ, పార్కింగ్ ప్రాంతాల అభివృద్ధి, క్యాంపస్ అంతటా పరిశుభ్రత, లైటింగ్ పనులను కలెక్టర్ పరిశీలించి పలు సూచనలు-సలహాలు ఇచ్చారు. క్యాంపస్ ఆవరణ మొత్తం పచ్చదనం ఉట్టిపడేలా మొక్కలు నాటడంతో పాటు పరిసరాల పరిశుభ్రంగా ఉండేలా చూడాలని కళాశాల ప్రిన్సిపల్ డా. జగన్మోహన్ రాజును కలెక్టర్ ఆదేశించారు. ఈ యూనివర్సిటీ ప్రారంభోత్సవం జిల్లాకు అత్యంత ప్రతిష్ఠాత్మకమైన కార్యక్రమమన్నారు. విద్యా రంగంలో జిల్లాకు ఇది ఒక ప్రధాన మైలురాయి అవుతుందని చెప్పారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్ సుజాత, పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాస్, ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ అధ్యాపకులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

విశాలాంధ్ర కొమురం భీం: ప్రభుత్వ ఆసుపత్రులు, సామాజిక, ప్రాథమిక, ఉప ఆరోగ్య కేంద్రాలకు వివిధ అనారోగ్య సమస్యలపై వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలోని ఏరియా ఆసుపత్రి, సామాజిక ఆరోగ్య కేంద్రాలలో ఉప్పంద పద్ధతిన వైద్యులుగా పని చేయుటకు నిర్వహించిన ఇంటర్వ్యూ కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సీతారాం, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ శ్రీలక్ష్మి, తెలంగాణ వైద్య విధాన పరిషత్ జిల్లా సమన్వయకర్త అవినాష్, ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షకులు అనిల్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉప్పంద పద్ధతిన ఎంపికైన వైద్యులు ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన, వేగవంతమైన వైద్య సేవలు అందించాలని తెలిపారు.

పేదలకు రగ్గుల పంపిణీ

విశాలాంధ్ర - భద్రాచలం : యదురి శివరామకృష్ణ తన తండ్రి కీర్తిశేషులు సీతారాములు జ్ఞాపకార్థం గురువారం భద్రాచలం బస్టాండ్ వద్ద చలితో ఇబ్బంది పడుతున్న యాచకులు, పేదవారికి రగ్గులు పంపిణీ చేశారు. సేవా దృక్పథంతో తన సొంత ఖర్చులతో శివరామకృష్ణ సుమారు 80 మందికి రగ్గులను అందజేయడం జరిగింది. ఆయన మాట్లాడుతూ యాచకులు, పేద వారు చలికాలం బయట బస్టాండ్ వద్ద, ఆలయాల వద్ద ఎముకలు కొరికే చలిలో వణుకుతూ నిద్రలేని రాత్రుళ్ళు గడుపుతున్నట్లు చెప్పారు. చలి తీవ్రతకు పేదల అవస్థలు చూసి కొంత ఉపశమనం కలిగించాలనే నా ఆలోచన సహాయంగా వారికి రగ్గులను అందించడం జరిగిందన్నారు. ఈ వితరణ తనకు ఎంతో ఆత్మ సంతృప్తిని కలిగించిందన్నారు. ఇకపై ఏటేటా తన తండ్రి జ్ఞాపకార్థం పేదలకు ఉపయోగ పడే మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ రగ్గుల పంపిణీలో సహకరించిన మిత్రులు గార్లపాటి సుధాకర్, బనాక రాజా, గుంటా సాయి లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యదురి సాయి విష్ణు, యదురి సాయి మనోజ్, యదురి అన్నపూర్ణ, నరసమ్మ, యదురి దుర్గ, నందిని పాల్గొన్నారు.

పఠనం ఆసక్తి నెలకొల్పాలి : గౌస్

విశాలాంధ్ర బ్యూరో ఖమ్మం :పిల్లల్లో పుస్తక పఠనం ఆసక్తి నెలకొల్పాలని డిపిఆర్‌ఓ ఎం.ఎ. గౌస్ అన్నారు.జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గురువారం జరిగిన గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎం.ఎ. గౌస్ మాట్లాడుతూ పుస్తకాలు చదవడం వల్ల మన వ్యక్తిత్వం పెరుగుతుందని అన్నారు. చిన్నతనం నుంచే పిల్లల్లో పుస్తక పఠనం అలవాటు పెంచాలని అన్నారు. పుస్తకాలు జ్ఞాన భాండాగారాలని, పుస్తకాలు లభించే గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రంథాలయంలో ఉద్యోగార్థులకు అవసరమైన అన్ని పుస్తకాలు ఏర్పాటు చేశామని, అందుబాటులో ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ, లక్ష్య సాధన దిశగా కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. పుస్తకాలు మనిషకు దివిటీలని, భవిష్యత్ తరాలు జ్ఞానం వైపు నడవాలంటే ప్రతి గ్రామంలో, ప్రతి పట్టణంలో గ్రంథాలయాలు చైతన్య కేంద్రాలుగా నిలవాలని డిపిఆర్‌ఓ తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థినీ, విద్యార్థులకు ఈ సందర్భంగా బహుమతుల ప్రధానం చేశారు. క ఉపాధ్యాయులు కటుకోజ్వల రమేష్ రచించిన మరో గ్రంథాలయ ఉద్యమం కవితను డిపిఆర్‌ఓ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె. కవిత కుమారి, గ్రంథాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కెవిఎస్‌వి‌ఎన్. రాజు, కార్యదర్శి ఎం.డి. ఇమామ్, ఉద్యోగులు జె. భాస్కర్, సిహెచ్. శ్రీనివాస్, వి. అనిల్, ఎం. రోహిత్, ఎస్. లలిత కుమారి, కె. విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

దళారులపై పిడి యాక్ట్ నమోదు చేయాలి

విశాలాంధ్ర ఖమ్మం : పత్తి, మిర్చి ఎలక్ట్రిక్ కటాలు రిమోట్ కంట్రోల్ తో తూకం తక్కువ చూపించి రైతులను వరుసగా మోసం చేస్తున్న దళారుల పై పిడి యాక్ట్ నమోదు చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మాదినేని రమేష్,బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. గురువారం ఖమ్మం రైతు సంఘం ఆఫీస్ లో జరిగిన తెలంగాణ రైతు సంఘం సమావేశం లో రమేష్, రాంబాబు మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అనేక గ్రామాల్లో రైతులు నుంచి పత్తి, మిర్చి కొనుగోలు చేస్తూ ఎలక్ట్రిక్ కాటాల్లో తూకం రిమోట్ కంట్రోల్ తో తక్కువ చూపుతూ మోసం చేస్తున్న దళారుల పై పిడి యాక్ట్ నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అసలు పంటలు దిగుబడులు తగ్గి రైతులు అప్పుల పాలవుతున్నారు అని ఇటువంటి దళారుల వల్ల రైతులు మరింత నష్టపోతున్నారని అన్నారు. పత్తి, మిర్చి కొనుగోలులో, వ్యవసాయ మార్కెట్లో తక్కువ ధరలు రైతులు తమ ఇండ్ల వద్ద వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకాలకు మొగ్గు చూపుతున్నారు అని దీని అసరా చేసుకుని దళారులు రైతులను భారీగా మోసం చేస్తున్నారని రైతులు కూడా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అని సూచించారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ కె మీరా సాహెబ్, వాసిరెడ్డి ప్రసాద్, జిల్లా కమిటీ సభ్యులు కుసుమనీ మధు, సాసైటీ డైరెక్టర్ తాటికొండ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వయోవృద్ధులకు పోషణ భృతికి చర్యలు

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : చట్ట ప్రకారం వయోవృద్ధులకు పోషణ భృతి కల్పించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వేడుకలను జిల్లా సంక్షేమ అధికారి స్వర్ణలత లెనీనా ఆధ్వర్యంలో కలెక్టరేట్ నిర్వహించారు. ఇందులో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి, కేక్ కటింగ్ చేసి ప్రారంభించారు. సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సభ్యులు తమకు ఉన్న సమస్యలను కలెక్టర్ కు వినిపించారు. వయోవృద్ధులను కుటుంబ సభ్యులు నిరాదరణకు గురి చేస్తున్నారని ఆ పద్ధతులు మారాలని కలెక్టర్ కోరారు. తల్లిదండ్రులు, గత తరంలోనివారే మనం ఎలా వ్యవహరిస్తున్నామో ప్రశ్నించారు. పోషణ భృతి కొరకు వృద్ధులు సంబంధిత జిల్లా సంక్షేమ అధికారి, రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ల ద్వారా సంప్రదించాలని కోరారు. అధికారిక కలెక్టర్ విద్యా చందన మాట్లాడుతూ వృద్ధులకు చేయూత పెన్షన్ రూ. 2016 అందించడం జరుగుతుందన్నారు. అనంతరం వృద్ధాశ్రమ నిర్వాహకులు, అసోసియేషన్ సభ్యులకు, వీరి సంక్షేమం కోసం సహాయం సహకారాలు అందిస్తున్న వ్యక్తులను సన్మానించారు. అదనపు అసోసియేషన్ సభ్యులు సురేష్, సందీప్, కృష్ణయ్య, శివప్రసాద్, యూసఫ్, శివ రామ్, భూషణ్ రావు, వెంకటేశ్వర్లు, సిడిపివోలు లక్ష్మీ ప్రసన్న, పద్మశ్రీ, సిబ్బంది వర ప్రసాద్, నరేష్, ప్రవీణ్, సూపర్వైజర్లు, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

కర్ర విరగని, పాము చావని తీర్పు

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్ పదవీకాలం ఆఖరు రోజున ఆయన నాయకత్వంలోని అయిదుగురు న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం కర్ర విరగకుండా పాము చావకుండా తీర్పు వెలువరించింది. ఈ తీర్పు వెలువరించిన బెంచికి నాయకత్వం వహించిన ప్రధాన న్యాయమూర్తి తాను కూడా మునుపటి ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్‌కు ఎంత మాత్రం భిన్నమైన వాడిని కాదు అని నిరూపించుకున్నారు. ప్రభుత్వాన్ని ఇబ్బందుల్లో పెట్టే తీర్పులు ఇవ్వడం తమ పని కాదని చెప్పకనే చెప్పారు. తమిళనాడు గవర్నర్ ఆర్‌ఎన్ రవి ఆ రాష్ట్ర శాసనసభ ఆమోదించి పంపిన బిల్లులకు నెలలు గడిచినా ఆ బిల్లులకు ఆమోద ముద్ర వేయకుండా తొక్కి పెట్టారు. కొంత మేరకు ప్రస్తుత బెంగాల్ గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ కేరళ గవర్నరుగా ఉన్నప్పుడు ఇదే పని చేశారు. శాసనసభ ఆమోదించిన బిల్లులకు గవర్నర్ ఆమోదం లభించకపోతే అది చట్టం కాదు. శాసనసభ ఆమోదించే ఏ బిల్లు అయినా ప్రజాభిప్రాయానికి ప్రతీకే. ఆ బిల్లులలో లోపాలు ఉండొచ్చు. రాజ్యాంగ విరుద్ధానికి సరిపడనివి ఉండొచ్చు. అలాంటి సందర్భంలో గవర్నర్లు ఆ బిల్లులకు ఆమోద ముద్ర వేయకుండా శాసనసభకు తిప్పి పంపొచ్చు. అప్పుడు శాసనసభ ఆ బిల్లులను పునఃపరిశీలించాలి. అయితే పునఃపరీశీలన తరవాత కూడా చట్టసభ ఏ మార్పు చేయకుండానే గవర్నర్‌కు పంపించవచ్చు. ఇంతవరకు వస్తున్న సంప్రదాయం ప్రకారం ఆ బిల్లుకు మారుమాట లేకుండా గవర్నర్ ఆమోద ముద్ర వేయడం ఆనవాయితీ. కానీ తమిళనాడు గవర్నర్ ఏ మాటా చెప్పకుండా, శాసనసభకు తిప్పి పంపకుండా అట్టి పెట్టుకునే వారు. దీనివల్ల రాష్ట్ర ప్రభుత్వం తాను ప్రజలకిచ్చిన వాగ్దానాలు నెరవేర్చడానికి అనువైన బిల్లులు శాసనాలు కాకుండా ఆగిపోతున్నాయి. గవర్నర్ అనుసరిస్తున్న విధానాన్ని తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాలు చేసింది. గత ఏప్రిల్ 8 న న్యాయమూర్తులు జేబీ పార్దీవాలా, ఆర్.మహదేవన్‌తో కూడిన బెంచి గత ఏప్రిల్ 11 వ తేదీన గవర్నర్ బిల్లులకు ఆమోదముద్ర వేయడానికి మూడు నెలల గడువు విధించింది. కొన్ని సార్లు గవర్నర్లు తాము ఆమోద ముద్ర వేయని బిల్లులని రాష్ట్రపతికి నివేదిస్తుంటారు. రాష్ట్రపతి అయినా వీలైనంత త్వరగా నిర్ణయం తెలియజేయాలి. అదీ జరగనందువల్ల న్యాయమూర్తులు పార్దీవాలా, మహదేవన్‌తో కూడిన బెంచి రాష్ట్రపతి కూడా మూడు నెలల్లోగా తన నిర్ణయం తెలియజేయాలని గడువు విధించింది. ఇలా గడువు విధించడం రాజ్యాంగ సమ్మతం కాదని గురువారం ప్రధాన న్యాయమూర్తి గవాయ్, న్యాయమూర్తులు సూర్యకాంత్, విక్రంనాథ్, పీఎస్‌నరసింహ, ఎఎస్ చందూర్కర్‌తో కూడిన బెంచి తీర్పు కాని తీర్పు వెల్లడించింది. ఇంతకు ముందు ఇద్దరు న్యాయమూర్తులు ఇచ్చిన తీర్పు చెల్లదని తాము చెప్పడం లేదనడం మరో విచిత్రం. రాజ్యాంగ ధర్మాసనం ముందు ఇద్దరు న్యాయమూర్తుల తీర్పు చెల్లుబాటు కాదన్నది అందరికీ తెలుసు. తమిళనాడు గవర్నర్ ఆర్‌ఎన్ రవి నడవడికను సవాలు చేస్తూ పెట్టుకున్న పిటిషన్‌పై ఇద్దరు న్యాయమూర్తుల బెంచి ఇచ్చిన తీర్పు సంచలనాత్మకమైంది. ఎందుకంటే బిల్లులను ఆమోదించడానికి ఆ తీర్పులో గవర్నర్లకే కాదు రాష్ట్రపతికి కూడా గడువు విధించారు. ఈ అంశంపై రాజ్యాంగంలోని 143 వ అధికరణం కింద రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కొన్ని ప్రశ్నలు లేవదీస్తూ సుప్రీంకోర్టు సలహా కోరారు. ఆ సలహా మీదే సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం గురువారం తన అభిప్రాయం తెలియజేసింది. రాజ్యాంగంలో 200, 201, 361 ప్రకారం గవర్నర్‌లకు, రాష్ట్రపతికి బిల్లుల ఆమోదానికి గడువు విధించవచ్చునా అన్నది రాష్ట్రపతి కోరిన సలహాలో ప్రధానాంశం. వీటన్నింటికీ రాజ్యాంగ ధర్మాసనం న్యాయస్థానాలు గడువు విధించలేవు అని సమాధానం చెప్పింది. అలా చేయడం రాజ్యాంగ సమ్మతం కాకపోవడమే కాక అధికారాల విభజన సూత్రానికి విఘాతం కలిగిస్తుందని కూడా అయిదుగురు న్యాయమూర్తుల బెంచి తెలియజేసింది.

రాజ్యాంగ ధర్మాసనం ప్రకారం బిల్లుల ఆమోదానికి గవర్నర్లకు, రాష్ట్రపతికి గడువు విధించే అధికారం అత్యున్నత న్యాయస్థానానికి కూడా లేదనే అనుకుందాం. కానీ ఇటీవలి కాలంలో గవర్నర్ల నియామకంలో బోలెడు రాజకీయాలు ఉంటున్నాయి. కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలకు తమ నమ్మిన బంట్లను నియమించడం పరిపాటి అయిపోయింది. ఆ గవర్నర్లు ప్రతిపక్షాల పాత్ర పోషిస్తున్నారు. అందులో భాగంగానే ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల శాసనసభలు ఆమోదించి పంపిన బిల్లులను ఆమోదించకుండా నిరవధికంగా తొక్కి పెడ్తున్నారు. చట్టసభలు ఆమోదించిన తీర్పులలో లోపాలు ఉన్నాయనుకున్నప్పుడు గవర్నర్లు ఆమోద ముద్ర వేయకుండా చట్టసభలకు తిప్పి పంపొచ్చు. లేదా అనుమాన నివృతి చేసుకోవడానికి కొంత కాలం అట్టి పెట్టుకోవచ్చు. కానీ ఆర్‌ఎన్ రవి లాంటి గవర్నర్లు ఉలుకు పలుకు లేకుండా ఆ బిల్లులను ఆమోదించకుండా తొక్కి పెడ్తున్నారు. ఇది ఆ రాష్ట్రాలలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలను ఇరుకు పెట్టడమే. చట్టసభలకు, ప్రభుత్వానికి ఉన్న అధికారాలను బేఖాతరు చేయడమే. కేంద్రంలోనూ, రాష్ట్రాలలోనూ ఒకే పార్టీ ప్రభుత్వం ఉన్నప్పుడు ఇలాంటి సమస్యలు రావడం లేదు. సాధారణంగా గవర్నర్లు మంత్రివర్గ సలహా మేరకు పని చేయాలి. కానీ 200 వ అధికరణం ప్రకారం కొన్ని సందర్భాలలో మంత్రివర్గ సలహా తు.చ. తప్పకుండా పాటించవలసిన అవసరం లేదు. ఈ మాట నిజమే కావొచ్చు. కానీ గురువారం తమ అభిప్రాయం వెల్లడించిన అయిదుగురు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం గవర్నర్ దీర్ఘకాలం ఉలక్కుండా పలక్కుండా ఉంటే ఏం చేయాలో స్పష్టంగా చెప్పలేదు. అయితే అలాంటి సమయాల్లో న్యాయస్థానం గవర్నరుకు పరిమితమైన నిర్దేశం ఇస్తుందట. కానీ గవర్నరు దీర్ఘ కాలం నిర్ణయం తీసుకోకపోతే న్యాయస్థానం సలహా ఇవ్వవలసి వస్తుంది అని సందిగ్ధంగా వ్యాఖ్యానించింది. 200 వ అధికరణం ప్రకారం గవర్నర్ల విధులను అత్యున్నత న్యాయస్థానం పరిశీలించ కూడదట. కొంచెం సూక్ష్మంగా పరిశీలిస్తే గవర్నర్లు సహేతుకమైన గడువులోగా బిల్లులపై నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు భావన అనుకోవాలి. కానీ ఆ సకల గడువులూ దాటిపోతే పరిస్థితి ఏమిటి? చట్ట సభలు ప్రజాప్రయోజనం కోసం లేదా తమ విధానాల అమలు కోసం ఆమోదించిన బిల్లులను గవర్నర్ తొక్కి పెడ్తే గతి ఏమిటి అన్న ప్రశ్నకు మాత్రం సుప్రీం రాజ్యాంగ ధర్మాసనం సమాధానమే చెప్పలేదు. వ్యక్తిగతంగా గవర్నర్ మీద చర్య తీసుకోవడానికి అవకాశం లేదు కానీ రాజ్యాంగబద్ధమైన గవర్నర్ చేసే పనులపై న్యాయ పరిశీలన జరపొచ్చునట. ఇంతకీ సుప్రీంకోర్టు ఏం చెప్పదలుచుకున్నట్టో! గవాయ్ నాయకత్వంలోని బెంచి తీర్పు సందిగ్ధంగా ఉండొచ్చు కానీ మోదీ ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టడం మాత్రం గవాయ్‌కి కూడా ఇష్టం లేదని తేలిపోయింది.

విత్తనాల ముసాయిదా బిల్లు ఎవరికోసం?

డాక్టర్ కొల్లా రాజమోహన్

దశాబ్దాల నాటి 1966 విత్తనాల చట్టాన్ని, సీడ్ కంట్రోల్ ఆర్డర్, 1983 బదులుగా 2025 విత్తనాల ముసాయిదా బిల్లును కేంద్ర ప్రభుత్వం గత గురువారం విడుదల చేసింది. రాబోయే పార్లమెంటు సమావేశాల్లో ఈ బిల్లును ప్రవేశపెట్టబోయే ముందు ఒక నెలలోపున ప్రజల అభిప్రాయం కోరుతూ ఈ ముసాయిదా బిల్లును ప్రకటించింది. డిసెంబర్ 11 లోగా సూచనలు సమర్పించాలని ప్రజలను కోరింది. రైతులకు అధిక నాణ్యత గల మంచి విత్తనాల లభ్యతను పెంచడం, నకిలీ విత్తనాలు, నాణ్యత లేని విత్తనాల అమ్మకాలను అరికట్టడం లక్ష్యాలుగా ముసాయిదా బిల్లు నిర్ధారిస్తున్నది. మార్కెట్లో విక్రయించే అన్ని విత్తన రకాలకి రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేస్తున్నది. రైతులు సంప్రదాయంగా వాడుకునే రకాలను మినహాయిస్తానంటున్నది. దీనివలన విత్తనాల నాణ్యత, పనితీరు గురించి ప్రభుత్వము వద్ద అధికార సమాచారం ఉంటుందని అంటుంది. జన్యుమార్పిడి విత్తనాలను, కొత్త హైబ్రిడ్ విత్తనాలను కార్పొరేట్ కంపెనీల నుంచి తేలికగా దిగుమతి చేసుకోవడానికి చట్టాలను సవరిస్తున్నారు. జన్యు మార్పిడి విత్తనాలు, దిగుమతి చేసుకునే విత్తనాల సాగుకు పురుగు మందులు, ఎరువులు, నీళ్లు ఎక్కువ అవసరం. మనం కార్పొరేట్ కంపెనీ వ్యవసాయ ఉచ్చులో చిక్కుకుంటున్నాం. ఈ బిల్లు కార్పొరేటర్లకు అనుకూలంగా ఉన్నది. చిన్న రైతులను నాశనం చేసేటట్లుగా ఉంది. తరతరాలుగా జాగ్రత్తగా చేస్తున్నటు వంటి వ్యవసాయాన్ని పురాతన విత్తన రకాలని రక్షించుకోవడానికి ఏమాత్రం సహాయం చేసే పరిస్థితి లేదు. సాధారణ రైతులకు, ముఖ్యంగా సంప్రదాయ విత్తనాలను తయారుచేస్తున్న రైతుల ప్రయోజనాలకు నష్టం కలుగుతుంది.

కేంద్రీకృత అనుమతి: ఒక కంపెనీ కేంద్ర ప్రభుత్వం ద్వారా గుర్తింపు పొందితే, అది దేశంలోని అన్ని రాష్ట్రాలలో విత్తనాలను విక్రయించడానికి అనుమతి పొందినట్లే. బహుళ రాష్ట్రాల నియంత్రణ లేనందున కార్పొరేట్ కంపెనీల వ్యాపార విస్తరణను వేగవంతం చేస్తుంది. రాష్ట్రాలపై కేంద్ర పెత్తనాన్ని సుస్థిరపరుస్తున్నారు. కంపెనీలు ప్రతి రాష్ట్రంలో వేర్వేరు అనుమతులు పొందాల్సిన అవసరం ఉండదు. నియంత్రణల సరళీకరణ పేరున అపరిమితమైన స్వేచ్ఛ లభిస్తుంది. కంపెనీల ఉల్లంఘనలపై నేరారోపణలను తొలగించారు లేదా శిక్షలను తగ్గించినందువలన కంపెనీల అధికారులు జైలుకు వెళ్లాల్సిన భయం తప్పుతుంది. చిన్న వ్యాపారస్తులు పోటీలో నిలబడలేరు. పెద్ద కార్పొరేట్ కంపెనీలకు కేంద్రీకృత అనుమతి వలన వ్యాపారం సులభమవుతుంది.

నకిలీ విత్తనాలు: వ్యవసాయ మంత్రిత్వ శాఖ చాలా కాలంగా నకిలీ విత్తనాల గురించి మాట్లాడుతోంది. కార్పొరేట్ కంపెనీలు నకిలీ విత్తనాలు అమ్మితే కఠినమైన జరిమానా విధిస్తారనే అభిప్రాయాన్ని కలిగించింది. ప్రస్తుత బిల్లులో ఎటువంటి కఠిన నిబంధనలను ప్రతిపాదించలేదు. ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ప్రతి సంవత్సరం ఖరీఫ్, రబీ సీజన్లో నకిలీ, నాణ్యతలేని నాసిరకం విత్తనాల అమ్మకాల కారణంగా రైతులు భారీగా నష్టాలు చవిచూస్తున్నారు. విత్తనాలు అమ్మిన కంపెనీలు ముందు ఒకరకంగా వాగ్దానాలిస్తున్నారు. మొలక శాతానికి, దిగుబడులకు మాదే గ్యారంటీ అంటున్నారు. అమ్ముకున్న తరువాత సమస్య వచ్చినపుడు ముఖం చాటేస్తున్నారు. విత్తన సరఫరా గొలుసులో పారదర్శకత, జవాబుదారీతనం నిర్ధారించడం లక్ష్యంగా పెట్టుకున్నామన్న బిల్లు ఏమి చెప్తున్నదో చూస్తే... "సెక్షన్ 31 కింద నియమించిన సీడ్ ఇన్స్పెక్టర్‌కు విశేష అధికారాలను ఇచ్చారు. అనుమానం వచ్చిన విత్తనాల శాంపుల్స్‌ను ఆ ప్రాంత అనలిస్ట్ దగ్గరకు పంపి, స్టాక్‌ను సీజ్ చేయాలి. సీడ్ ఇన్స్పెక్టర్‌కు అనుమానం వచ్చినప్పుడు ఇంటి తలుపులు పగలకొట్టైనా అనుమానం వున్న విత్తనాలను స్వాధీనం చేసుకునే అధికారాలను ఇచ్చారు. అపరిమితమైన అధికారాలను సీడ్ ఇన్స్పెక్టర్‌కు కట్టబెట్టారు. కొంతమంది స్వార్థపరులైన రైతులు, విత్తన కంపెనీలను అనవసరంగా కోర్టు కేసులలోకి లాగుతున్నారంటూ, కంపెనీలను రక్షించాలని ప్రభుత్వం వాదించింది. 2025 నాటికి భారత విత్తన మార్కెట్ విలువ దాదాపు 3.8 2 బిలియన్ డాలర్లుగా ఉంటుందని అంచనా. ఇంత భారీ మార్కెట్ పై బేయర్స్, మాన్సాంటో, సింజెంటా లాంటి కార్పొరేట్ కంపెనీలు కన్ను వేశాయి. పెద్ద కంపెనీలు తప్పులు చేయరంటున్నారు. వలస పాలకులు తమ సహాయకులు రక్షించేందుకు ఉపయోగించిన క్లాజును విత్తన చట్టంలో కూడా ప్రయోగిస్తున్నారు. చట్టాలను అతిక్రమించే కార్పొరేట్ కంపెనీలకు వెసులుబాటు ఇలా వుంటుందట. మొదటి తప్పు, రెండవ తప్పులకు జరిమానా లేదు. ప్రథమ తప్పు -రెండవ తప్పు -మూడు సంవత్సరాలు అదే తప్పు చేస్తూవుంటే, అప్పుడు 2 లక్షల రూపాయలు జరిమానా విధించవచ్చు. కేంద్ర ప్రభుత్వం లేక రాష్ట్ర ప్రభుత్వం అవసరాన్ని బట్టి జరిమానాని నిర్ణయించటానికి సెక్షన్ 34 ప్రకారం ఒక నోటిఫికేషన్ ద్వారా ఒక ఆఫీసర్‌ను నిర్ణయించవచ్చు. ప్రభుత్వం నియమించిన ఆఫీసరు జరిమానా నిర్ణయిస్తారు. ప్రభుత్వం నిర్ణయించిన దాని కంటే ఎక్కువ ధరలకు అమ్మడం, రిజిస్ట్రేషన్ గడువు ముగిసిన తర్వాత ఒక సంవత్సరం కంటే ఎక్కువ కాలం విత్తన వ్యాపారాన్ని కొనసాగించటం, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌ను ప్రదర్శించకపోవడం, విత్తన ప్యాకెట్ పైన లేబుల్ అతికించబోవటం ఇలాంటివన్నీ కూడా చిన్న తప్పులు కింద భావిస్తారు. విత్తనం మొలకెత్తే వరకు కంపెనీలను బాధ్యత వహించేలా బిల్లు నిర్దేశించాలి. విత్తనాలు మొలకెత్తినప్పటికీ పంట దిగుబడి ఇవ్వకపోతే ఏమి చేయాలి? విత్తన నష్టానికి గరిష్ట పరిహారంపై పరిమితి ఉండకూడదని రైతు నాయకులు కోరుతున్నారు. నకిలీ విత్తనాలు తరచుగా ఒకేలాంటి బ్రాండ్ కింద అమ్ముడు అవుతాయి. తరచుగా మొలకెత్తడంలో లేదా వాగ్దానం చేసిన దిగుబడిని అందించడంలో విఫలమవుతాయి. దీనివలన రైతుల అప్పుల భారం పెరుగుతుంది. ఒక్క సంవత్సరంలో ఒక్క పంట నష్టపోయినా దెబ్బ నుంచి కోలుకోలేరు. 2025 లో 24 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల విత్తన తనిఖీదారులు సేకరించిన మొత్తం 2.5 లక్షల విత్తన నమూనాలలో 32,525 నమూనాలు నాణ్యత లేనివిగా తేలిందన్నారు.

విత్తన దిగుమతులు: విత్తన ఉత్పత్తిలో ప్రపంచంలో అమెరికా, చైనా, తర్వాత భారతదేశం ఉంది. భారతదేశంలో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలు ఉత్పత్తిలో ముందున్నాయి. భారత గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో కీలకమైన స్థానిక విత్తనాలను భద్రపరిచే తిరిగి వాడుకునే సంప్రదాయ ప్రక్రియకు ప్రమాదం ఏర్పడింది. పేటెంట్ ఉన్న బ్రాండెడ్ పంపిణీ విత్తనాలను మాత్రమే వాడాలనే దుష్ట సంప్రదాయాన్ని ఈ ముసాయిదా బిల్లులో ప్రతిపాదించారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో లక్షల ఎకరాల్లో విత్తనాలను తయారుచేస్తున్నారు. విత్తనాలను తయారుచేస్తున్న కర్నూలు, మహబూబ్ నగర్, నూజివీడు రైతుల రక్షణ గురించి బిల్లు ఏమీ మాట్లాడలేదు. అమెరికా, యూరప్ దేశాల పేటెంట్లతో రైతులు విత్తన స్వాతంత్రాన్ని, స్వేచ్ఛను కోల్పోనున్నారు. భారత సంప్రదాయ వ్యవసాయంలోని మంచి లక్షణాలను కూడా విస్మరిస్తున్నందున వ్యవసాయం ప్రమాదంలో పడుతున్నది. ఈ బిల్లు విత్తన దిగుమతులను సరళీకరించి, కార్పొరేట్ కంపెనీలకు లాభాలను కూడపెట్టడం ముఖ్య ధ్యేయంగా పెట్టుకున్నట్లున్నది. ప్రపంచ వెరైటీలను భారతదేశంలోకి విచక్షణారహితంగా అనుమతించటంద్వారా దేశీయ విత్తనాభివృద్ధిని శాశ్వతంగా దెబ్బగొడ్తున్నారు. రైతుల సృజనాత్మక చొరవను పెంచే గ్రామీణ విత్తన కేంద్రాల అభివృద్ధి నినాదంగానే మిగిలిపోయింది. రైతు విత్తనాలను సొంతంగా తయారు చేసుకునే హక్కుపై దాడి చేస్తున్నారు. భారతదేశ విత్తన సంపదను కాపాడవలసిన అవసరం గురించి మౌనం వహించారు. రైతు విత్తన హక్కు గురించి విత్తన స్వావలంబన అందుబాటులోకి తీసుకురావడం, విత్తన సరఫరాలో పారదర్శక, జవాబుదారీతనం పెంచటం ద్వారా రైతు హక్కులను కాపాడటం లక్ష్యంగా పెట్టుకోవటం విస్మరించారు.

రైతులకు నష్టపరిహారం విధానం మరింత కష్టం: న్యాయం పొందడంలో సమస్యలు, నాసిరకం లేదా నకిలీ విత్తనాల వల్ల పంట నష్టం సంభవించిన రైతులకు తప్పనిసరిగా, సులభంగా నష్ట పరిహారం చెల్లించడానికి బిల్లులో స్పష్టమైన, సరళమైన నిబంధనలు ఏమీ లేవు. నష్ట పరిహారం క్లెయిమ్ చేసుకోవడానికి అవసరమైన ప్రక్రియ క్లిష్టంగా వున్నది. శాంపుల్ సేకరణ, లాబోరేటరీ పరీక్షలు, విచారణలు అన్నీచాలా క్లిష్టంగా, ఖరీదైనవిగా ఉన్నాయి. ఇది చిన్న రైతులు న్యాయం పొందకుండా నిరోధిస్తుంది. నాసిరకం విత్తనాల వల్ల పంట నష్టం జరిగితే రైతులకు తప్పనిసరిగా, సులభంగా పరిహారం చెల్లించేందుకు ఒక స్పష్టమైన, సరళమైన నిబంధన బిల్లులో లేదు. నమూనాల సేకరణ, ప్రయోగశాల పరీక్షలు, విచారణ వంటి సుదీర్ఘ పద్ధతులపై అధికారులు కోర్టుల దయాదాక్షిణ్యాలపైనే ఆధారపడాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. విత్తన లోపం వల్ల పంట నష్టం జరిగితే, రైతులు ఇప్పటికీ పెద్ద కంపెనీలతో న్యాయస్థానాలలో పోరాడవలసి వస్తుంది, ఇది ఆర్థికంగా, సమయంపరంగా చిన్న రైతులకు భారం అవుతుందని నిపుణులు హెచ్చరించారు. కార్పొరేట్ ప్రయోజనాలను కాపాడే ప్రధాన అంశాలు ముసాయిదా బిల్లులో కంపెనీల పరిశోధన, మార్కెట్ విస్తరణకు దోహదపడే అంశాలు, అలాగే నియంత్రణ భారాన్ని తగ్గించే నిబంధనలు ఉన్నాయి. సంప్రదాయ విత్తనాలను సేవ్ చేసుకోవడం, మార్చుకోవడం లేదా అమ్మడంపై రైతులకు స్వేచ్ఛ ఉన్నప్పటికీ, బిల్లులోని కొన్ని నిబంధనలు భవిష్యత్తులో ఈ హక్కులకు పరిమితులు విధించవచ్చని ఆందోళనగా వున్నది. భారతదేశ జన్యు వారసత్వాన్ని రక్షించేందుకు తీసుకున్న చర్యలు చట్టంలో లేవు. అన్ని విత్తన రకాల రిజిస్ట్రేషన్ తప్పనిసరి కావడం వలన, రైతులు తమ సంప్రదాయ వెరైటీల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఇబ్బందులు పడతారు. విత్తన ధరల పెరుగుదల: విత్తన పరిశ్రమపై ప్రభుత్వ నియంత్రణ తగ్గి, కేంద్రీకృత గుర్తింపు వ్యవస్థ కారణంగా పెద్ద కార్పొరేట్ కంపెనీల ఆధిపత్యం పెరుగుతుంది. విత్తన ధరలు అమాంతం పెరిగే అవకాశం ఉంది. చిన్న విత్తన కంపెనీలు, స్థానిక తయారీదారులు కేంద్రీకృత నియంత్రణ వ్యవస్థను ఎదుర్కొనే శక్తి లేక మార్కెట్ నుంచి నిష్క్రమించక తప్పదు. దీనివల్ల పోటీ తగ్గి, పెద్ద కంపెనీల గుత్తాధిపత్యం పెరుగుతుంది. బిల్లులో విత్తన ధృవీకరణ, పరీక్షల్లో ప్రభుత్వ పాత్రను తగ్గించి, ప్రైవేట్ సంస్థలకు ఎక్కువ అధికారం కల్పించడంపై ఆందోళన ఉంది. దీనివల్ల నాణ్యత పర్యవేక్షణ ప్రమాణాలు తగ్గే అవకాశం ఉంది.

కార్పొరేట్ కంపెనీల ప్రయోజన పరిరక్షణ: ఈ ముసాయిదా బిల్లు విత్తన పరిశ్రమలో కార్పొరేట్ కంపెనీల వ్యాపార నిర్వహణ సౌలభ్యాన్ని పెంచడం ద్వారా వారి పరిశోధన, పెట్టుబడులకు రక్షణ కల్పించడం ద్వారా కార్పొరేట్ కంపెనీలకు ప్రయోజనం చేకూరుస్తుంది. చిన్నపాటి నియమ ఉల్లంఘనలకు లేదా సాధారణ తప్పులకు శిక్షలను తగ్గించడం లేదా వాటిని నేరాల జాబితా నుంచి తొలగించడం వల్ల కంపెనీలపై ఉండే న్యాయపరమైన పాలనాపరమైన ఒత్తిడి గణనీయంగా తగ్గుతుంది. విత్తన కంపెనీలు కేంద్ర స్థాయిలో గుర్తింపు పొందితే, రాష్ట్రాల స్థాయిలో మళ్లీ అనుమతులు/గుర్తింపులు పొందాల్సిన అవసరం ఉండదు. బహుళ రాష్ట్రాల్లో వ్యాపారం చేసే పెద్ద కంపెనీలకు ఈ ప్రక్రియను చాలా సులభతరం చేస్తుంది. కొత్త విత్తనాలను, ముఖ్యంగా పరిశోధన ఆధారిత జన్యు మార్పిడి విత్తనాలను, భారతదేశంలోకి సులభంగా దిగుమతి చేసుకునేందుకు నిబంధనలను సరళీకరించారు. నూతన విత్తన వంగడాల ధృవీకరణ, వినియోగ విలువ పరీక్షల నియంత్రణలను కొంతవరకు సడలించడం జరిగింది. దీనివల్ల ప్రైవేట్ కంపెనీలు తమ నూతన వంగడాలను మార్కెట్‌లోకి వేగంగా విడుదల చేయగలుగుతాయి. తద్వారా పెట్టుబడిపై రాబడి పెరిగి కంపెనీల లాభాలు పెరుగుతాయి. క్యూఆర్ కోడ్‌లు, పోర్టల్ ద్వారా ప్రతి విత్తనం మూలాన్ని సులభంగా గుర్తించవచ్చు. ఇది నాణ్యమైన విత్తనాలను ఉత్పత్తి చేసే పెద్ద కంపెనీల ఉత్పత్తులకు రక్షణ కల్పిస్తుంది. దేశీయ విత్తనాలను మార్కెట్‌లోకి తీసుకువచ్చే చిన్న వ్యాపారులను నియంత్రించడానికి వీలు కల్పిస్తుంది. ఈ నిబంధనలన్నీ కలిసి, పెద్ద కార్పొరేట్ కంపెనీలు భారతదేశ విత్తన మార్కెట్‌లో మరింత స్వేచ్ఛగా, వేగంగా కార్యకలాపాలు నిర్వహించడానికి ఈ బిల్లు ఉపయోగపడుతుంది. కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా, రైతు ప్రయోజనాలకు వ్యతిరేకంగా వున్న ఈ బిల్లును తిప్పికొట్టాలి.

సెల్: 9000657799

తప్పెవరిది

దేవుడా రక్షించు తప్పు చేశాను. క్షమించు స్వామి. ఏంటి బావ తప్పు చేశానంటున్నావు. అవునయ్యా ఈ రోజు ఉదయం పరధ్యానంలో రామాలయంలోకి చెప్పులతో వెళ్లాను. అందుకే క్షమించమని వేడుకుంటున్నా. భలేవాడివయ్యా ఆ మాత్రానికే ఇంత బాధపడాలా. అసలు ఈ సమాజంలో తప్పు చేయని వారెవరో చెప్పు. తెలిసి కొందరు, తెలియక కొందరు తప్పు మీద తప్పు చేస్తూనే ఉన్నారు. రామాలయంలోకి చెప్పులతో వెళ్లి బాధపడుతున్నావు కాని ఆ శ్రీరామస్వామిని కొలుస్తూ ఆయన మెడలో నగలు కాజేస్తున్నారు. అంతెందుకు పేదల పేరిట ఇళ్ల స్థలాలంటూ డబ్బు వసూలు చేసి కాజేసేవారు కొందరు. అలాంటి గ్యాంగును కాపాడి వారి దగ్గర నుంచి కింది స్థాయి నాయకుల వరకు పేదలను పీడించి వారికి అన్యాయం చేసేవారే ఎక్కువ. వారు వీరు అనే తేడాలేదయ్యా అణగారిన వర్గాల ప్రజలను జలగల్లా పీడించుకునే వారే ఎక్కువ. అసలు అవినీతి లేనిచోటు మనకు కనబడదు. ప్రతిచోట చేయి చాపుతూనే పని చేస్తున్నారు. ఎవరూ జీతంతో తృప్తిపడటం లేదు. వారు నేతల వైపు చూపుడు వేలు చూపుతున్నారు. ఏలేవాడు సరిగా ఉంటే కిందిస్థాయి వారు మంచిగానే పనిచేస్తారు. అందుకని ఉద్యోగులను అనడం మనదే తప్పు. మనం ఎన్నుకున్న నేతలే మనల్ని దోచుకు తింటుంటే వారి ఆదేశాలు అమలు జరిపే ఉద్యోగులూ వారి బాట పడుతున్నారు.

ఇద్దరిలో తప్పెవరిది అంటే ప్రజలు తమ సమస్యలు పరిష్కరించమని ఎన్నుకున్న నాయకులే అధికారంలో ఉండి ఎన్నుకున్న ప్రజల ఆస్తులు దోచుకుంటే తప్పెవరిది అంటే ఏలేవారిదే అవుతుంది. యథారాజా తథాప్రజా అన్న సామెత ఉంది కదా. అలాగే ప్రజలను కాపాడవలసిన నాయకులే ప్రజల ఆస్తులు మింగుతుంటే వారి ఆదేశాలు పాటించే అధికారులు వారిని చూస్తూ గుటకలు మింగుతూ పూరుకోరు కదా. అందుకే ఇందుకలడందు లేడని సందేహమేల అన్నాడు ప్రహ్లాదుడు. అలాగే ప్రతిచోట అవినీతి తాండవం నృత్యం చేస్తూనే ఉంది.

నిజమేనయ్యా నువు చెప్పేది 99 శాతం ప్రజలు దేవుణ్ణి నమ్మి నిత్యం పూజ చేస్తూన్న ఆ సర్వాంతర్యామి కనుసన్నలలోనే ఇన్ని ఘాతుకాలు జరగడం ఆశ్చర్యంగా ఉంది. ఇందులో ఆశ్చర్యపోవలసిందేముంది. ప్రజలందరూ నమ్మి పూజలు చేసి మొక్కులు చెల్లించి ఏడుకొండలు ఎక్కి మొక్కుతుంటే ఆ స్వామి ఆస్తులే కాజేస్తున్నారు. అందుకే ఆ దేవదేవుని కంటే దొంగతనం చేసినవాడే ఘనుడనుకోవలసి వస్తోంది. తాళాలు వేసి జాగ్రత్తపడినా గుడి తాళాలు పగులకొట్టి ఆ దేవునిపై ఉన్న నగలు దొంగతనం చేస్తున్నారు. అంటే ఇవన్నీ చూస్తూ ఆ దేవుడు ఎందుకు మిన్నకున్నాడనే ప్రశ్నకు సమాధానం లేదు. కాదు ఉందని, ఆ రకంగా పామరుని చేత తప్పులు చేయించి అతన్ని నరకానికి పంపుతాడని ఆస్తికుల నమ్మకం. మరి ఆ దొంగల బారిన పడిన భక్తుల మాటేమిటంటే మరు జన్మలో వారిని స్వర్గానికి పంపుతాడట ఆ దేవుడు. ఇన్ని విషయాలు తెలిసిన వారే మరోసారి ముల్లోకాలు లేవని ఉన్నది భూలోకం ఒక్కటే అంటారు.

నిజమేనయ్యా బాగా చదివిన వారే కాదు సాక్షాత్తు ఆదిశంకరుల వారే పునర్జన్మ లేదని ఉన్నది మానవ జన్మ ఒక్కటేనని ఒప్పుకున్నారు. అంచేత పునర్జన్మలు, ముల్లోకాలు ఉన్నవని అమాయకులను నమ్మించి వారిచే వూడిగం చేయించుకున్న పండితులు అనేకులున్నారు. ఈ రకంగా వేదం చదివానని భారతం, రామాయణం, భాగవతం అవపోసన పట్టానని గుడిలోనో, గ్రామ రచ్చబండపైనో కూర్చుని అమాయకులను నమ్మించి వారిచే చదువరులు ఊడిగం చేయిస్తున్నారు. ప్రస్తుతం ఓట్లు కొని గద్దెనెక్కి ప్రజల ఆస్తులు దోచుకుంటున్నారు నాయకులు. ఆనాడు వైదిక ధర్మం పేరిట ఈనాడు ప్రజాసేవ పేరిట అమాయకులను దోచుకుంటూనే ఉన్నారు. భూమిపై కోతి నుంచి మానవ రూపం వచ్చిన నాటి నుంచి తెలివిగల మనిషి తెలివితక్కువ అమాయకులను దోచుకుంటూనే ఉన్నారు. తప్పెవరిది అంటే తెలివితో దోచుకునే వారిదా తెలివిలేక బలి అవుతున్న అమాయకులదా అంటే తప్పు తెలివితేటలు అపమార్గాన ఉపయోగించి దోచుకునేవారిదే అవుతుంది. అందుకే తరతరాలుగా ఆ వ్యత్యాసం అలాగే ఉండాలని దోచుకునే తెలివిగల వారి ఆలోచన. అందుకే నిరక్షరాస్యులు అలాగే ఉండాలని వారి కోరిక. ఈనాడు ఈ విషయాలు ఆలోచించకుండా యువత కూడ గుడి చుట్టూ తిరుగుతుంటే మార్పు ఊహించలేం. అయినా నిరాకారుడు, నిర్గుణుడు, నిర్వికల్పుడు అని వేదాంతులే చెబుతారు. ఆకారం లేదు, ఒక కోరికలు లేవు, ఒకే గుణం కలవాడు కాదు అని చెబుతుంటే, భగవంతుడున్నాడని శివునికి తెలవకుండ చీమయినా కుట్టదని కూడా చెబుతారు. అలా వల్లించి అమాయక ప్రజలను భజనలకు, పూజలకు పరిమితం చేస్తూ అమాయకత్వాన్ని ఆయుధంగా దోచుకుతినడం వారి పనిగా మారింది. అనాదిగా జరుగుతున్న ఈ అన్యాయాలను అరికట్టవలసిన బాధ్యత సమాజంలో యువతపైనే ఉంది. కాని వారు కూడా దేవునికి మొక్కడం చదువు, ఉద్యోగం లాంటి వాటికి కూడా దేవునిపై ఆధారపడటం శోచనీయం. ఏదిఏమైనా మార్పు అనివార్యం అందుకు ఎప్పటికైనా యువత వలనే జరగాలి. తప్పెవరిదో తేల్చవలసింది కూడా యువతే.

సెల్: 9885569394

ఆందోళన కలిగిస్తున్న చిన్నారుల అదృశ్యం

ఎం. మురళీకృష్ణ

భారతదేశం అధిక సంఖ్యలో పిల్లల తప్పిపోయిన కేసులను ఎదుర్కొంటోంది, అయితే భారతదేశంలో తప్పిపోయిన వ్యక్తుల కేసులకు సంబంధించిన ఇటీవలి సమగ్ర, రాష్ట్రాల వారీ డేటా అందించిన శోధన ఫలితాల్లో సులభంగా అందుబాటులో లేదు. 2023లోనే 8.68 లక్షల మంది అదృశ్యమయ్యారని, దేశవ్యాప్తంగా ప్రతి గంటకు దాదాపు 100 మంది అదృశ్యమవుతున్నారని, వారిలో సగం మంది ఆచూకికూడా కనుగొనలేదని కొన్ని వర్గాలు సూచిస్తున్నాయి 2022 లో 83,000 మందికి పైగా పిల్లలు తప్పిపోయినట్లు గణాంకాలు తెలుపుతున్నాయి. వీరిలో 47,000 మందికి పైగా పిల్లల జాడ ఇంకా తెలియలేదు. కనపడకుండా పోయిన చిన్నారులలో అత్యధికులు అంటే దాదాపు 71% మంది బాలికలే. పిల్లలు కనిపించకుండా పోయిన కేసులకు సంబంధించిన 2025 గణాంకాలు ఇంకా అందుబాటులో లేనప్పటికీ, 2023 చివరి, 2024 నాటి డేటా ప్రకారం కిడ్నాప్, అపహరణ కేసులు ఆందోళన కలిగిస్తున్నాయి. తప్పిపోయిన పిల్లలను నివేదించడానికి, ట్రాక్ చేయడానికి భారత ప్రభుత్వం ఖోయా-పాయ పోర్టల్, అవసరమైన పిల్లలకు మద్దతు ఇవ్వడానికి మిషన్ వాత్సల్య పథకం వంటి కార్యక్రమాలు అమలుచేస్తున్నా ఫలితం పెద్దగా ఉండడం లేదు. పిల్లలు కనిపించకుండా పోవడాన్ని సుప్రీంకోర్టు "తీవ్రమైన సమస్య" గా గుర్తించి, కఠినమైన చర్య తీసుకోవాలని ఆదేశించింది. కుటుంబ లేదా విద్యాపరమైన సమస్యల కారణంగా స్వచ్ఛందంగా అదృశ్యం కావడం నుంచి అక్రమ రవాణా, బలవంతంగా భిక్షాటన చేయడం, బలవంతంగా వ్యభిచారం చేయడం వంటి నేర కార్యకలాపాల అంశాలు పిల్లలు కనపడకపోవడానికి కారణాలుగా ఉన్నాయి. ఒయాసిస్ ఇండియా డేటా ఆధారంగా, 2021 తో పోలిస్తే 2022 లో తప్పిపోయిన పిల్లల సంఖ్య 7.5% పెరిగింది. 2020 తో పోలిస్తే 2021 లో గణనీయంగా 30.8% పెరిగింది. పశ్చిమ బెంగాల్‌లో అత్యధికంగా (2022లో 6,994) పిల్లలు జాడ తెలియకుండా పోయారు, ఆ తర్వాత స్థానంలో మధ్యప్రదేశ్ (3,926) ఉంది. ఈ విధంగా కనిపించకుండా పోయిన పిల్లల్లో చాలా మంది అక్రమ రవాణా, బలవంతంగా భిక్షాటన, లైంగిక దోపిడీలో పాల్గొనే నేరస్థుల నెట్‌వర్కింగ్‌లకు బాధితులవుతున్నారు. పేదరికం, విద్యా ఒత్తిడి, కుటుంబ సమస్యలు వంటి సామాజిక-ఆర్థిక, భావోద్వేగ కారకాలు కూడా పిల్లలు ఇంటి నుంచి పారిపోవడానికి కారణమవుతాయని హిందూస్తాన్ టైమ్స్ పేర్కొంది.

2023 లో భారతదేశంలో 91,296 మంది పిల్లలు తప్పిపోయినట్లు నివేదికలు తెలిపాయి. అంతకుముందు సంవత్సరం కంటే ఇది 9.5% పెరుగుదల. పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్, తమిళనాడులలో అత్యధిక కేసులు నమోదయ్యాయి, జాతీయ రికవరీ రేటు 65.9%. తప్పిపోయిన పిల్లలలో ఎక్కువ మంది 12 - 18 సంవత్సరాల మధ్య వయసు గలవారు. అత్యధిక రికవరీ రేట్లు కలిగిన రాష్ట్రాలలో కేరళ 95.9 తో అగ్రస్థానంలో ఉంది. ఆంధ్రప్రదేశ్ 85.7, తమిళనాడు 80.3, మధ్యప్రదేశ్ 69.8 ఆ తరువాత స్థానాల్లో ఉన్నాయి. తప్పిపోయిన పిల్లల సంఖ్య, ముఖ్యంగా కౌమారదశలో ఉన్న బాలికల సంఖ్య, ప్రత్యేక శ్రద్ధ అవసరమయ్యే దుర్బలత్వాలను ఎత్తి చూపుతోంది. కనిపించకుండా పోయిన వారి ఆచూకి కనుగొనే సంఖ్య పెరిగినప్పటికీ, గణనీయమైన సంఖ్యలో పిల్లలు జాడ తెలియడంలేదు. అక్రమ రవాణా, భిక్షాటన, బాల కార్మికులు వంటి సమస్యలు ప్రధాన ఆందోళనలుగా కొనసాగుతున్నాయి.

దేశంలో 2018 తర్వాత అదృశ్యమైపోతున్న చిన్నారుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. 2025 లో ఎంత మంది తప్పిపోయారో ఖచ్చితమైన సంఖ్య ఇంకా అందుబాటులో లేదు, కానీ ప్రాంతీయ డేటా అధిక సంఖ్యలను చూపిస్తుంది. మహారాష్ట్రలో మొదటి ఐదు నెలల్లో 30,000 కంటే ఎక్కువ మంది కనిపించకుండా పోయారని సమాచారం. అక్టోబర్ మధ్య నాటికి ఢిల్లీలో 19,682 మంది పిల్లలు కనిపించకుండా పోయారు. అనేక ప్రాంతాలలో మహిళలు, బాలికలు అసమానంగా ప్రభావితమవుతున్నారు. ఢిల్లీలో, తప్పిపోయిన వారిలో 61% (11,917) మంది మహిళలు. మహారాష్ట్రలో 17,646 మంది బాలికలు తప్పిపోగా, 12,467 మంది బాలురు తప్పిపోయారు. ఢిల్లీలో కనపడకుండా పోయినవారిలో 18 ఏళ్లలోపు వారు 4,854 మంది. ఈ ఏడాది జులై నాటికి మధ్యప్రదేశ్‌లో 23,000 మందికి పైగా మహిళలు, బాలికలు తప్పిపోయినట్లు నివేదించారు. జాతీయ నేర రికార్డుల బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) నివేదిక ప్రకారం 2023 లో, కిడ్నాప్, అపహరణ కేసులు 79,884 గా నమోదయ్యాయి, వీటిలో 82,106 మంది పిల్లలు ఉన్నారు. కనిపించకుండా పోయిన బాలబాలికల సంఖ్య 2022 తో కలిపి ఐదు సంవత్సరాల కాలంలో బాగా పెరిగింది. 2021 తో పోలిస్తే 2022 లో వీరి సంఖ్య 7.5 శాతం పెరిగింది. 2020 లో కంటే 2021 లో 30.8 శాతం పెరిగింది. అయితే 2019 తో పోలిస్తే 2020 లో 19.8 శాతం తగ్గింది. కానీ 2018 లో కంటే 2019 లో 8.9 శాతం, 2017 తో పోలిస్తే 2018 లో 5.6 శాతం పెరిగింది. ఆచూకీ తెలియకుండా పోయిన చిన్నారులలో ఆయా రాష్ట్రాల అధికారులు కొందరి ఆచూకీ తెలుసుకున్నప్పటికీ గణాంకాలలో తేడా మాత్రం అధికంగానే ఉంది.

ఆచూకీ తెలియకుండా పోయిన చిన్నారులకు సంబంధించి పాటిస్తున్న ప్రామాణిక నిబంధనల ప్రకారం మైనర్ బాలుడు లేదా బాలిక కన్పించడం లేదన్న సమాచారం అందుకున్న తర్వాత పోలీసులు ప్రాథమిక విచారణ జరిపి, నిర్ధారించుకుంటారు. ఐపీసీ సెక్షన్ 363 (కిడ్నాప్) కింద కేసు నమోదు చేస్తారు. 2022 లో కిడ్నాప్‌కు గురైన 76,069 మంది పిల్లల్లో 62,099 మంది బాలికలే. కిడ్నాప్‌కు గురైన వారిలో (ఐదు సంవత్సరాలలో కలిపి) 51,100 మంది మైనర్ల ఆచూకీ తెలియలేదు. వీరిలో 40,219 మంది అంటే 78.7 శాతం మంది బాలికలు. కన్పించకుండా పోయిన పిల్లల కేసుల్ని కిడ్నాపింగ్ కేసుల కేటగిరీలో చేరుస్తారు. ఈ కేటగిరీ కింద 2020 లో 29,364, 2019 లో 29,243, 2018 లో 24,429 కేసులు నమోదయ్యాయి. అదృశ్యమైపోయిన చిన్నారుల విషయంలో మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఎంతో ఉంది. వీధుల్లో తిరిగే చిన్నారులు కిడ్నాపర్లకు లక్ష్యంగా మారుతున్నారని, వారిని అపహరించి విక్రయించడమో, వ్యభిచారంలోకి దించడమో లేదా ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాలకు వాడుకోవడమో జరుగుతోంది. ఆచూకీ తెలియని చిన్నారులను వెతికి పట్టుకోవడానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఎంతో ఉంది. కన్పించకుండా పోయిన చిన్నారుల ఆచూకీని కనిపెట్టడంలో విజయం సాధించిన పోలీస్ సిబ్బందికి ప్రోత్సాహకాలు అందిస్తే వారు మరింత ఉత్సాహంగా పనిచేసే అవకాశం ఉంటుంది.

ప్రజల ఆకాంక్షలు నెరవేర్చాలి: తేజస్వి

పట్నా: ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ నాయకత్వంలో ఏర్పడిన కొత్త బీహార్ ప్రభుత్వం 'ప్రజల అంచనాలు, ఆకాంక్షలకు అనుగుణంగా' ఉంటుందని ఆశిస్తున్నట్లు ఆర్జేడీ నాయకుడు తేజస్వీ యాదవ్ గురువారం అన్నారు. 'గౌరవనీయులైన నితీశ్ కుమార్ జీ... బీహార్ ముఖ్య మంత్రిగా మళ్లీ ప్రమాణ స్వీకారం చేసినందుకు, మీ కేబినెట్‌లోని మంత్రులకు హృదయపూర్వక అభినందనలు' అని 'ఎక్స్' పోస్ట్‌లో తేజస్వి పేర్కొన్నారు. 'కొత్త ప్రభుత్వం బీహార్ ప్రజల అంచనాలు, ఆకాంక్షలకు అనుగుణంగా ఉంటుందని... వారి జీవితాల్లో సానుకూల, గుణాత్మక మార్పు తీసుకువస్తుందని ఆశిస్తున్నాను' అని అన్నారు. ఇదిలాఉండగా, ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరయిన ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖ గుప్తా విలేకరులతో మాట్లాడుతూ ప్రతిపక్షం 'చిన్న మనస్సు' కలిగి ఉండటం వల్లే ఈ కార్యక్రమానికి హాజరు కాలేదని ఆరోపించారు. ప్రతిపక్షం ఈ వేడుకకు హాజరయ్యేంత గొప్పతనాన్ని చూపించి ఉంటే బాగుండేదని తెలిపారు.

శశి థరూర్‌పై సందీప్ దీక్షిత్ ఆగ్రహం



న్యూఢిల్లీ: ప్రధాన మంత్రి నరేంద్రమోదీని ప్రశంసిస్తూ కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు మరోసారి సొంత పార్టీ నేతలకు ఆగ్రహం తెప్పించాయి. దీనిపై తాజాగా కాంగ్రెస్ నేత, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి షీలా దీక్షిత్ కుమారుడు సందీప్ దీక్షిత్ తీవ్రంగా స్పందించారు. బీజేపీ సిద్ధాంతాలు నచ్చితే ఇంకా కాంగ్రెస్‌లోనే ఎందుకు కొనసాగుతున్నారని థరూర్‌ను ఆయన ప్రశ్నించారు. 'శశి థరూర్ సమస్య ఏంటంటే... ఆయనకు ఈ దేశం గురించి పెద్దగా తెలియదు. కాంగ్రెస్ విధానాలకు వ్యతిరేకంగా దేశానికి ఎవరైనా మంచి చేస్తున్నారని మీరు (థరూర్‌ను ఉద్దేశిస్తూ) అనుకుంటే... అప్పుడు మీరు కూడా వారి సిద్ధాంతాలనే అనుసరించండి. ఇంకా ఎందుకు కాంగ్రెస్‌లోనే ఉన్నారు? ఈ పార్టీ నుంచి మీరు ఎంపీ కావడం వల్లేనా' అని సందీప్ దీక్షిత్ నిలదీశారు. కాంగ్రెస్ కంటే బీజేపీ, మోదీ వ్యూహాలు బాగున్నాయని భావిస్తే... అందుకు తగిన ఆధారాలతో వివరణ ఇవ్వాలని థరూర్‌కు సూచించారు. అలా చేయడం లేదంటే ఆయన మోసపూరితంగా వ్యవహరిస్తున్నారనే అర్థమని ఎంపీపై విరుచుకుపడ్డారు. ఇటీవల ఓ ప్రైవేటు కార్యక్రమంలో ప్రధాని మోదీ చేసిన ప్రసంగానికి కితాబిస్తూ థరూర్ తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు.

నితీశ్ కేబినెట్‌లో షూటర్ శ్రేయసి సింగ్

పట్నా: బీహార్‌లో గురువారం ఎన్డీయే ప్రభుత్వం మరోసారి కొలువుదీరింది. జేడీయూ అధినేత నితీశ్ కుమార్ సీఎంగా పదోసారి ప్రమాణ స్వీకారం చేశారు. అయితే శ్రేయసి సింగ్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తూ అందరి దృష్టిని ఆకర్షించారు. శ్రేయసి సింగ్ 1991 ఆగస్టు 29న బీహార్‌లోని గిధౌర్ గ్రామంలో జన్మించారు. ఆమె భారతీయ క్రీడా రంగంతోపాటు బీహార్ రాజకీయాల్లో గుర్తింపు పొందారు. ఆమె అగ్రశ్రేణి షూటర్. 2020లో బీజేపీలో చేరిన శ్రేయసి సింగ్... జముయీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. ఆర్జేడీ అభ్యర్థి షంషాద్‌ను ఓడించారు. శ్రేయసి కుటుంబంలో అందరూ రాజకీయాలకు సంబంధించిన వారే. ఆమె కేంద్ర మాజీమంత్రి దిగ్విజయ్ సింగ్ కుమార్తె. శ్రేయసి తల్లి పుతుల్ కుమారి ఎంపీగా పని చేశారు. ఆమె తాత, తండ్రి ఇద్దరూ నేషనల్ రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియాలో కీలక పదవుల్లో సేవలందిస్తున్నారు. ఈ విజయపథం ఆమెను క్రీడా ప్రపంచంలోనే కాకుండా రాజకీయ రంగంలోనూ ప్రముఖ నాయకురాలిగా నిలిపింది. శ్రేయసి సింగ్ అంతర్జాతీయస్థాయిలో షూటింగ్ విభాగంలో దేశానికి ప్రాతినిధ్యం వహించారు. 2014 కామన్వెల్త్ క్రీడల్లో డబుల్ ట్రాప్ ఈవెంట్‌లో రజత పతకం, 2018 కామన్వెల్త్ క్రీడల్లో డబుల్ ట్రాప్ ఈవెంట్‌లో స్వర్ణ పతకం గెలుచుకున్నారు. ఆమె చేసిన కృషికిగానూ భారత ప్రభుత్వం అర్జున అవార్డుతో సత్కరించింది.

ఒడిశాలో గోగూండాల బరితెగింపు

భువనేశ్వర్: బీజేపీ పాలిత రాష్ట్రం ఒడిశాలో గోగూండాలు బరితెగించారు. భద్రక్ జిల్లాలో 17 పశువులను తీసుకువెళ్తున్న వ్యాన్‌కు నిప్పుపెట్టారు. భద్రక్ గ్రామీణ పోలీస్ స్టేషన్ పరిధిలోని గెలాటువా సమీపంలో గురువారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. భద్రక్ జిల్లాలోని అగర్పడ నుండి 17 పశువులను వ్యాన్‌లో తరలిస్తున్నారు. విషయం తెలుసుకున్న గోగూండాలు వ్యాన్‌ను వెంబడించారు. భయాందోళనకు గురైన డ్రైవర్, అతని సహాయకుడు వ్యాన్ వేగం పెంచారు. దీంతో వ్యాన్ అదుపుతప్పి బోల్తాపడటంతో 12 పశువులు అక్కడికక్కడే మరణించాయి. మిగిలిన జంతువులను రక్షించిన అనంతరం వ్యాన్‌ను గోగూండాలు తగలబెట్టారు. ఈ ఏడాది భద్రక్‌లో జరిగిన రెండవ ఘటన ఇది. ఆగస్టులో గో గూండాలు 12 ఆవులను తీసుకువెళ్తున్న వాహనాన్ని అడ్డుకుని... జంతువులను విడిచిపెట్టిన అనంతరం వాహనానికి నిప్పుపెట్టారు. సెప్టెంబర్‌లో అక్రమంగా ఆవు మాంసం తరలిస్తున్నారంటూ నాలుగు వాహనాలను అడ్డుకుని, డ్రైవర్లను పోలీసులకు అప్పగించారు.

పాఠశాలకు బాంబు బెదిరింపు

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో బాంబు బెదిరింపులు కొనసాగుతూనే ఉన్నాయి. నగరంలోని ఓ పాఠశాలకు గురువారం ఉదయం బెదిరింపులు వచ్చాయి. చాణక్యపురిలోని సంస్కృతి పాఠశాలకు బెదిరింపు మెయిల్ వచ్చింది. అప్రమత్తమైన పాఠశాల యాజమాన్యం ఈ విషయాన్ని వెంటనే పోలీసులకు తెలియజేసింది. హుటాహుటిన పాఠశాలకు చేరుకున్న పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. ముందు జాగ్రత్తగా విద్యార్థులు, సిబ్బందిని అక్కడి నుంచి ఖాళీ చేయించి సోదాలు చేశారు. అయితే, ఈ తనిఖీల్లో ఎలాంటి పేలుడు పదార్థాలూ, అనుమానాస్పద వస్తువులూ లభించలేదు. ఈ బెదిరింపు బూటకమని పోలీసులు తేల్చారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేదరికం నిర్మూలన అంతంతే!

- 20.6 కోట్ల మంది బాలల పరిస్థితి దయనీయం
- కీలకమైన సేవలు ఇప్పటికీ అందడం లేదు
- యునిసెఫ్ నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ: భారతదేశంలో పేదరికం నిర్మూలన అంతంత మాత్రమేనని, ఇప్పటికీ 20.6 కోట్ల మంది బాలలు దయనీయ పరిస్థితులలో జీవిస్తున్నారని, విద్య, ఆరోగ్యం, పరిశుభ్రమైన నీరు వంటి ప్రాథమిక సేవలు పొందడంలో క్లిష్టమైన అంతరాలు ఎదుర్కొంటున్నారని యునిసెఫ్ నివేదిక గురువారం వెల్లడించింది. అయితే 2030 గడువుకు ముందే బహుమితీయ పేదరికాన్ని సగానికి తగ్గించే సుస్థిర అభివృద్ధి లక్ష్యం (ఎస్‌డీజీ) చేరుకునే దిశగా భారతదేశం పయనిస్తోందని తెలిపింది. ప్రపంచ బాలల స్థితి: బాలల పేదరికాన్ని నిర్మూలించడం... మన ఉమ్మడి ఆవశ్యకత ప్రకారం భారతదేశంలో దాదాపు 20.6 కోట్ల మంది పిల్లలు లేదా దేశంలోని దాదాపు సగం మంది బాలల జనాభా విద్య, ఆరోగ్యం, ఇల్లు, పోషకాహారం, పరిశుభ్రమైన నీరు, పారిశుధ్యం వంటి ఆరు ముఖ్యమైన సేవలలో కనీసం ఒకదానిని కూడా పొందలేకపోతున్నారు. 'దీనిలో మూడవ వంతు (6.2 కోట్ల మంది) కంటే తక్కువ మందికి రెండు లేదా అంతకంటే ఎక్కువ ప్రాథమిక సేవలు అందుబాటులో లేవు. రెండు లేదా అంతకంటే ఎక్కువ సేవల లేమి నుంచి తప్పించుకోవడానికి ఇంకా మద్దతు అవసరం' అని నివేదిక పేర్కొంది. ప్రపంచ బాలల దినోత్సవం సందర్భంగా విడుదల చేసిన ఈ నివేదిక, భారతదేశంలోని 46 కోట్ల మంది బాలల్లో సగానికి పైగా బాలలకు ప్రాథమిక సేవలు అందుబాటులో ఉన్నప్పటికీ, పురోగతి అసమానంగానే ఉందని పేర్కొంది. కాగా, జాతీయ బహుమితీయ పేదరిక సూచికను ఉటంకిస్తూ, 2013-14, అలాగే 2022-23 మధ్య 248 మిలియన్ల మంది భారతీయులు బహుమితీయ పేదరికం నుంచి తప్పించుకున్నారని, జాతీయ పేదరికం రేటు 29.2 శాతం నుంచి 11.3 శాతానికి తగ్గిందని నివేదిక తెలిపింది. 'బాలలపై పెట్టుబడి పెట్టడం కంటే పెట్టుబడిపై గొప్ప రాబడి మరొకటి లేదు' అని యునిసెఫ్ ఇండియా ప్రతినిధి సింథియా మెక్‌కాఫ్రీ అన్నారు. 'బాలల శ్రేయస్సును మెరుగుపరచడం వనరుల గురించి మాత్రమే కాదు. మనం తీసుకునే ప్రతి నిర్ణయంలో పిల్లలకు ప్రాధాన్యత ఇవ్వడానికి సమష్టి సంకల్పం, నాయకత్వం గురించి' కూడా అని ఆమె అన్నారు. పిల్లల దృష్టి కేంద్రీకృత కార్యక్రమాల కోసం ఆర్థిక స్థలాన్ని కాపాడుకోవడం 'బాలల శ్రేయస్సుకు చాలా అవసరం' అని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ అండ్ పాలసీకి చెందిన డాక్టర్ పినాకి చక్రవర్తి అన్నారు, అయితే ఓఆర్ఎఫ్‌కు చెందిన డాక్టర్ నీలాంజన్ ఘోష్ మాట్లాడుతూ వికసిత్ భారత్-2047 దాని ప్రధాన భాగంలో సమానత్వం, స్థిరత్వాన్ని పొందుపరచాలని స్పష్టం చేశారు. ఆర్థిక, సామాజిక రాబడి చాలా ఎక్కువగా ఉన్నప్పటికీ, నివేదిక నిరంతర అసమానతలను నొక్కి చెబుతుంది. వైకల్యాలున్న పిల్లలు, చిన్న పిల్లలు సంక్షోభ ప్రభావిత ప్రాంతాలలో నివసించే వారు అసమానంగా ప్రభావితమవుతున్నారు. ప్రతికూల వాతావరణ మార్పులు, సంఘర్షణ, జాతీయ రుణ భారాలు అనేక కుటుంబాలను కష్టాల్లోకి నెట్టి వేస్తున్నాయని నివేదిక పేర్కొంది. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఐదుగురు పిల్లలలో ఒకరు లేదా దాదాపు 40 కోట్ల మంది తక్కువ, మధ్య-ఆదాయ దేశాలలో ప్రాథమిక సేవలలో కనీసం రెండు తీవ్రమైన లోపాలను ఎదుర్కొంటున్నారు. పిల్లలు తీవ్రమైన ద్రవ్య పేదరికంలో జీవించే అవకాశం పెద్దల కంటే రెండింతలు ఎక్కువగా ఉందని నివేదిక పేర్కొంది. జాతీయ ప్రణాళికలలో పిల్లల హక్కులను పొందుపరచాలని, సమగ్ర సామాజిక రక్షణను విస్తరించాలని, నాణ్యమైన ఆరోగ్యం, విద్యకు సమాన ప్రాప్యతను నిర్ధారించాలని, సంరక్షకులకు మంచి పనికి మద్దతు ఇవ్వాలని, విధాన రూపకల్పనలో పిల్లల భాగస్వామ్యాన్ని బలోపేతం చేయాలని యునిసెఫ్ ప్రభుత్వాలకు పిలుపునిచ్చింది.

జేజేబీలో 50 శాతానికి పైగా పెండింగ్ కేసులు

న్యూఢిల్లీ: బాలల న్యాయవ్యవస్థ (జేజేబీ)లో 50 శాతానికి పైగా కేసుల విచారణ పెండింగ్‌లో ఉన్నాయని నివేదిక తెలిపింది. జేజేబీలో పూర్తి స్థాయి సిబ్బంది లేరని స్పష్టం చేసింది. 2023, అక్టోబరు 31 నాటికి, 362 జేజేబీల్లో సగానికి పైగా (55శాతం) కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. లక్షకు పైగా కేసుల్లో సగం కంటే తక్కువ కేసులను మాత్రమే జేజేబీలు పరిష్కరించాయని నివేదిక తెలిపింది. దేశంలోని 765 జిల్లాల్లో 92శాతం జేజేబీలు ఏర్పాటయ్యాయి. ఒడిశాలో 83శాతం, కర్నాటకలో 35శాతం కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, ఒక్కోరాష్ట్రానికి ఒక్కో పెండింగ్ రేటు ఉన్నట్లు తెలిపింది. 'చట్టంతో విభేదించే బాలల న్యాయం మరియు పిల్లలు- సామర్థ్యంపై అధ్యయనం' అనే పేరుతో ఇండియా జస్టిస్ రిపోర్ట్ (ఐజేఆర్) మొదటి నివేదికను విడుదల చేసింది. ఐజేఆర్ మాదిరిగా జేజేబీలపై కేంద్ర, ప్రజా సమాచార వ్యవస్థ లేదు. దీంతో అధ్యయనం కోసం... ఐజేఆర్ 21 రాష్ట్రాల నుంచి 250కి పైగా ఆర్‌టీఐ అభ్యర్థనలు దాఖలు చేసింది. జేజేబీల్లో ఖాళీలు కీలక విధుల్లో అధిక పనిభారానికి దారితీశాయి. జేజేబీల్లో 24 శాతం ఖాళీలు ఉండగా, జేజేబీలకు అనుబంధ న్యాయసేవల్లో 30శాతం ఖాళీలు ఉన్నాయి. ప్రతి జేజేబీలో సగటున ఏడాదికి 154 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. తగినంత డేటా పర్యవేక్షణ, నిధులు లేకపోవడంతో బాలనేరస్థులకు న్యాయం అందించడంలో తీవ్రమైన అడ్డంకులు కలిగాయి. 2023, క్రైమ్ ఇండియా డేటా ప్రకారం... భారతదేశంలోని భారత శిక్షాస్మృతి... ప్రత్యేక, స్థానిక చట్టాల ప్రకారం 31,365 కేసుల్లో 40,036 మంది బాలనేరస్థులు అరెస్టయ్యారు. వీరి నలుగురిలో ముగ్గురి కంటే ఎక్కువ మంది 16 -18 సంవత్సరాల మధ్య వయస్సు కలవారని నివేదిక తెలిపింది.

చెన్నైలో 10 లక్షల ఓట్ల గల్లంతు?

ప్రతి బూత్‌లో అడ్రస్ మారిన 300 మంది తొలగింపు

చెన్నై: రాజధాని నగరం చెన్నైలోని 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో సుమారు 10 లక్షల మంది ఓటు హక్కు కోల్పోయే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. ప్రతి బూత్‌లోనూ చిరునామా మారిన ఓటర్లు 300 మంది వరకు ఉన్నారని గుర్తించడంతో సవరణ పనుల్లో తీవ్ర చిక్కులు ఏర్పడతాయని అధికారులు తెలిపారు. ఈ నెల నాలుగున ప్రారంభమైన ఈ ప్రత్యేక సమగ్ర సవరణ పనులు మందకొడిగానే జరుగుతున్నాయి. రాష్ట్రమంతటా ఈ సవరణ పనుల కోసం ముద్రించిన 6.41 కోట్ల దరఖాస్తులను ఓటర్లకు అందజేశారు. ఆ దరఖాస్తు ఎలా పూర్తి చేయాలో తెలియక ఓటర్లంతా తలపట్టుకుంటున్నారు. నగరంలో 40 లక్షలకు పైగా ఓటర్లున్నారు. 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రస్తుతం జరుగుతున్న సవరణ ప్రక్రియలో బీఎల్వోల పరిశీలనలో ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ 200 నుంచి 300 మంది వరకు ఓటర్లు వేరే నియోజకవర్గాల్లో నివసిస్తున్నట్లు తేలింది. ఆ ప్రకారం సుమారు 10 లక్షల మంది ఓటర్లు వేర్వేరు చిరునామాల్లో నివసిస్తున్నట్లు గుర్తించారు. ప్రతి బూత్ వద్ద 60 శాతం మంది ఎన్నికల సంఘం సిబ్బంది ఇచ్చే దరఖాస్తులను సులువుగా నింపగలుగుతున్నారు. తక్కిన 40 శాతం మంది ఆ ఫారాలను ఎలా పూర్తి చేయాలో తెలియక సతమతమవుతున్నారు. ఇక అడ్రస్‌లు మారిన ఓటర్లంతా ప్రస్తుతం తాము నివసిస్తున్న నియోజకవర్గంలో ఓటు హక్కు పొందటానికి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడమేంటని ప్రశ్నిస్తున్నారు.

నాన్న కల నెరవేరింది: చిరాగ్

పట్నా: నా తండ్రి కల నెరవేరిందని ఎల్‌జేపీ(ఆర్వీ) అధినేత చిరాగ్ పాశ్వాన్ అన్నారు. బీహార్‌లో కొత్త ప్రభుత్వం కొలువైన వేళ తన పార్టీ నుంచి ఇద్దరు ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేయడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ పరిణామం తన దివంగత తండ్రి రామ్ విలాస్ పాశ్వాన్ చాలా కాలంగా ఊహించిన 'పెద్ద విజయం' అన్నారు. అభివృద్ధి చెందిన బీహార్ కోసం పనిచేయడానికి ఎన్నికల తీర్పు పార్టీపై పెద్ద బాధ్యతలను ఉంచిందని ఆయన పీటీఐకి చెప్పారు. 'రామ్‌విలాస్ పాశ్వాన్‌జీని స్మరించుకోవడానికి, బీహార్ అభివృద్ధికి కృషి చేయడానికి ఇది ఒక గొప్ప దినం. 'అన్నారు. ఎల్జేపీ(ఆర్వీ) ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో 19 స్థానాలను గెలుచుకుంది. వారిలో సంజయ్ కుమార్, సంజయ్ కుమార్ సింగ్ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. 'ఈ రోజు నుండి అభివృద్ధి చెందిన బీహార్‌ను నిర్మించే దిశలో, బీహార్‌ను మొదటి స్థానంలో, బీహారీలను మొదటి స్థానంలో ఉంచడానికి మేము వెంటనే పని ప్రారంభిస్తాము' అని ఆయన అన్నారు.

భారత్ అమ్ములపొదిలో 'జావెలిన్'

అమెరికాతో కుదిరిన ఒప్పందం

న్యూఢిల్లీ: భారత్, అమెరికా దేశాల మధ్య కీలక ఒప్పందం కుదిరింది. భారత్ రక్షణ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసేదిశగా అమెరికా 93 మిలియన్ డాలర్ల(భారత కరెన్సీలో సుమారు రూ.770 కోట్లు) ఆయుధాలు విక్రయించేందుకు ఆమోదం తెలిపింది. ఈ ఒప్పందంతో అధునాతన 'జావెలిన్ మిస్సైల్ సిస్టమ్(జేఎంఎస్)' దేశానికి రానుంది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో ఉక్రెయిన్‌కు అండగా నిలిచిన జావెలిన్ క్షిపణి... ప్రస్తుతం ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తోంది. జావెలిన్ గురించి తెలుసుకోవాలంటే...ఎఫ్‌జీఎం-148 జావెలిన్ అనేది ఒక మనిషి మోయగలిగే యాంటీ ట్యాంక్ గైడెడ్ మిస్సైల్(ఏడీజీఎం). ఇదో విధ్వంసకర క్షిపణి. దీనిని పెద్ద తుపాకీలా భుజంపై ఉంచుకుని శత్రువుల ట్యాంకులపై గురిపెట్టి ప్రయోగించవచ్చు. సాయుధ వాహనాలు(ట్యాంకులు), బంకర్లు, బలమైన స్థావరాలను కచ్చితత్వంతో నాశనం చేయగలదు. దీనిని ఒకసారి ప్రయోగించాక మరలా నియంత్రణ చేయాల్సిన అవసరముండదు. క్షిపణిలో అమర్చిన ఇన్‌ఫ్రారెడ్ సీకర్... తనంతట తానుగా లక్ష్యంవైపు దూసుకెళ్లి, ఛేదిస్తుంది. దీన్ని కంప్యూటర్ సాయంతో నియంత్రిస్తారు. అంటే ఆపరేటర్ దీన్ని ప్రయోగించిన తర్వాత సురక్షిత ప్రదేశానికి వెళ్లిపోవచ్చు. జావెలిన్ ఎక్కడి నుంచి ప్రయోగించారనే విషయం శత్రు సైన్యానికి కచ్చితంగా తెలిసే అవకాశముండదు. దీనిలో సుమారు మూడున్నర అడుగుల మిస్సైల్, డిస్పోజబుల్ లాంఛ్ ట్యూబ్, కమాండ్ కంట్రోల్ యూనిట్ వంటివి ఉంటాయి. అంతేకాకుండా రెండు పేలుడు పదార్థాలనూ వీటిలో అమర్చుతారు. ఇవి రీయాక్టివ్ ఆర్మర్ రక్షణ కవచాలను ఛేదించడం సహా ట్యాంకును ధ్వంసం చేస్తాయి. వీటిని అమెరికాకు చెందిన రేథియాన్, లాక్‌హీడ్ మార్టిన్ అనే రక్షణ రంగానికి చెందిన సంస్థలు అభివృద్ధి చేశాయి. ఒక్కో క్షిపణి ధర సుమారు 2 లక్షల డాలర్ల వరకు ఉంటుంది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో జావెలిన్ క్షిపణులను ఉక్రెయిన్ విపరీతంగా ప్రయోగించింది. దీని సాయంతో రష్యాకు చెందిన యుద్ధ ట్యాంకులను మట్టికరిపించింది. ఈ క్షిపణుల నుంచి రక్షణ పొందేందుకు రష్యా... తమ ట్యాంకులపై ఏకంగా ఇనుప బోన్లు అమర్చింది. అమెరికా విదేశాంగ శాఖ తెలిపిన వివరాల ప్రకారం... ఈ ఆయుధ ఒప్పందం అమెరికా-భారత్ వ్యూహాత్మక సంబంధాన్ని మరింత బలోపేతం చేస్తుంది. మొత్తం 93 మిలియన్ డాలర్ల ఆయుధాలు విక్రయించేందుకు రెండు దేశాలు ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఇందులో 47.5 మిలియన్ డాలర్ల విలువైన జావెలిన్ క్షిపణి వ్యవస్థలు సహా సంబంధిత హార్డ్‌వేర్ పరికరాలు రానున్నాయి. మరో 47.1 మిలియన్ డాలర్ల విలువైన ఎక్స్‌కాలిబర్ ప్రొజెక్టైల్స్ వంటి పరికరాలను అమెరికా అందించనుంది. ఈ ఒప్పందంలో భాగంగా తొలి విడతలో ఎఫ్‌జీఎం-148 క్షిపణులు, 25 జావెలిన్ లైట్ వెయిట్ కమాండ్ లాంఛ్ యూనిట్లు భారత్‌కు రానున్నాయి. ఈ ఆయుధాలు మన దేశ రక్షణ వ్యవస్థ సామర్థ్యాన్ని పెంచడం సహా ప్రాంతీయ ముప్పును అరికట్టేందుకు తోడ్పడతాయని అమెరికా చెబుతోంది.

ఎస్ఐఆర్ ప్రణాళిక 'బలవంతమే'

సీఈసీకి సీఎం మమత లేఖ

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ గురువారం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు లేఖ రాశారు. రాష్ట్రంలో కొనసాగుతున్న ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) 'ప్రణాళిక లేని, బలవంతపు' పద్ధతిలో నిర్వహిస్తున్నారని, పౌరులు, అధికారులను ప్రమాదంలో పడేస్తోందని ఆరోపించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ 'భయంకరమైన, ప్రమాదకరమైన' దశకు చేరుకుందని కూడా ఆమె పేర్కొన్నారు. కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియపై తన ఆందోళనలను అనేక సార్లు వ్యక్తం చేశానని, అయితే పరిస్థితి 'తీవ్రంగా దిగజారినందున' తాను ఇప్పుడు లేఖ రాయవలసి వచ్చిందని సీఈసీకి వివరించానని బెనర్జీ తెలిపారు. ఓటర్ల జాబితా సవరణ కసరత్తు 'ప్రాథమిక సంసిద్ధత లేదా తగినంత ప్రణాళిక లేకుండా' ప్రజలపై 'బలవంతం' చేస్తున్నారని ముఖ్యమంత్రి ఆరోపించారు. 'ఈ ప్రక్రియను అధికారులు, పౌరులపై రుద్దుతున్న విధానం ప్రణాళిక లేనిది... గందరగోళంగా ఉండటమే కాకుండా ప్రమాదకరమైనది కూడా. ప్రాథమిక సంసిద్ధత, తగినంత ప్రణాళిక లేదా స్పష్టమైన సమాచారం లేకపోవడం మొదటి రోజు నుంచే ప్రక్రియ కుంటుపడింది' అని ఆమె పేర్కొన్నారు. శిక్షణలో 'కీలకమైన అంతరాలు', తప్పనిసరి డాక్యుమెంటేషన్‌పై స్పష్టత లేకపోవడం, బీఎల్‌వోలు వారి జీవనోపాధి సమయంలో ఓటర్లను కలవడం 'దాదాపు అసాధ్యం' అని ఎత్తి చూపుతూ మొత్తం ఎస్ఐఆర్ ప్రక్రియ 'నిర్మాణాత్మకంగా బలహీనంగా' మారిందని బెనర్జీ అన్నారు. జల్పాయ్‌గురిలోని మాల్‌లో బూత్-స్థాయి అధికారిగా పని చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త మరణాన్ని ఉటంకిస్తూ... ఎస్ఐఆర్ నిర్వహణలో మానవ నష్టం ఇప్పుడు భరించలేనిది. ఈ ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి అనేక మంది ప్రాణాలు కోల్పోయారు' అని ముఖ్యమంత్రి తెలిపారు. 'ఈ పరిస్థితులలో తక్షణ దిద్దుబాటు చర్య తీసుకోవాలని నేను గట్టిగా కోరుతున్నాను. ఆశిస్తున్నాను' అని బెనర్జీ అన్నారు.

'కశ్మీర్ టైమ్స్' కార్యాలయంలో ఎస్ఐఏ సోదాలు

శ్రీనగర్: జమ్మూ కశ్మీర్‌లోని ప్రముఖ మీడియా సంస్థ కార్యాలయంలో క్యాట్రిడ్జ్‌లు లభించడం కలకలం రేపుతోంది. దేశ వ్యతిరేక కార్యకలాపాలను ప్రోత్సహిస్తోందనే ఆరోపణలతో జమ్మూకశ్మీర్ పోలీసులకు చెందిన రాష్ట్ర దర్యాప్తు సంస్థ (ఎస్ఐఏ) గురువారం కశ్మీర్ టైమ్స్ కార్యాలయంపై దాడులు చేసింది. ఈ దాడుల్లో ఏకే-47 బుల్లెట్లు లభించాయి. పోలీసు వర్గాల సమాచారం ప్రకారం.. గురువారం ఉదయం నుంచి చేపట్టిన సోదాల్లో ఏకే-47 బుల్లెట్లు, పిస్టల్ రౌండ్స్, మూడు గ్రెనేడ్ లెవర్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. భారతదేశం, జమ్మూకశ్మీర్ కేంద్ర పాలిత ప్రాంతానికి వ్యతిరేకంగా, వేర్పాటువాదానికి అనుకూల సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో ఈ సోదాలు జరిగాయి. కశ్మీర్ టైమ్స్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఇందులో సంస్థ ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ అనురాధ భాసిన్ పేరును కూడా చేర్చారు. కశ్మీర్ టైమ్స్‌ను వేద్ భాసిన్ స్థాపించారు. 1954లో వీక్లీగా ప్రచురణ ప్రారంభించిన ఈ పత్రిక... ఆ తర్వాత డైలీగా మారింది. భాసిన్ కుమార్తె అనురాధ భాసిన్ ప్రస్తుతం పత్రిక ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు.

యూఎస్ఎస్‌సీ నివేదికపై ప్రధాని స్పందన ఏంటి?

కాంగ్రెస్ ఎంపీ జైరామ్ రమేశ్

న్యూఢిల్లీ: ఆపరేషన్ సింధూర్ సమయంలో భారత్ ఎన్ని రాఫెల్ యుద్ధ విమానాలు కోల్పోయింది, యుద్ధ సమయంలో చైనా పోషించిన పాత్ర ఏంటి? ఆపరేషన్ సిందూర్ నిలిపివేసినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేస్తున్న వాదనలపై మౌనం దేనికి? అమెరికా-చైనా ఆర్థిక మరియు భద్రతా సమీక్ష కమిషన్ (యూఎస్ఎస్‌సీ) ఈ వారం తన వార్షిక నివేదికను అమెరికా కాంగ్రెస్‌కు సమర్పించిన తర్వాత ఇలాంటి ప్రశ్నలు మళ్లీ తలెత్తాయి. ఈ నివేదికను ఉటంకిస్తూ కాంగ్రెస్ ఎంపీ జైరామ్ రమేశ్... ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ప్రశ్నలు సంధించారు. గురువారం ఆయన 'ఎక్స్' వేదిక చేసిన పోస్ట్‌లో యూఎస్ఎస్‌సీ నివేదికలోని వివిధ అంశాలను ప్రస్తావించారు. పాకిస్థాన్ నేతృత్వంలో జరిగిన పహల్గామ్ ఉగ్రవాద దాడిని 'తిరుగుబాటుదారుల దాడి'గా నివేదిక అభివర్ణించిందని, అలాగే నాలుగు రోజుల ఘర్షణలో పాకిస్థాన్ భారతదేశంపై "సైనిక విజయం" సాధించినట్లు పేర్కొందని స్పష్టం చేశారు. ఆపరేషన్ సిందూర్‌ను నిలిపివేసినట్లు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వాదనలను ప్రస్తావిస్తూ, ప్రభుత్వం మౌనంగా ఉండటాన్ని జైరామ్ విమర్శించారు. "అమెరికా-చైనా ఆర్థిక, భద్రతా కమిషన్ నివేదిక ఇండియాకు ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదు. ఇప్పుడు ప్రధానమంత్రి, విదేశాంగ మంత్రిత్వ శాఖ తమ అభ్యంతరాలను తెలియజేస్తూ నిరసన తెలుపుతారా? మన దౌత్యానికి మరో తీవ్ర ఎదురుదెబ్బ తగిలింది" అని జైరామ్ పేర్కొన్నారు.

అల్ ఫలాహ్ వర్సిటీ ఉగ్రవాదుల అడ్డా

న్యూఢిల్లీ: ఢిల్లీలో ఎర్రకోట వద్ద పేలుడు ఘటనలో ముమ్మర దర్యాప్తు జరుగుతోంది. దీనిలో భాగంగా ఓ కీలక విషయం వెలుగులోకి వచ్చింది. 2008లో అహ్మదాబాద్‌లో వరుస పేలుళ్లు, 2007లో గోరఖ్‌పూర్ పేలుడు కేసుల్లో నిందితుడు షాబాద్ బేగ్ అల్-ఫలాహ్ విశ్వవిద్యాలయ పూర్వవిద్యార్థి అని దర్యాప్తు అధికారులు తాజాగా గుర్తించారు. హర్యానా ఫరీదాబాద్‌లోని ఆ విద్యా సంస్థలో 2007లో షాబాద్ బీటెక్ పూర్తి చేశాడు. ఢిల్లీలో పేలుడు తర్వాత అల్-ఫలాహ్ పేరు వార్తల్లో నిలిచింది. దానితో సంబంధం ఉన్న కొంతమంది నిందితులను ఇప్పటికే అరెస్టు చేశారు. అహ్మదాబాద్ వరుస పేలుళ్ల దర్యాప్తులో బేగ్‌కు అల్-ఫలాహ్‌తో సంబంధం ఉందని నిర్ధారించారు. షాబాద్ ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఆజంగఢ్ జిల్లా. ఎలక్ట్రానిక్స్ ఇన్‌స్ట్రుమెంటేషన్‌లో బీటెక్ పూర్తి చేశాడు. దేశవ్యాప్తంగా ఐదు పేలుడు ఘటనల్లో అతడు నిందితుడు. ఆ ఘటనల తర్వాత నుంచి అతడు పోలీసులకు చిక్కకుండా తప్పించుకుతిరుగుతున్నాడు. ఇప్పటికే వర్సిటీ వ్యవహారాలపై అధికారులు దృష్టిసారించారు. ఆ విద్యాసంస్థకు చెందిన దాదాపు 10 మంది కనిపించకుండా పోయారని నిఘా వర్గాలను ఉటంకిస్తూ జాతీయమీడియాలో కథనాలు వచ్చాయి. ఆ వ్యక్తుల ఫోన్లు స్విచ్ ఆఫ్ వస్తున్నాయని పేర్కొన్నాయి.

ఎంపీలో జావెద్ అక్రమ నిర్మాణాలు

అల్- ఫలాహ్ యూనివర్సిటీ చైర్మన్ జావెద్ సిద్దిఖీ గురించి తాజాగా మరో కీలక విషయం బయటకు వచ్చింది. మధ్యప్రదేశ్‌లో ఆయన కుటుంబానికి సంబంధించిన అక్రమ నిర్మాణాలను అధికారులు గుర్తించారు. మోవ్ కంటోన్మెంట్ బోర్డులో జావెద్ కుటుంబానికి సంబంధించిన వ్యక్తులు అక్రమంగా నిర్మాణాలు చేపట్టినట్లు అధికారులు తేల్చారు. మూడు రోజుల్లో దాన్ని కూల్చివేయాలని నోటీసులు జారీ చేశారు. కంటోన్మెంట్ ఇంజినీర్ హెచ్ఎస్ కలోయా మాట్లాడుతూ 'జావెద్ తండ్రికి సంబంధించిన ఇంటిలో అనధికారికంగా చేపట్టిన నిర్మాణాలు తొలగించాలని గతంలో పలుమార్లు నోటీసులు జారీ చేశాం. అయినప్పటికీ.. వాళ్లు వాటిని బేఖాతరు చేసినట్లు తెలుస్తోంది. మూడు రోజుల్లోగా వాటిని కూల్చివేయాలని ఆదేశిస్తూ తాజాగా మరోసారి నోటీసులు ఇచ్చాం' అని తెలిపారు. తమ ఆదేశాలు పట్టించుకోకపోతే కూల్చివేత పనులు తామే చేపడతామన్నారు. నిబంధనల ప్రకారం దానికి సంబంధించిన ఖర్చులను వారి నుంచి వసూలు చేస్తామన్నారు.

విశాలాంధ్ర హైదరాబాద్

ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రి కవిత సందర్శన

విశాలాంధ్ర,షాద్ నగర్, రూరల్: జాగృతి జనం బాటలో భాగంగా రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పర్యటించారు. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని కవిత సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ షాద్‌నగర్ వంద పడకల ఆసుపత్రి నిర్మాణం పూర్తయినా ఇంకా పాత బిల్డింగ్ నుంచి కొత్త బిల్డింగ్‌కి మార్చలేదన్నారు. ఇప్పుడున్న భవనం శిథిలావస్థకు చేరిందని అత్యంత త్వరలో కొత్త భవనానికి ఆసుపత్రి సేవలు మార్చాలని, వసతులతో పాటు సిబ్బందిని అవసరమైన మేరకు సమకూర్చాలన్నారు.రాష్ట్రంలో ఉన్న సమస్యల పట్ల అవగాహన కోసమే జాగృతి జనం బాట చేపట్టామన్నారు. ఎన్నో ఏళ్లుగా పేరుకుపోయిన సమస్యలను తెలుసుకొని వాటిలో క్లిష్టమైన సమస్యలను ఎన్నుకొని వాటిపై జాగృతి ఉద్యమం చేస్తుందన్నారు. వైద్య సేవల కోసం సిబ్బంది సంఖ్య పెంచాలని ఆమె కోరారు.

చుక్కా రామయ్యకు కేటీఆర్ జన్మదిన శుభాకాంక్షలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రముఖ విద్యావేత్త, ఐఐటీ కోచింగ్ వ్యవస్థకు మార్గదర్శి అయిన గురువు చుక్కా రామయ్య జన్మదినాన్ని పురస్కరించుకుని, తెలంగాణ మాజీ మంత్రి కేటీఆర్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. 100 వ జన్మదినం జరుపుకుంటున్న చుక్కరామయ్యకు విద్యానగర్‌లో ఉన్న ఆయన నివాసానికి వెళ్లి జన్మదిన శుభాకాంక్షలు కేటీఆర్ స్వయంగా తెలియజేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థుల భవితను తీర్చిదిద్దిన వ్యక్తి రామయ్య అని కొనియాడారు. 'ఐఐటీ అనగానే గుర్తుకొచ్చే తొలి పేరు, విద్య అంటే గుర్తుకొచ్చే మార్గదర్శి, సేవ అంటే గుర్తుకొచ్చే స్ఫూర్తి అంతా చుక్కా రామయ్య గారిదే,' అని ఆయన పేర్కొన్నారు. వేలాదిమంది విద్యార్థులను ఐఐటి వంటి ఉన్నత విద్యా సంస్థలకు పంపి దేశానికి అద్భుతమైన సేవ చేసిన గొప్ప విద్యావేత్త చుక్కారామయ్య అన్నారు. విద్యారంగానికి ఆయన చేసిన సేవలు అపారమైనవని, ఉన్నతమైన విద్యను గ్రామీణ విద్యార్థులకు చేరవేసిన గొప్ప కృషికి ఆయన నిలువెత్తు సాక్ష్యమని కేటీఆర్ ప్రశంసించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లో ఐఐటి పూర్తి చేసి ప్రపంచ దేశాల్లో స్థిరపడడానికి కారణం చుక్క రామయ్య అని కొనియాడారు. విద్య ప్రదాత కాకుండా తెలంగాణ పోరాటంలో రాజకీయాల్లో దిక్సూచిగా తన పాత్ర పోషించాడని ఆయన అన్నారు. అలాంటి చుక్క రామయ్య 100వ బర్త్ డే జరుపుకోవడం మనందరికీ ఎంతో స్ఫూర్తిదాయకమని ఆయన అన్నారు. రామయ్య ఆరోగ్యంగా, సుదీర్ఘకాలం జీవించాలని ఆయన ఆకాంక్షించారు. కేటీఆర్ తో పాటు వెళ్లిన నేతలు తలసాని శ్రీనివాస్ యాదవ్ , పళ్ళ రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, ముఠాగోపాల్ చుక్క రామయ్యకు శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఫార్ములా-ఈ కేసు.. ప్రతీకార రాజకీయ దాడి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఫార్ములా-ఈ కేసు పూర్తిగా కల్పితం, కక్ష సాధింపు రాజకీయ ఎత్తుగడగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూపొందించిన 'వ్యక్తిగత ప్రతీకార నాటకం'గా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ డా. శ్రవణ్ దాసోజు తీవ్రంగా ఖండించారు. ఇది కేటీఆర్ వ్యక్తిత్వహననం చేయాలనే ఉద్దేశంతో ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నమని ఆయన మండిపడ్డారు. ఈ కేసు చట్టపరమైన స్థిరత్వం, వాస్తవ ఆధారాలు, సాక్ష్యాలు లేని పక్కా కుట్రగా ఆయన అభివర్ణించారు. 'ఇది చట్టం కాదు. ఇది న్యాయం కాదు. ఇది రేవంత్ రెడ్డి రాసిన ప్రతీకార స్క్రిప్ట్. ఆయనే దీనికి దర్శకుడు, నిర్మాత, నటుడు' అని వ్యాఖ్యానించారు. బ్రాండ్ హైదరాబాద్‌ను నిర్మించి, తెలంగాణను ప్రపంచ పెట్టుబడుల కేంద్రంగా తీర్చిదిద్దిన నాయకుడిపై దాడిచేయడానికి ప్రజాస్వామ్య సంస్థలను దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. ఫార్ములా-ఈ తెలంగాణకు పెట్టుబడులు, ఉపాధి, ఈవీ ఇన్నోవేషన్‌ను తీసుకురావాలనే ఉద్దేశంతో నిర్వహించబడింది. ఈ కార్యక్రమం ద్వారా అంతర్జాతీయ ఈవీ పెట్టుబడులు, భారీ యువత ఉపాధి, అర్బన్ మొబిలిటీ అభివృద్ధి, హైదరాబాద్ గ్లోబల్ బ్రాండింగ్ సాధ్యమయ్యాయని గుర్తుచేశారు. ప్రపంచం మెచ్చిన ఈ ఈవెంట్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు స్కాండల్‌గా మార్చడం తెలంగాణ ప్రజల గౌరవంపై దాడి చేయడమే అని అన్నారు. "ప్రపంచ స్థాయి ఈవెంట్‌ను రేవంత్ రెడ్డి గల్లీ స్థాయి రాజకీయాలుగా మార్చారు. ఇది హైదరాబాద్‌కు, యువతకు, తెలంగాణ ఆశయాలకు అవమానం" అని విమర్శించారు. కేటీఆర్ పారదర్శకత, దూరదృష్టి, అంకితభావంతో పనిచేశారని, హైదరాబాద్‌ను గ్లోబల్ డెస్టినేషన్‌గా మార్చినందుకే ఆయనను లక్ష్యంగా చేసుకుంటున్నారని పేర్కొన్నారు. కేటీఆర్ కృషిని ఎలాంటి కుట్రలు తుడిచిపెట్టలేవని స్పష్టం చేశారు. న్యాయవ్యవస్థపై పూర్తి నమ్మకం ఉందని, ఈ కల్పిత కేసు కోర్టుల్లో నిలబడదని తెలిపారు. తప్పుడు కేసులు పాలనకు ఆయుధాలైతే ప్రజాస్వామ్యం కూలిపోతుందని హెచ్చరిస్తూ, సత్యం, న్యాయం, గౌరవం కోసం తెలంగాణ ప్రజలు నిలబడాలని డా. శ్రవణ్ దాసోజు విజ్ఞప్తి చేశారు.

కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన టీజీటీఏ నూతన కమిటీ సభ్యులు

విశాలాంధ్ర, హైదరాబాద్ : తెలంగాణ తహసీల్దార్స్ అసోసియేషన్ (టీజీటీఏ) హైదరాబాద్ జిల్లాకు నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు వారి అధ్యక్షులు ప్రేమ్ కుమార్, బాలశంకర్, తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ కలెక్టర్ల సంఘం ప్రధాన కార్యదర్శి రామకృష్ణ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన ఐఏఎస్‌ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛము అందించారు. తదనంతరం అడిషనల్ కలెక్టర్ ఖదిరావన్ ఐఏఎస్‌ని, ముకుందరెడ్డి అడిషనల్ కలెక్టర్‌ని వెంకటాచారి జిల్లా రెవిన్యూ అధికారిని మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ కార్యక్రమములో అసోసియేట్ అధ్యక్షులు వెంకట్‌రామిరెడ్డి, సంయుక్త కార్యదర్శి పాండు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎన్.సునిత, కల్చరల్ సెక్రటరీ నిహారిక, స్పోర్ట్స్ సెక్రటరీగా అన్వర్, కోశాధికారి నయ్యూముద్దీన్, టీజీటీఏ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షురాళ్లు విజయలక్ష్మీ, శ్రీదేవి, అసోసియేట్ అధ్యక్షుడు నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కర్షకుల ప్రభుత్వం : మంత్రి సీతక్క

విశాలాంధ్ర - హైదరాబాద్ : కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే కర్షకులు ప్రభుత్వం అని మంత్రి సీతక్క అన్నారు. వైయస్సార్ హయంలో ఉచిత విద్యుత్ మొదలుకుని పంట బోనస్ దాకా, మాది రైతు ప్రభుత్వం అని చెపుకొచ్చారు. కామారెడ్డి పర్యటనలో తనను రైతులు అడ్డుకున్నట్లు బీఆర్ఎస్ సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని బీఆరెస్‌పై మండిపడ్డారు. సొంత సోషల్ మీడియా కారణంగా జూబ్లీహిల్స్‌లో చిత్తుగా ఓడినా బీఆర్ఎస్‌కు బుద్ధి రాలేదని విమర్శించారు. అతి చిన్న వయసులో ఎవరెస్ట్ శిఖరం అధిరోహించిన గిరిజన బిడ్డ మాలవత్ పూర్ణ కుటుంబాన్ని పరామర్శించడానికి వెళుతుంటే బీఆర్ఎస్ గ్రామ కమిటి అధ్యక్షుడు మా కాన్వాయికి అడ్డుగా వచ్చాడని ఆరోపించారు. గిరిజన బిడ్డ మాలవత్ పూర్ణ కుటుంబ సందర్శనను కూడా బీఆర్ఎస్ తట్టుకోలేకపోతుందన్నారు. మాలవత్ పూర్ణ తండ్రి ఇటీవల మరణిస్తే..వారి గ్రామానికి పరామర్శకు వెళ్లానని, గ్రామ టీఆర్ఎస్ అధ్యక్షుడు మా వాహనం ముందుకు పరుగెత్తుకుని వచ్చాడని పేర్కొన్నారు. పరామర్శ కార్యక్రమానికి అడ్డుతగలడం బీఆర్ఎస్ దిగజారుడు రాజకీయానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. కేవలం 9 రోజుల్లోనే రూ. 9 వేల కోట్ల రైతు భరోసా నిధులు రైతుల ఖాతాల్లో జమ చేశామని ఇప్పటికైనా బీఆర్ఎస్ చిల్లర రాజకీయాలు మానుకోవాలన్నారు. డిసెంబర్ 11న స్థానిక ఎన్నికల షెడ్యుల్ వస్తుందని ఎక్కడా చెప్పలేదన్నారు. అవాస్తవాలను ప్రచారం చేయొద్దని కోరుతున్నానని తెలిపారు. స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదని సుప్రీం కోర్టు స్పష్టం చేసిందని, అయినా బీసీలకు పార్టీ పరంగా 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని వివరించారు.

ఇంటింటికి ఇందిరమ్మ చీర

ఇందిరమ్మ మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమాన్ని అత్యంత క్రమశిక్షణతో, పారదర్శకంగా నిర్వహించాలని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా.దనసరి అనసూయ సీతక్క అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. సెర్ప్ ఉన్నతాధికారులతో గురువారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన మంత్రి సీతక్క అధికారులకు దిశా నిర్దేశం చేశారు. మహిళల గౌరవం, వారి శ్రేయస్సు కోసం ప్రభుత్వం ప్రారంభించిన ఈ మహత్తర కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా పండుగ వాతావరణంలో సాగాలని ఆమె పేర్కొన్నారు. 18 ఏళ్ల పైబడిన ప్రతి మహిళకు చీర అందేలా పంపిణీ కార్యక్రమం నిర్వహించాలని సీతక్క సూచించారు. నూతన లబ్దిదారులను గుర్తించేందుకు పౌర సరఫరాల శాఖ సహకారాన్ని తీసుకోవాలన్నారు. ప్రస్తుత, కొత్త లబ్ధిదారుల వివరాలను ప్రత్యేకంగా రూపొందించిన సెర్ప్ ప్రొఫైల్ యాప్ నమోదు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారి చేశారు. పంపిణీ కార్యక్రమం దశలవారీగా నిర్వహిస్తున్నట్లు మంత్రి సీతక్క తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో నవంబర్ 19 నుంచి డిసెంబర్ 9 వరకు మొదటి దశలో, పట్టణ ప్రాంతాల్లో మార్చి 1 నుంచి 9 వరకు రెండో దశగా పంపిణీ చేయాలని ఆమె స్పష్టం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించినట్లుగా, ప్రతి నియోజకవర్గానికి సబ్ కలెక్టర్ లేదా ఆర్డీఓ స్థాయి ప్రత్యేక అధికారిని నియమించి, నియోజకవర్గం నుంచి మండల, గ్రామ స్థాయిల వరకు పంపిణీని పర్యవేక్షించేలాగా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని సీతక్క సూచించారు. ఇందిరమ్మ చీరల పంపిణి కార్యక్రమాన్ని పురస్కరించుకుని మహిళా స్వయం సహాయక బృందాల ప్రాముఖ్యతను, ఇందిరా మహిళా శక్తి విజయాలను చాటే విధంగా నియోజకవర్గ, మండల స్థాయిలో ప్రారంభ కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి పర్యవేక్షణలో కార్యక్రమం జరగాలని, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధు లందరికీ మండల స్థాయి కార్యక్రమాలకు ఆహ్వానం పలకాలని ఆమె అధికారులను కోరారు. ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం మహిళల జీవితాల్లో ఆనందాన్ని నింపే పండుగలా మారాలని, ప్రతి జిల్లాలో అవగాహన కార్యక్ర మాలు చేపట్టి ప్రచారం పెంచాలని సీతక్క ఆదేశించారు.

ఖనిజ రంగంలో తెలంగాణకు నీతి ఆయోగ్ గుర్తింపు

విశాలాంధ్ర, హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక ఖనిజ రంగానికి అధిక ప్రాధాన్యతను ఇస్తూ కార్యాచరణ ప్రారంభించి మిగిలిన అన్ని రాష్ట్రాల కన్నా ముందున్న నేపథ్యంలో దేశవ్యాప్త గుర్తింపును పొందుతుందని, ఇటీవల నీతి ఆయోగ్ సంస్థ ఏర్పాటు చేసిన జాతీయ స్థాయి కీలక ఖనిజ కమిటీలో రాష్ట్ర ప్రభుత్వ సంస్థ అయిన సింగరేణికి ప్రముఖ స్థానం కల్పించడం దీనికి నిదర్శనమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఈ నెల 19న నీతి ఆయోగ్ ప్రకటించిన జాతీయ స్థాయి కీలక ఖనిజాల గుర్తింపు, అన్వేషణ కమిటీలో సింగరేణి సంస్థకు ప్రాధాన్యతనిస్తూ ఆ సంస్థ సీఎండీని సభ్యుడిగా పేర్కొంటూ ఆఫీస్ మెమొరాండం విడుదల చేసిన నేపథ్యంలో భట్టి విక్రమార్కమల్లు గురువారం ప్రకటన చేశారు. దేశ అవసరాలకు కీలకమైన కీలక ఖనిజాల అన్వేషణను తెలంగాణ ప్రభుత్వం ప్రాధాన్య అంశంగా పరిగణిస్తూ ప్రభుత్వ సంస్థలను ప్రోత్సహిస్తూ ముందుకెళ్తున్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. ఇప్పటికే ఆస్ట్రేలియా, రష్యా, ఘనా వంటి దేశాలతో వ్యాపార విస్తరణ అవకాశాలపై చర్చలు జరుపుతున్నామని, కీలక ఖనిజరంగంలో అవకాశాలను అధ్యయనం చేయటానికి ఇప్పటికే ఏజెన్సీలను నియమించుకున్నామని తెలిపారు. ఇటీవల కేంద్రం నిర్వహించిన కీలక ఖనిజాల అన్వేషణ వేలంపాటలో సింగరేణి సంస్థ పాల్గొని బంగారం, రాగి ఖనిజాల అన్వేషణకు లైసెన్స్ కూడా సాధించిందన్నారు. సింగరేణి ప్రాంతంలోని గుట్టల్లో, ఓపెన్ కాస్ట్ గనుల మట్టిలో, సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం నుండి వెలువడే ప్లై యాష్ మరియు బాటమ్ యాష్‌లో ఉన్న కీలక ఖనిజాలు, రేర్ ఎర్త్ ఎలిమెంట్స్‌ను గుర్తించడానికి, వాటిని వాణిజ్యపరంగా ఉత్పత్తి చేయడానికి గల అవకాశాలపై కలిసి పని చేసేందుకు జాతీయస్థాయి సంస్థలైన ఎన్ ఎఫ్‌టిడిసి, ఐఎంఎంటి, జెఎన్‌ఏ ఆర్‌డిడిసి వంటి సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకున్నామన్నారు. అదే కాకుండా తెలంగాణ ప్రభుత్వ దిశా నిర్దేశంలో సింగరేణి కీలక ఖనిజ రంగంలో అవలంబిస్తున్న విధానాలను ఇతర రాష్ట్రాలు కూడా ఆదర్శంగా తీసుకుంటున్నాయని ఆయన పేర్కొన్నారు. ఇటీవల అసోం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కూడా కేంద్ర గనుల శాఖకు రాసిన లేఖలోనూ కీలక ఖనిజాల విషయంలో సింగరేణి మోడల్‌ను స్వీకరించాలని ప్రస్తావించడం మన రాష్ట్ర విధానాలకు జాతీయ స్థాయిలో దక్కుతున్న గుర్తింపుగా భావించవచ్చన్నారు. గ్రీన్ ఎనర్జీ రంగంలోనూ సింగరేణి విస్తరణ కోసం ఎన్టీపీసీ అనుబంధ సంస్థ అయిన ఎన్జీఇఎల్ సంస్థతో కలిసి పని చేయడానికి కూడా ఒక ఒప్పందం కుదుర్చుకున్నామని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ చొరవతో రాజస్థాన్ విద్యుత్ ఉత్పదాన్ నిగమ్ లిమిటెడ్‌తో కలిసి సింగరేణి సంస్థ 2300 మెగావాట్ల థర్మల్, సోలార్ విద్యుత్ ఉత్పాదనకు కుదుర్చుకున్న ఒప్పందానికి బుధవారం ఆ రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలపడం హర్షణీయమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు పేర్కొన్నారు. రాజస్థాన్ రాష్ట్ర క్యాబినెట్ అనుమతి లభించింది కాబట్టి రాజస్థాన్ లోని సోలార్ వ్యాలీలో ఏర్పాటు చేయనున్న 1500 మెగావాట్ల సోలార్ ప్లాంట్‌కు కావలసిన స్థలం త్వరగా సమకూరుతుం దన్నారు. ఒప్పందంలో భాగంగా మరో ఎనిమిది వందల మెగావాట్ల ప్లాంట్ ను ప్రస్తుత మంచిర్యాల సమీపంలో గల సింగరేణి థర్మల్ విద్యుత్ ప్రాంగణంలో ఏర్పాటు చేయనుందని పేర్కొన్నారు. క్యాబినెట్ సమావేశంలో సింగరేణి - రాజస్థాన్ విద్యుత్ ఉత్పాదన నిగం లిమిటెడ్ ఒప్పందానికి అనుమతి ఇచ్చిన రాజస్థాన్ రాష్ట్ర ప్రభుత్వానికి తన అభినందనలు శుభాకాంక్షలు తెలియ జేశారు. వీలైనంత త్వరగా ఈ ప్లాంట్ల నిర్మాణాన్ని చేపట్టేందుకు జాయింట్ వెంచర్ కంపెనీని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ను ఆదేశించారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన : కలెక్టర్

విశాలాంధ్ర, హైదరాబాద్ : విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా నాణ్యమైన విద్యాబోధన అందాలని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం ఎన్‌బిటి(నందమూరి బసవ తారక నగర్) లోని ప్రైమరీ, ఉన్నత పాఠశాలు కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు గుణాత్మకమైన విద్య బోధన అందించడంతో పాటు సమయానికి నాణ్యమైన ఆహార పదార్థాలను అందించాలని సూచించారు. ప్రైమరీ, ఉన్నత పాఠశాలలు, భవిత కేంద్రాన్ని అలాగే క్రీడ మైదానాన్ని కలెక్టర్ సందర్శించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేసారు. అలాగే ప్రైమరీ,ఉన్నత పాఠశాలలు అలాగే భవిత సెంటర్ లో పిల్లల తో పాటు ఉపాధ్యాయులు సంఖ్య, అందుతున్న విద్య బోధన తీరును కలెక్టర్ అడిగి తెలుసు కున్నారు. భవిత కేంద్రంలో పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని అలాగే అందుతున్న వైద్య సేవలు, విద్యాబోధన వివరాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల తరగతి గదులు, పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచి, పిల్లలకు అనువైన వాతావరణాన్ని కల్పించాలని, పరీక్షలు సమయం సమీపిస్తున్న తరుణంలో ఉత్తీర్ణత శాతం మెరుగు పర్చుటకు ప్రత్యేక క్లాసులను నిర్వహించి, పిల్లలలో ఏకాగ్రతను పెంచుటకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధపెట్టి, వారి అభ్యున్నతికి పాటుపడాలని ఆమె సూచించారు. ప్రైమరీ పాఠశాలలోని గోడపై కలర్స్‌లతో ఉన్న వివిధ రకాల ఆర్ట్స్‌ను పరిశీలించి, పిల్లలతో ముఖాముఖిగా ముచ్చటించారు. ఉన్నత పాఠశాలను సందర్శించి సబ్జెక్టులలో గల సిలబస్ పూర్తిగా అయ్యాయా లేదా అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో ప్రైవేటుకు దీటుగా అన్ని మౌలిక వసతులు కల్పించడం జరిగిందని మెరుగైన ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. ఉపాధ్యాయులతో మధ్యాహ్న భోజనం వివరాలపై అడిగి తెలుసుకొని విద్యార్థులకు అందించే ఆహార పదార్థాలను పరిశీలించారు. పరీక్షల సమయము దగ్గర పడుతున్నందున విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదివి, సబ్జెక్టులపై ఏకాగ్రత ఉంచాలని ప్రతి ఒక్కరు ఉత్తీర్ణులు అయ్యే విధంగా కష్టపడాలని పిల్లలకు ఆమె ఉద్బోధించారు. విద్యార్థులకు విద్యతోపాటు క్రీడల్లో రాణించే విధంగా అవసరమైన తర్ఫీదు ఇప్పించి, వివిధ క్రీడల్లో రాణించుటకు తోడ్పాటును అందించి, ప్రోత్సహించాలని ఉపాధ్యాయులకు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణి, హెచ్‌ఎం రవీందర్ రెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాలి : పద్మావతి

విశాలాంధ్ర - హైదరాబాద్ : భారత మహిళా సమాఖ్య ఎన్‌ఎఫ్‌ఐ డబ్ల్యూ మహబూబ్‌నగర్ పట్టణ కమిటీ కార్యదర్శి ఇందిర అధ్యక్షతన ఓల్డ్ మోతి నగర్‌లో జరిగిన సమావేశానికి హాజరై మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో మహిళలు ఉపాధి కరువై అనేక అవస్థలు పడుతున్నారు ఓ వైపు నిత్యావసర ధరలు కొండెక్కి కూర్చున్నాయని మండిపడ్డారు. ఉచిత బియ్యం కొన్ని తినాలి అన్న రూ.100 కూరగాయలకు కేటాయించాల్సి వస్తుంది. గ్యాస్ సిలిండర్ ధరలు 1000 రూపాయలకు దగ్గర ఉన్నాయన్నారు. టెక్నాలజీ బాగా అభివృద్ధి చెందుతుందని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వాలు పేదల చేతిలో ఉన్న సెల్ ఫోన్ నడవాలి అన్నా నెలకు రూ.400 బిల్లు చెల్లించాల్సి వస్తుందన్నారు. టీవీ చూడాలన్న నెలకు రూ.300లు స్టార్ బిల్లులు కట్టాలి ఇలా ప్రతి వస్తువు అంబానీ చెబితేనే మన ఇంట్లో పని చేస్తుందని పేర్కొన్నారు. మారిపోయిన పరిస్థితులు దేశ సంపద అందరికీ సమానంగా అందాలి. కొందరి చేతుల్లో బందీ అయిపోయిందన్నారు. ఈరోజు కోటీశ్వరుడి చేతిలో ఉన్న సెల్ ఫోన్ రూ.400లు ఖర్చవుతుంది మరి సామాన్య కూలీ చేతిలో ఉన్న సెల్ ఫోన్ నడవాలన్న రూ.400 ఖర్చు చేయాల్సిన పరిస్థితి దాపురించిందని వివరించారు. అసలే ఉపాధి లేక రోజు కూలి 200 సంపాదించుకునే వారికి ఇది పెను భారంగానే మారిందన్నారు. ఉన్న ఊర్లో ఉపాధి కోల్పోయి పట్టణాలకు వస్తే ఇక్కడ ఉన్న ఇంటి అద్దెల భారం పెరిగిపోయి పేదవాళ్ళు అప్పుల పాలయ్యే పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు. పేద, మధ్య తరగతి మహిళలు ఇంటి అద్దెలు కట్టలేక దినదిన గండంగా గడుపుతున్నారు. అంటూ వాపోయారు ప్రస్తుత ప్రభుత్వమైనా ఈ సమస్యకు పరిష్కారం చూపించాలి పేదలకు అర్హులైన వారికి డబల్ బెడ్ రూమ్ ఇల్లు కేటాయించాలి సమావేశం అనంతరం నూతన శాఖ ఏర్పాటు చేయడం జరిగింది.శాఖ అధ్యక్షురాలిగా మున్ని బేగం, కార్యదర్శిగా కృష్ణవేణి, సభ్యులుగా ఆలూరు లక్ష్మమ్మ, అంజమ్మ, యాదమ్మ, జహేదా, అమీనా బేగం ,హర్ష, భావన కార్యక్రమానికి, పట్టణ కార్యదర్శి ఎం ఇందిర, మున్ని బేగం, లతా, అమీనా బేగం, జహేదా, షబానా, హర్ష బేగం, భావన, సుభద్రమ్మ, అంజమ్మ, రహీమా బేగం తదితరులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసులు త్వరగా పరిష్కరించాలి :బక్కి వెంకటయ్య

విశాలాంధ్ర, హైదరాబాద్ : రంగారెడ్డి జిల్లాలో అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని రాష్ట్ర ఎస్.సి.,ఎస్.టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య జిల్లా యంత్రాంగానికి సూచించారు. గురువారం జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి డిసిపిలు సత్యనారాయణ, పూర్ణ చంద్రరావు, ఉదయ్ రెడ్డి, ఆధ్వర్యంలో రాష్ట్ర ఎస్.సి., ఎస్.టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య జిల్లా ఆధ్వర్యంలో పోలీసు, రెవెన్యూ అధికారులు, ఎస్.సి.,ఎస్.టి అభివృద్ధి, సంక్షేమ శాఖల అధికారులు, కుల సంఘాల నాయకులతో ల్యాండ్, అట్రాసిటీ కేసులలో పురోగతి, ఎస్సీ, ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్లో ఉన్న ఎస్.సి.,ఎస్.టి అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరిం చేందుకు చొరవ చూపాలన్నారు. అన్ని రకాల పెండింగ్ కేసులను వెంటనే పరిష్కరించాలన్నారు. ఎస్సీ, ఎస్టీలు, అణగారిన వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురిచేసే గ్రామాభివృద్ధి కమిటీలను ఎంతమాత్రం ఉపేక్షించబోమని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కమిషన్ చైర్మన్ వెంకటయ్య అదనపు కలెక్టర్, డి.సీ.పీలకు సూచించారు. పోలీస్ స్టేషన్లలో ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం పక్కాగా అమలు జరిగేలా చూడాలని, ఎస్సీ, ఎస్టీలకు న్యాయం జరిగేలా రెవెన్యూ, పోలీసు అధికారులు, సిబ్బంది పని చేయాలని సూచించారు. అధికారులు ఎస్.సి.,ఎస్.టి గురుకుల పాఠశాలలను వసతి గృహాలను తరచు తనిఖీలు చేయాలని విద్యార్థులకు నాణ్యమైన భోజనం మెరుగైన విద్యను అందించేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎస్.సి.,ఎస్.టిలకు వేధింపులకు గురిచేసే అధికారులపై కఠిన చర్యలు కమిషన్ తరపున తీసుకున్నట్టు తెలిపారు. ఎస్.సి.,ఎస్.టిలకు సంబంధించిన అన్ని రకాల కేసులను పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని ప్రతి నెల రోజులకు ఒకసారి ఎస్.సి., ఎస్.టి సమస్యలపై అధికారులు సమీక్ష సమావేశం నిర్వహించేలా చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్, ఎస్పీలకు, ఎస్సీ కమిషన్ చైర్మన్ సూచించారు. జిల్లా అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి మాట్లాడుతూ భూమి సమస్యలపై ఆర్డీవోలతో ఎంక్వయిరీ చేయించి ఎస్.సి.,ఎస్.టిలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సమీక్షలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్, లక్ష్మీనారాయణ, జిల్లా శంకర్, డిఆర్ఓ సంగీత, డిసిపిలు సత్యనారాయణ, పూర్ణచంద్రరావు, ఉదయ్ రెడ్డి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రామరావ్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి రామావేశ్వరి దేవి,జిల్లా పరిషత్ సిఈఓ కృష్ణారెడ్డి, ఆర్డీఓలు చంద్రకళ, వెంకట్ రెడ్డి, సరిత తహసీల్దారులు, మున్సిపల్ కమిషనర్లు, జిల్లా అధికారులు కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రపతి పర్యటనలో భాగంగా రాష్ట్రాల స్టాల్స్ పరిశీలన

విశాలాంధ్ర, హైదరాబాద్ : భారత రాష్ట్రపతి రెండు రోజుల పర్యటనలో భాగంగా హైదరాబాద్ విచ్చేయు సందర్భంగా బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలోని అదనపు కలెక్టర్ జి.ముకుందరెడ్డి, ఆర్డీవో సాయిరాం, రాష్ట్రపతి నిలయం మేనేజర్ లతో కలసి వివిధ రాష్ట్రాల స్టాల్స్, కల్చరల్ డయాస్ ఏర్పాట్లను కలెక్టర్ హరిచందన పరిశీలించారు.

ప్రత్యేక అధికారికి సత్కారం

విశాలాంధ్ర, హైదరాబాద్ : జలమండలికి జాతీయ అవార్డును అందుకున్న సందర్భంగా జలమండలి ఇంకుడు గుంతల ప్రత్యేక అధికారి సత్యనారాయణను ఎండీ అశోక్ రెడ్డి, ఈడీ మయాంక్ మిట్టల్ లు ఎండీ ఛాంబర్ లో సత్కరించారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ ఓ ఆర్ ఆర్ పరిధిలో ఇంకుడు గుంతలు నిర్మాణంలో క్రియాశీల పాత్ర పోషించారని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జలమండలి డైరెక్టర్లు సుదర్శన్, టీవీ శ్రీధర్, వినోద్ భార్గవ, సీవీఓ గ్యానేందర్ రెడ్డి పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యలు పరిష్కరించండి

విశాలాంధ్ర, మల్కాజిగిరి : ఈస్ట్ ఆనంద్ బాగ్ పరిధిలోని తిరుమల నగర్‌లో వారం రోజుల నుండి డ్రైనేజీ పొంగి స్థానికులకు తీవ్ర ఇబ్బం దులు కలుగుతున్నాయని, సమస్య పరిష్కరిం చాలని కాలనీవాసులు కార్పొరేటర్ వై.ప్రేమ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. వెంటనే స్పందించిన కార్పొరేటర్ అధికారులను పిలిపించి సమస్యను వివరించి డ్రైనేజిని శుభ్రం చేయించారు. ఈ కార్యక్రమంలో ఏ.ఈ. సత్యలక్ష్మి, వర్కింగ్ ఇన్స్‌పెక్టర్ రజనీకాంత్, కాలనీవాసులు బాబురావు, రత్నమ్మ, లక్ష్మీ, రాధిక, ఉమారాణి, రత్నం, వెంకటేష్, గంగరాజు, శ్రీనివాస్, కిషోర్ పాల్గొన్నారు.

సీపీఐ పేదల పక్షాన సమరశీల పోరాటాలు

విశాలాంధ్ర-జవహర్ నగర్ : భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ రాష్ట్ర పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నటువంటి బస్సు ప్రచార జాత గురువారం వివిధ జిల్లాలను ముగించుకొని జవహర్ నగర్‌కి చేరుకోవడం జరిగింది. ఈ జాతకు భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పైళ్ళపద్మ, రాష్ట్ర అధ్యక్షులు వలి ఉల్ల కాద్రి, ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకులు ఉప్పలయ్య, రైతాంగం రాష్ట్ర కోశాధికారి పాల్గొనగా సిపిఐ మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ తోటపల్లి శంకర్ అధ్యక్షతన జరిగిన పార్టీ జవహర్ నగర్ కాప్రా మండల సమితి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహం వద్ద సమావేశాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పైళ్ళ పద్మ మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్నటువంటి సందర్భంలో దేశవ్యాప్తంగా శతజయంతి ఉత్సవాలను నిర్వహించుకొని ఖమ్మంలో లక్షలాదిమంది ప్రజలతో బహిరంగ సభ నిర్వహిస్తున్నామని ఆ బహిరంగ సభను జయప్రదం చేయడానికి రాష్ట్రవ్యాప్తంగా జాతాలను నిర్వహిస్తూ కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించినటువంటి పోరాటాలను ప్రజలకు తెలియజేస్తూ కమ్యూనిస్టు పార్టీ నిర్వహించే నటువంటి సాయుధ పోరాటం దానివల్ల 3000 గ్రామాలను విముక్తి చేయడం 10 లక్షల ఎకరాలను పేద ప్రజలకు పంచిన చరిత్ర కేవలం కమ్యూనిస్టు పార్టీకి మాత్రమే ఉన్నదని అన్నారు. అదేవిధంగా మేడ్చల్‌జిల్లాలో భూ పోరాటాలు నిర్వహించి వందలాది ఎకరాలను లక్షలాది మంది ప్రజలకు 60 గజాల భూములను ఇచ్చి ఇల్లు స్థలాలు లేని వారికి ఇళ్ల స్థలాలను ఇప్పించినటువంటి చరిత్ర కేవలం కమ్యూనిస్టు పార్టీకే దక్కిందన్నారు. ప్రజల కోసం నిత్యం పోరాటం చేస్తూ ప్రజా సమస్యలను తీర్చడంలో పెద్దన్న పాత్ర వహిస్తూ నేటికీ 100 సంవత్సరాలుగా ప్రజల గుండెల్లో జీవిస్తూ ప్రజల సమస్యలను తీర్చేది కమ్యూనిస్టుపార్టీ మాత్రమేనన్నారు. ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వివిఎస్ బోస్ సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ రాష్ట్ర రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జి దామోదర్ రెడ్డి సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోటపల్లి శంకర్,ఎస్ శంకర్రావు డిజి సాయిలుగౌడ్ నిమ్మల నర్సింలు, స్వామి, హరినాథ్ రావు,ధర్మేంద్ర సత్యప్రసాద్, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు సిహెచ్ దశరథ, సిపిఐ కాప్రా మండల కార్యదర్శి దర్శనం యాదగిరి,జిల్లా కౌన్సిల్ సభ్యులు తప్పెట్ల రాములు గౌడ్, జిల్లా గిరిజన సమైక్య అధ్యక్ష కార్యదర్శులు శ్యామల లత,వి.స్వరూప నాయక్ కాప్రామండల సహాయ కార్యదర్శులు లక్ష్మీనారాయణ, మోతె రాజేశ్వరి, గిరి ప్రసాద్ నగర్ శాఖ కార్యదర్శి కొండ సత్యం,సాగర్ ఏఐటియుసి మండల నాయకులు ఏ ఎల్లయ్య, కీసర మండల సహాయ కార్యదర్శి వి.రవి నాయక్, గిరిప్రసాద్ నగర్ సహాయ కార్యదర్శి కోదాసు జయమ్మ,కవిత,కార్యదర్శి నాని,సిపిఐ నాయకులు అశోక్ చారి,బి.రాజు నాయక్,డి మల్లిక,పి నరసింహ,శ్యామ్ దాస్ పాల్గొన్నారు.

తెలంగాణ సాధనలో విద్యార్థుల పాత్ర : డాక్టర్ పిడమర్తి రవి

విశాలాంధ్ర, బషీర్ బాగ్: తెలంగాణ రాష్ట్ర సాధనలో కవులు కళాకారుల కంటే అతి పెద్ద పాత్ర పోషించిందనీ, విద్యార్థి ఉద్యమ నాయకులు అని అప్పటి విద్యార్థి జేఏసీ చైర్మన్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల సమావేశం గురువారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో జరిగింది. ఈ సందర్భంగా పిడమర్తి రవి మాట్లాడుతూ తెలంగాణ సాధనలో కవులు కళాకారులు కంటే విద్యార్థి పాత్ర ఎక్కువగా ఉందని విద్యార్థులు లేకపోతే ఆనాడు తెలంగాణ రాష్ట్ర ఉద్యమం లేదు ఇప్పుడు తెలంగాణ లేదు అని అన్నారు. ఎంతోమంది విద్యార్థి నాయకులు వీరోచిత పోరాటం ఫలితంగానే ఆనాడు రాష్ట్రం సిద్ధించిందని రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వాలు సముచిత స్థానం కల్పించలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, ఉద్యమకారులకు ఇంటికో ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న నాయకులంతా చాలామంది వృద్యాపం, వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నందుకు వారికి ఉద్యమకారుల కోటాలో పింఛన్ ఇవ్వాలన్నారు. విద్యార్థి ఉద్యమ నాయకుల పైన మిగిలి ఉన్న అన్ని పోలీస్ కేసులను ఎత్తివేయాలనీ కోరుతూ డిసెంబర్ 9న దీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ జేఏసీ చైర్మన్ రాజేష్, జాగో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు రాములు నేత, యాకూబ్ రెడ్డి, దామోదర్, ఫరూక్, జేకె, శ్రీనివాస్ రెడ్డి, ఓయూ నాయకులు రహీం, హనుమంతరావు అస్మక శంకర్ సాంబశివ గౌడ్, రమణ, స్టాలిన్, ఉపేందర్, గుంటి ప్రభాకర్, బోరెల్లి సురేష్, గణేష్ ముదిరాజ్, అంజి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా : ఎమ్మెల్సీ

విశాలాంధ్ర రాజేంద్రనగర్ : రాజేంద్రనగర్ నియోజకవర్గం అత్తాపూర్ డివిజన్ భూపాల్ నగర్ లో తెలంగాణ జాగృతి నిర్వహిస్తున్న జనం బాట లో భాగంగా బస్తీలో పర్యటించిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత భూపాల్ నగర్‌లో 40సంవత్సరాల నుంచి నివాసం వుంటున్న ప్రభుత్వం ఇంటి పట్టాలు ఇవ్వలేదు అని ఎమ్మెల్సీ కవిత దృష్టికి తీసుకెళ్లిన బస్తీ వాసులు ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ ఇంటి పట్టాల విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి బాధ్యత జాగృతి సంస్థ భుజాన వేసుకొని ఇంటి పట్టాలు కోసం ప్రయత్నం చేస్తుందన్నారు.

సాయి హన్సికకు గోల్డ్ మెడల్..

విశాలాంధ్ర, బషీర్ బాగ్ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెంలో నిర్వహించిన పీప్ సైట్ రైఫిల్ షూటింగ్ అండర్ -19 విభాగంలో వసుందర జూనియర్ బాలికల కళాశాల, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాకు చెందిన చక్రత్ సాయి హన్సిక గోల్డ్ మెడల్ ను సాధించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గత రెండు రోజులుగా స్థానిక ఎస్ఆర్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్‌లో జరిగిన 69వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రైఫిల్ షూటింగ్ అండర్ 14, 17, 19 విభాగాలలో జరిగిన పోటీలలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు ఐదు పతకాలు లభించాయి. పతకాలు సాధించిన క్రీడాకారులను జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అభినందించారు. ఈ రైఫిల్ షూటింగ్ రేంజ్ ఏర్పాటు చేసిన సంవత్సరంలోపే ఈ పతకాలు సాధించడం పట్ల కోచ్ మహమ్మద్ అబ్దుల్ నబీ, క్రీడాకారులను కలెక్టర్ అభినందించారు. జనవరి 5, 2026 న మధ్యప్రదేశ్ లోని భోపాల్‌లో జరగబోయే జాతీయ స్థాయిలో పోటీలలో మంచిగా ప్రతిభ కనపరిచి జిల్లాకు, తెలంగాణ రాష్ట్రంకు పేరు ప్రకృతలు తీసుకొని రావాలని క్రీడాకారులను కోరారు. పతకాలు గెలుపొందిన వారి వివరాలు: శ్రీరామ్ అండర్ 19 పిస్తోల్ లో సిల్వర్ మెడల్, పీప్ సైట్ రైఫిల్ షూటింగ్ అండర్ 19 విభాగంలో చక్రత్ సాయి హన్సిక గోల్డ్ మెడల్, బి సహస్ర అండర్ 19 పీప్ సైట్ రైఫిల్ షూటింగ్ లో సిల్వర్ మెడల్, ఏ పూజిత అండర్ 17 ఓపెన్ సైట్ రైఫిల్ లో సిల్వర్ మెడల్, పి రోజా గ్రేస్ అండర్ 19 ఓపెన్ సైట్ రైఫిల్ లో సిల్వర్ మెడల్, పి నాగ వెంకట మేధా అండర్ 19 ఓపెన్ సైడ్ రైఫిల్ విభాగంలో సిల్వర్ మెడలను సాధించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి ఎం. పరంధామ రెడ్డి, జిల్లా విద్యశాఖ అధికారిని బి.నాగలక్ష్మి , ఎస్టిఎఫ్ సెక్రటరీ వి. నరేష్, కోచ్ అబ్దుల్ నబీ, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

వందేమాతరం సామూహిక గీతాలాపన ఏర్పాట్లు పరిశీలన

విశాలాంధ్ర, పటాన్ చెరువు : డిసెంబర్ 1న పటాన్ చెరువు పట్టణంలో నిర్వహించ తలపెట్టిన వందేమాతరం 150 వసంతాల సామూహిక గీతాలాపన కార్యక్రమ ఏర్పాట్లను పటాన్ చెరువు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి పరిశీలించారు. గురువారం సాయంత్రం వివిధ శాఖల అధికారులతో కలిసి పటాన్ చెరువుపట్టణంలోని నొవపాన్ పరిశ్రమ సమీపంలో గల ఖాళీ స్థలంలో కార్యక్రమం నిర్వహించబోతున్నట్లు తెలిపారు. 30 వేల మంది విద్యార్థులు ఒకే సమయాన సామూహిక గీతాలాపన చేసేలా కార్యక్రమాన్ని తీర్చిదిద్దినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొనే ప్రతి ఒక్కరికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తిస్థాయి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పటాన్చెరు డిఎస్పి ప్రభాకర్, సిఐ వినాయక్ రెడ్డి, జాతీయ రహదారుల సంస్థ డి ఈ రామకృష్ణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, మండల విద్యా శాఖ అధికారి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్స్ కొత్త, రెన్యూవల్ షెడ్యూల్

విశాలాంధ్ర, హైదరాబాద్ : 2026 జనవరి 1 నుండి డిసెంబర్ 31 వరకు గల కాలానికి కొత్త ట్రేడ్ లైసెన్స్‌లు మరియు ఇప్పటికే ఉన్న ట్రేడ్ లైసెన్స్‌ల రెన్యువల్ కోసం జిహెచ్ఎంసి షెడ్యూల్ ను విడుదల చేసింది. సాధారణంగా, ట్రేడ్ లైసెన్స్ గడువు ముగియడానికి 30 రోజుల ముందు అప్లై చేయాలి. కానీ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ కారణంగా, అప్లికేషన్ చివరి తేదీని 20 రోజులపాటు పొడిగించి డిసెంబర్ 20, 2025 వరకు జరిమానా లేకుండా అవకాశం జీహెచ్ఎంసీ కల్పించింది.

సవరించిన షెడ్యూల్ : డిసెంబర్ 20 లోపు జరిమానా లేదు. ఫిబ్రవరి 2, 2026 వరకు 25% జరిమానా (60 రోజుల ఆలస్యం వరకు), ఫిబ్రవరి 20 నుండి 50% జరిమానా (60 రోజులకంటే ఎక్కువ ఆలస్యం), టెలంగానా గ్రీన్ ఫండ్ కింద: 5,000 వరకు లైసెన్స్ ఫీజుపై 10% (తదుపరి 50 కు రౌండ్), 5,000 పైబడిన లైసెన్స్ ఫీజులకు 1,000 ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారం నిర్వహించిన వారికి 100% జరిమానా ప్రతి నెల 10% అదనపు ఫైన్ విధించబడుతుంది. అందువల్ల, వ్యాపారులు, దుకాణాలు, సంస్థలు జిహెచ్ఎంసి వెబ్‌సైట్, మీ సేవ లేదా జిహెచ్ఎంసి సర్కిల్ సిటిజన్ సర్వీస్ సెంటర్లు ద్వారా నిర్ణయించిన తేదీలలోపు అప్లై చేసి జరిమానాలను నివారించాలనీ జిహెచ్ఎంసి విజ్ఞప్తి చేసింది.

ఎఫ్డీడీఐల 28 నుంచి 30 వరకు పాదరక్షల వారసత్వంపై జాతీయ సదస్సు, ప్రదర్శన

హైదరాబాద్: పాదరక్షల వారసత్వంపై గచ్చిబౌలిలోని ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్లో(ఎఫ్డీడీఐ)లో నవంబర్ 28-30 తేదీల్లో జాతీయ సదస్సు, ప్రదర్శనలను నిర్వహిస్తున్నట్లు, ఫ్లీచ్ ఇండియా ఫౌండేషన్, మరియు ఎఫ్డీడీఐ ఒక ప్రకటనలో తెలిపారు. 28వ ఉ.11:00 గం.లకు తెలంగాణ గవర్నర్, శ్రీ విష్ణుదేవ్ వర్మ ప్రారంభించే ఈ జాతీయ సదస్సులో భారతదేశ పాదరక్షల ఘన వారసత్వం, కళా సంప్రదాయలు, రూపకల్పన పరిణామం పై నిపుణులతో ప్రసంగాలు, పాదరక్షల చారిత్రక నేపథ్యంపై ప్రత్యేక ప్రదర్శన ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. విద్యార్థులు, పరిశోధకులు, డిజైనర్లు, కళాకారులూ మరియు వారసత్వ ప్రేమికులు అందరూ ఈ సదస్సులో పాల్గొని జయప్రదం చేయాలని వారుకోరారు. ఎఫ్డీడీఐలో గురువారం నాడు జరిగిన సన్నాహక మరియు కాన్ఫరెన్స్ సమావేశంలో, ఎఫ్డీడీఐ, హైదరాబాద్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, డా. నరసింహుగారి తేజ్ లోహిత్ రెడ్డి, ఫ్లీచ్ ఇండియా ఫౌండేషన్, చైర్ పర్సన్ డా. తేజస్విని యార్లగడ్డ, ఫ్లీచ్ ఇండియా ఫౌండేషన్, సీఈఓ, డా.ఈమని శివనాగిరెడ్డి, ఎఫ్డీడీఐ అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారని నిర్వాహకులు చెప్పారు.

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత

విశాలాంధ్ర,షాద్ నగర్, రూరల్: రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం ఫరూక్ నగర్ మండలం ఎల్లంపల్లి గ్రామ ఘటనను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని, బాధిత కుటుంబానికి ఐదు ఎకరాల భూమిని ఇస్తామని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య గురువారం రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గం ఫరూక్‌నగర్ మండలం ఎల్లంపల్లి గ్రామాన్ని రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో పాటు జిల్లా అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డి శంషాబాద్ అడిషనల్ డీసీపీ పూర్ణచందర్, షాద్‌నగర్ ఆర్డీవో సరిత, ఏసిపి లక్ష్మీనారాయణ, సిఐ విజయ్‌కుమార్ తదితర బృందం సభ్యులు రాజశేఖర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య రాజశేఖర్ భార్య ఎర్రవాణి, తండ్రి మల్లేష్‌కు రూ 4.12 లక్షల చెక్కును రాష్ట్ర ప్రభుత్వం తరపున బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ప్రేమించిన పాపానికి అతని అన్నను దారుణంగా హత్య చేయడం ఇది ప్రపంచంలో ఎవరు కనివిని ఎరుగలేదని ఇంతటి అవమానకరమైన ఘటన మరొకటి లేదన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... అత్యంత ఘోరంగా హత్య చేసి దహనం చేయడం వల్ల ఈ సంఘటన తెలిసి ఎంతో హృదయ విదారకంగా తన గుండెలు బరువెక్కాయని అన్నారు. సమాజంలో మానవతావాదులు మేధావులు విజ్ఞులు ప్రజా సంఘాలు మీడియా ప్రతినిధులు ప్రతి ఒక్కరు ఈ ఘటనలను ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామానికి వచ్చి రాజశేఖర్ కుటుంబ పరిస్థితిని చూస్తే తనకు ఎంతో బాధ కలుగుతుందని ఇంత దౌర్భాగ్య పరిస్థితిలో ఈ కుటుంబం ఉండడం చూస్తే దళితులు ఎంత దిగజారిన బతుకులు బతుకుతున్నారు తనకు అర్థమవుతుందన్నారు. రాజశేఖర్ కుటుంబానికి న్యాయం జరిగే విధంగా హైదరాబాద్‌లో అవసరమైతే 50 లక్షల విలువైన డబుల్ బెడ్ రూమ్ ఇల్లును అందజేస్తామని, అదేవిధంగా ఐదు ఎకరాల భూమిని అందజేస్తామని, ఆర్థికంగా ఉద్యోగపరంగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. తెలంగాణలో పరువు హత్యలు అలాంటి సంఘటనలు కొన్ని జరుగుతున్నాయని ఇది బాధాకరమని స్వతంత్రం వచ్చి 79 ఏళ్లు గడుస్తున్న ఇంకా ఇలాంటి జాడ్యం కనిపించడం బాధాకరమన్నారు. ఎల్లంపల్లి గ్రామ దళితుడు ఎర్ర రాజశేఖర్‌ను అత్యంత ఘోరంగా హత్య చేసిన హంతకులకు భవిష్యత్తులో జీవిత ఖైదు ఎట్టి పరిస్థితుల్లో తప్పదని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య హెచ్చరించారు. గ్రామంలో ఇంత పేదరికం అనుభవిస్తున్న రాజశేఖర్ కుటుంబానికి అధికారులు అండగా నిలబడాలని జిల్లా కలెక్టర్ అదేవిధంగా పోలీస్ శాఖలను ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆదేశించారు. రాజశేఖర్‌ను హత్య చేసిన నిందితులను ప్రభుత్వం వదిలిపెట్టబోదని ముఖ్య మంత్రితో మాట్లాడి వారికి యవజీవ కరాగర శిక్ష పడేవిధంగా పూర్తిస్థాయిలో ఎస్సీ ఎస్టీ కమిషన్ చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రభుత్వం తరఫున ప్రత్యేకంగా స్పందించినందుకు కమిషన్ చైర్మన్ వెంకటయ్య కృతజ్ఞతలు తెలిపారు. ఇదిలా ఉండగా ఎమ్మెల్యే శంకర్ గురువారం గ్రామాన్ని సందర్శించి అధికార యంత్రంగానికి తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు జిల్లా శంకర్, రాంబాబు నాయక్, అడిషనల్ కలెక్టర్ చంద్ర రెడ్డి, అడిషనల్ డీసీపీ పూర్ణ చందర్, ఎస్సీ డిడి రామ రావు, ఏసీపీ లక్ష్మి నారాయణ, ఆర్డీవో సరిత, ఎంఆర్వో నాగయ్య, ఎస్సి డిడి రామరావు, మాజీ ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యుడు రాంబల్ నాయక్, సీఐ విజయ్ కుమార్ తదితరులు, పాల్గొన్నారు.

నాలల విస్తరణ పనులపై సమీక్ష

విశాలాంధ్ర శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలో జరుగుతున్న హెచ్ సీఐటీఐ ప్రాజెక్ట్ పనులు, ఎస్ ఎన్ డీ పి విభాగంలో జరుగుతున్న నాలల విస్తరణ పనులపై మియాపూర్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో డీసీ ప్రశాంతి, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, హెచ్ సీఐటీఐ ప్రాజెక్ట్ విభాగం అధికారులు, ఎస్ ఎన్ డీ పి విభాగం అధికారులతో కలిసి పీఏసీ చైర్మన్ ఆరెకపూడిగాంధీ సమీక్షా సమావేశం జరిపారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధి కోసం ఇటీవల గౌరవ సీఎం రేవంత్ రెడ్డి రూ.1606 కోట్ల నిధులు కేటాయించారని , ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజల తరుపున, నా తరుపున ప్రత్యేక కృత్తతలు తెలియచేస్తున్నన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం అభివృద్ధికి రూ. 1606 కోట్ల నిధులు మంజూరు చేయడం చాలా సంతోషకర మైన విషయం అని, హర్షం వ్యక్తం చేయాడం జరిగినది. శేరిలింగంపల్లి నియోజవర్గం ను అన్ని రంగాలలో అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే అగ్రగామి నియోజవర్గంగా తీర్చిదిద్దుతామని తెలియచేసారు. ప్రాజెక్ట్ విభాగం అధికారులు పనులు త్వరితగతిన చేపట్టాలని ,పనులలో వేగం పెంచి పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాలని, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడలని, ట్రాఫిక్ రహిత సమాజం కోసం కృషి చేయాలని, ఫ్లై ఓవర్లు,అండర్ పాస్ లు ,రోడ్డు విస్తరణ పనులు వెంటనే చేపట్టాలని అధికారులకు తెలియచేశారు. నాలల విస్తరణ పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని,నాణ్యత విషయంలో ఎక్కడ రాజీ పడకూడదని, పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, నాల విస్తరణ పనులు పై అధికారులకు పలు సలహాలు ,సూచనలు ఇవ్వడం జరిందన్నారు. ప్రతి వర్షానికి వరద నీరు కాలనీలు ముంచెత్తడం జరుగుతుందన్నారు. సమస్య శాశ్వత పరిష్కారం దిశగా పనులు చేపట్టడం జరుగుతుంది అని, భవిష్యత్తు లో వరద సమస్య మళ్ళీ పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకొని నాల విస్తరణ పనులు చేపడుతున్నమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రఘునాథ్ రెడ్డి, ప్రాజెక్ట్ విభాగం అధికారులు ఇఇ నామ్యా, డిఇ హరీష్ బాబు, శ్రీనాథ్ రెడ్డి, ధీరజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా భద్రతే.. మా లక్ష్యం.

విశాలాంధ్ర - మొయినాబాద్ : ప్రజా భద్రతే మా లక్ష్యమని చేవెళ్ల ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్ వి. సతీష్ అన్నారు. మొయినాబాద్ మండలంలో గురువారం వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్,పొల్యూషన్ పత్రాలను తప్పని సరిగా కల్గివుండాలన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించి వాహనం నడపాలన్నారు. అదేవిధంగా కారు వాహనదారులు సీట్ బెల్ట్ ధరించాలన్నారు. లేని పక్షంలో చట్టరీత్య చర్యలు, జరిమానాలు విధించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది తదితరులున్నారు.

వృద్ధులకు అన్నదానం

విశాలాంధ్ర-జవహర్ నగర్ : మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చెన్నాపురం చౌరస్తాలో విజన్ ఇన్ ఫౌండేషన్ ఓల్డ్ ఏజ్ హోమ్ అనాధాశ్రమంలో గురువారం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. మాజీ మంత్రి సీనియర్ నటులు బాబు మోహన్ నికార్తీకమాస అమావాస్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆశ్రమానికి ప్రత్యేక ఆహ్వానాన్ని పలికారు. విజన్ ఇన్ ఫౌండేషన్ ఓల్డ్ ఏజ్ హోం నిర్వాహక అధ్యక్షులు నాగరాజు వారి కోరిక మేరకు నటులు బాబు మోహన్ ఆశ్రమాన్ని సందర్శించి తన కుమారుడు దివంగత పవన్‌బాబు మోహన్ పేరున విజన్ ఇన్ ఫౌండేషన్ ఓల్డ్ ఏజ్ హోం అనాధాశ్రమంలో ప్రత్యేక అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తన కుమారుని పేరు మీద వృద్ధులు అనాధలకు ఎంతోమంది పేదవారికి తన సంపాదనలో కొంత భాగం సేవా కార్యక్రమాలకు ఉపయోగిస్తున్నాని తెలిపారు. అతిత్వరలో అన్ని వసతులతో కూడినటువంటి ఓల్డ్ ఏజ్ హోమ్ తన కుమారుని పేరు మీద త్వరలో ఏర్పాటు చేసి మరిన్ని సేవలు అందిస్తానని ఆయన అన్నారు. ఇలాంటి వృద్ధులను అనాధలను చేరజేసి వారిని అక్కున చేర్చుకొని సేవ చేస్తున్నటువంటి విజన్ ఫౌండేషన్ ఫౌండర్ అండ్ చైర్మన్ నాగరాజును ఆయన అభినందించారు. విజన్ ఫౌండేషన్ ఫౌండర్ అండ్ చైర్మన్ నాగరాజు, కార్యదర్శి వైకుంఠ రావు, సహాయ కార్యదర్శి, శ్రీపతి పవన్ బాబు మోహన్ ట్రస్టు సభ్యులు లతా రెడ్డి, ఇంచార్జ్ భాను రెడ్డి, విజయవర్ధన్ రెడ్డి, ట్రస్ట్ నిర్వాహకులు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధికి ఆర్జాస్ స్టీల్ సేవలు : సీఈఓ

విశాలాంధ్ర, బషీర్ బాగ్: సామాజిక సేవలో భాగంగా ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం తాడిపత్రిలో ఆరోగ్య సంరక్షణ కేంద్ర నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు సంస్థ సీఈఓ పసుపులేటి ఆనంద్ తెలిపారు. బషీర్ బాగ్ లో ఆయన మాట్లాడుతూ దీనిలో బాగా ఇటీవలే తాడిపత్రి మున్సిపాలిటీ లొ చేపట్టనున్న ఆరోగ్య కేంద్రాన్ని మున్సిపాలిటీ చైర్మన్ జేసి ప్రభాకర్ రెడ్డి శంకుస్థాపన చేశారని తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందిస్తామన్నారు. ఈ పబ్లిక్ హెల్త్ సెంటర్ ద్వారా (పి హెచ్ సి) అవుట్ పేషంట్ (ఓపి) సేవలు, డయాగ్నస్టిక్స్,మైనర్ ఓటీ, ప్రసూతి విభాగం,ఫార్మసీ, ల్యాబ్,శానిటేషన్ బ్లాక్‌లు, సేఫ్ వాటర్, సోలార్ లైటింగ్ వంటి సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఈ ప్రాజెక్ట్ అర్జాస్ స్టీల్ సమాజ ఆరోగ్యాభివృద్ధికి నిబద్ధతకు నిదర్శనం అన్నారు.

చేప పిల్లల పంపిణీలో ప్రోటోకాల్ వివాదం

విశాలాంధ్ర, దమ్మపేట : మండల కేంద్రంలోని మాల్కారం రోడ్డు వద్ద శివాలయం ఎదురుగా ఉన్న పేరంటాల చెరువు వద్ద గురువారం చేప పిల్లల పంపిణీ లొ ప్రోటో కాల్ వివాదం చోటుచేసుకుంది. రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకొని జిల్లా వ్యాప్తంగా చేప పిల్లల పంపిణీ చేపట్టిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలొ అధికారులు ప్రోటోకాల్ పాటించక పోవడంతో స్థానిక నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణకు అధికారిక ఆహ్వానం ఇవ్వకపోవడంపై కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. గొడవ అనంతరం ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో చేప పిల్లలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మత్స్యకారులు ప్రభుత్వంపై కృతజ్ఞతలు తెలుపుతూ, తమ అభివృద్ధికి చేస్తున్న కృషికి కృతజ్ఞతలు తెలిపారు. దమ్మపేట మండలానికి చేప పిల్లలు మంజూరు కావడానికి కృషి చేసిన స్థానిక నాయకులకు అభినందనలు తెలిపారు.

రేపు వైరా రానున్న డిప్యూటీ సీఎం

విశాలాంధ్ర వైరా : రాష్ట్ర మినిస్టర్ మల్లు బట్టి విక్రమార్క శనివారం వైరా పట్టణానికి రానున్నారు. వైరాలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భవన సముదాయాలకు ఆయన శంకుస్థాపన చేయనున్నారు. భట్టి విక్రమార్క సొంత పట్టణమైన వైరాలో అంతర్జాతీయ విద్యా ప్రమాణాలు కలిగిన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేసి వేగంగా పనులు పూర్తి చేయించేందుకు కృషి చేస్తున్నారు. అదేవిధంగా 33/11 విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఆయన భూమి పూజ చేస్తారు. అనంతరం మధ్యాహ్నం ఒకటి నుండి రెండు గంటల వరకు అధికార అనధికారులతో మాట్లాడుతారు. అనంతరం ఆయన మధిరకు బయలుదేరి వెళతారు.

బాల్య వివాహాలు ప్రోత్సహిస్తే కఠిన చర్యలు

విశాలాంధ్ర - మణుగూరు : బాల్య వివాహాల నిర్మూలనే మనందరి బాధ్యతని ఇలాంటి వివాహాలను ప్రోత్సహించే వారిపై చట్టపరంగ కఠిన చర్యలు తప్పవని ఎయిడ్ సంస్థ ప్రతినిధి నాగుల జ్యోతి స్పష్టం చేసారు. జిల్లాను బాల్యవివాహ రహిత జిల్లాగా మార్చే లక్ష్యంతో యాక్షన్‌ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ (ఎయిడ్) సంస్థ ఆధ్వర్యంలో విస్తృతమైన అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. గురువారం మణుగూరులోని శ్రీ చైతన్య, అరుణోదయ హైస్కూళ్లలో బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పాఠశాలల ప్రిన్సిపాళ్లు డాక్టర్ కె. జనార్ధన్, మాదాసు అరవింద్, నాగుల జ్యోతి మాట్లాడారు. బాల్యవివాహాలు లేని తెలంగాణ నిర్మాణంలొ మన జిల్లా ముందంజలో నిలవాలని పిలుపునిచ్చారు. ఆడపిల్లల సర్వతోముఖాభివృద్ధికి బాల్యవివాహాలు పెద్ద అడ్డంకి అవుతున్నాయన్నారు. పిల్లల భద్రతకు సంబంధించిన ఏ సమస్య ఎదురైనా 24 గంటలు పనిచేసే చైల్డ్ లైన్ 1098 కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ ప్రచారోద్యమంలో అన్నిసాంఘాలు కీలకపాత్ర పోషించాలని సూచించారు. కార్యక్రమంలో జి. భాస్కర్ రెడ్డి, విద్యా సాగర్, సుజిత్, రామన్ శాంతి, ఉమ, మౌనిక పాల్గొన్నారు.

విద్యార్థులు చదువులపై దృష్టిపెట్టాలి : డిఎస్పీ

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : విద్యార్థులు ఎవరైనా సరే అధికంగా ఫోన్లు చూడకుండా చూడకుండా తమ పుస్తకాలపై ధ్యాస పెట్టి చదవాలని అప్పుడే భవిష్యత్తులో ఎదిగే అవకాశం ఉంటుందని కొత్తగూడెం డిఎస్పి అబ్దుల్ రహమాన్ అన్నారు. తమ పిల్లలు ఉన్నత స్థాయిలో ఎదిగి స్థిరపడితే ఏ తల్లిదండ్రులైన చాలా సంతోషిస్తారన్నారు. వర్తమాన సమాజంలో స్మార్ట్ ఫోన్లు ఎంత ప్రయోజనమో అంతే హానికరంగా మారాయన్నారు. గురువారం ఆయన జిల్లా కేంద్ర గ్రంథాలయంలొ 58 జాతీయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలొ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రంథాలయాలు సామాజిక వికాస, విజ్ఞాన కేంద్రాలని తెలిపారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రధానం చేసారు. తొలుత గ్రంథాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు అధ్యక్షత వహించి కార్యక్రమ ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి కార్యదర్శి నాగ సీతారాములు, కాంగ్రెస్ మహిళా అధ్యక్షులు తోట దేవి ప్రసన్న గ్రంథాలయ కార్యదర్శి కే. కరుణ కుమారి పాల్గొన్నారు. ఆఫీస్ ఇంచార్జ్ ఎం నవీన్ కుమార్ గ్రంథపాలకురాలు మృదుల, మధుబాబు, వంశీకృష్ణ, వాణి, రుక్మిణి, గీత, కాంగ్రెస్ యువజన నాయకుడు ఈశ్వర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పారీ జిల్లా కార్యాలయ నిర్మాణానికి వేగంగా అడుగులు...

విశాలాంధ్ర బ్యూరో ఖమ్మం : ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ నూతన కార్యాలయం నిర్మాణానికి చకచక అడుగులు పడుతున్నాయి. ఖమ్మం నగరంలో నూతన బస్టాండ్ పక్కన ఎకరం స్థలాన్ని జిల్లా కాంగ్రెస్ కార్యాలయం నిర్మాణానికి కేటాయిస్తూ ఇటీవలే ప్రభుత్వం జీవో విడుదల చేసినట్లు సమాచారం. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్న పువ్వాళ దుర్గాప్రసాద్ తన హయాంలో తన చేతుల మీదుగా చారిత్రికమైన ఈ నూతన జిల్లా కాంగ్రెస్ కార్యాలయ నిర్మాణం జరగాలని కోరుకుంటున్నారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రధాన అనుచరుడైన దుర్గాప్రసాద్‌కు నామినేటెడ్ పదవి కేటాయించేందుకు పార్టీ అధిష్టానం ప్రయత్నించినప్పటికీ, జిల్లా అధ్యక్షుడిగానే తాను ఉంటూ ప్రతిష్టాత్మకమైన పార్టీ కార్యాలయ నిర్మాణం తన చేతుల మీదగా జరగాలని ఆయన కోరుకున్నట్లు ప్రచారం జరిగింది. ప్రస్తుతం ఉన్న జిల్లా కాంగ్రెస్ కార్యాలయం పార్టీ అవసరాలకు ఎంత మాత్రం సరిపోదు. జలగం వెంగళరావు ,నీలం సంజీవరెడ్డి నేతల కాలంలో జిల్లా కాంగ్రెస్ కార్యాలయం నిర్మించారు. పెరిగిన అవసరాల రీత్యా నూతన కార్యాలయం సువిశాలమైన ఎకరం స్థలంలో నిర్మించేందుకు జిల్లా కాంగ్రెస్ అభ్యర్థన మేరకు పార్టీ అధిష్టానం అంగీకరించి అందుకు అవసరమైన స్థలాన్ని కూడా కేటాయించింది. గురువారం స్థలాన్ని పరిశీలించిన వారిలో దుర్గాప్రసాద్ తో పాటు నాయకులు నాగళ్ళ దీపక్ చౌదరి, బాలగంగాధర్ తిలక్, సేవాదళ్ అధ్యక్షుడు సయ్యద్ గౌస్ తదితరులు ఉన్నారు.

మసులిపట్నం-ఉగాది-ఆర్ కే హొటల్ ప్రారంభం

విశాలాంధ్ర, జూబ్లీహిల్స్ : జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్-10లో మసులి పట్నం-ఉగాది-ఆర్ కే హొటల్‌ల నిర్వాహకులు రామకృష్ణ ఆహ్వానం మేరకు గురువారం జూబ్లీహిల్స్ శాసనసభ్యులు వల్లాల నవీన్ యాదవ్ హాజరై మసులి పట్నం-ఉగాది హొటల్‌ను ప్రారంభించారు. వ్యాపార రంగంలో దినదినాభివృద్ధి చెందాలని, ఆశాభావం వ్యక్తం చేస్తూ, నాణ్యత, సేవ, విశ్వాసం వంటి విలువలను నిలబెట్టుకుంటూ హొటల్ అభివృద్ధి పథం లో ముందుకు సాగాలని నిర్వాహకులు రామకృష్ణకి శు భాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నవీన్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, హొటల్ నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి వీధి దీపం వెలగాల్సిందే : ఎమ్మెల్యే

విశాలాంధ్ర, పటాన్ చెరువు : జిహెచ్ఎంసి పరిధిలోని పటాన్ చెరువు, రామచంద్రపురం, భారతి నగర్ డివిజన్ల పరిధిలో గల ప్రతి వీధి దీపం వెలగాల్సిందేనని.. క్షేత్రస్థాయిలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. గురువారం సాయంత్రం పటాన్చెరులోని క్యాంపు కార్యాలయంలో జిహెచ్ఎంసి విద్యుత్ విభాగం అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బల్దియా పరిధిలోని మూడు డివిజన్ల పరిధిలో విద్యుత్ స్తంభాలు, లైట్ల పనితీరుపై ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో సమీక్షిం చాలని సూచించారు. కాలనీలలో వీధి దీపాలు వెలగకపోవడం మూలంగా అసాంఘిక కార్యక్రమాలు పెరిగిపోతాయని అన్నారు. శిథిలావస్థకు చేరుకున్న విద్యుత్ స్తంభాల స్థానంలో నూతన స్తంభాలను బిగించాలని ఆదేశించారు. వీధి దీపాల అంశంలో ఇబ్బందులు ఎదురైతే తన దృష్టికి తీసుకొని రావాలని సూచించారు. ఈ సమావేశంలో విద్యుత్ విభాగం డిఈ లక్ష్మీ ప్రియ, ఏఈ లికిత, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం కక్షసాధింపు చర్యలు : రవీందర్‌యాదవ్

విశాలాంధ్ర శేరిలింగంపల్లి: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష సాధింపులకు పాల్పడుతుం దని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత, శేరిలింగంపల్లి యువ నాయకులు రవీందర్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మీద రాజకీయ కక్ష సాధింపులను చూస్తూ ఊరుకోం అని హెచ్చరించారు. స్థానిక సంస్థల ఎన్నికల వేళ రేవంత్ రెడ్డి మరో చిల్లర డ్రామాకు ప్రయత్నిస్తున్నాడని వెల్లడించారు. ఇది ప్రజలు గమనిస్తున్నారని రవీందర్ యాదవ్ స్పష్టం చేశారు. కేటీఆర్‌పై ఏసీబీ విచారణకు గవర్నర్ అనుమతి ఇవ్వడంపై స్పందించిన రవీందర్ యాదవ్... రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి రేవంత్ రెడ్డి ప్రశ్నించే గొంతులను నొక్కే ప్రయత్నం చేస్తున్నాడని ధ్వజమెత్తారు. ఫార్ములా ఈ రేస్ పూర్తి పారదర్శకతతో జరిగిందని చెప్పారు. దీనిపై కేసు పెట్టి కాంగ్రెస్ సర్కార్ రెండేళ్లుగా కోడిగుడ్డుపై ఈకలు పీకుతుందని మండిపడ్డారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజీని పెంచిన కేటీఆర్‌పై అక్రమ కేసులు బనాయించి ఇబ్బంది పెట్టడమే లక్ష్యంగా రేవంత్ రెడ్డి పెట్టుకున్నాడని, ప్రజలు అన్నీ గమనిస్తున్నారని స్పష్టం చేశారు. కేటీఆర్‌కు బీఆర్ఎస్ పార్టీ పూర్తి అండగా ఉందని, రేవంత్ రెడ్డి దుర్మార్గ వైఖరిని న్యాయపరంగా ఎదుర్కొంటామని తెలిపారు. కాంగ్రెస్ సర్కార్ తీరుపై పోరాటానికి బీఆర్ఎస్ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజల దృష్టిని మరల్చేందుకు కుట్రలు పన్నుతున్నారని, కాంగ్రెస్ చేస్తున్న దారుణలను అడ్డుకొని తీరుతామని రవీందర్ యాదవ్ వెల్లడించారు.

జల మండలి ఎండీని కలిసిన టీజీవో నాయకులు



విశాలాంధ్ర, హైదరాబాద్ : జలమండలి ఎండీ అశోక్ రెడ్డి ను గురువారం టీజీవో హైదరాబాద్ జిల్లా నాయకులు, కార్యవర్గ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా జాతీయ అవార్డును అందుకున్న సందర్భంగా ఎండీ అశోక్ రెడ్డిని కలిసి అభినందనలు తెలిపారు. ఆయన ఛాంబర్‌లో టీజీవో హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎంబీ కృష్ణా యాదవ్, సెక్రెటరీ మహమ్మద్ అబ్దుల్ ఖాదర్ లు గురువారం కలిసి జలమండలికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీజీవో హైదరాబాద్ జిల్లా శాఖ కోశాధికారి రమణ, సరస్వతి, టీజీవో జలమండలి శాఖ కార్యదర్శి చంద్ర జ్యోతి, పేరయ్య, లీగల్ మెట్రాలజీ శాఖ, మల్లికార్జున్ రెడ్డి, వర్క్స్ ఆడిట్ శాఖ ఈసీ సభ్యులు టీజీవో ఇతర నాయకులు పాల్గొన్నారు.

బస్సు జాతకు ఘన స్వాగతం



విశాలాంధ్ర, హైదరాబాద్ : సీపీఐ 100 సంవత్సరాల ఉత్సవాల సంద ర్భంగా బాసర నుండి ఖమ్మం బహిరంగ సభ వరకు బయలు దేరిన బస్సు ప్రసార జాత వివిధ జిల్లాలు తిరుగుతూ గురువారం మల్కాజిగిరి నియోజకవర్గంలోని యాప్రాల్ కు వచ్చిన సందర్భంగా ఘన స్వాగతం పలికిన మల్కాజిగిరి మండల సీపీఐ .నాయకులు జిల్లా సమితి సభ్యులు సిహెచ్ దశరథ్ మండల కార్యదర్శి యాదయ్య గౌడ్ జిల్లా సమితి సభ్యులు కాసర్ల నాగరాజు, ఏ.అశోక్, బిజ.యాదగిరి, ఎస్.కే.అజీజ్, సయ్యద్, యూసఫ్, జే.వెంకటరమణ, రొయ్యల గిరిజ, తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ ప్రచార జాతలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వి.ఎస్.బోస్ ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలి ఉల్లా ఖాద్రి, రైతు సంఘం రాష్ట్ర కోశాధికారి జీడి నరేంద్ర ప్రసాద్, ప్రజా నాట్యమండలి రాష్ట్ర సహాయ కార్యదర్శి కే.ఉప్పలయ్య కళాబృందం తో పాటు సిపిఐ శ్రేణులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగాల్లో ట్రాన్స్‌జెండర్లకు రిజర్వేషన్‌పై

హైకోర్టు తీర్పు స్వాగతిస్తున్నాం: నారాయణ

న్యూఢిల్లీ: ప్రభుత్వ ఉద్యోగాల్లో ట్రాన్స్‌జెండర్లకు తప్పనిసరిగా రిజర్వేషన్లను ఉండాలంటూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సీపీఐ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ స్వాగతించారు. సమానత్వం, న్యాయం, రాజ్యాంగబద్ధ సామాజిక విలువలకు, సిద్ధాంతాలకు అనుగుణంగా తీర్పు వెలువడిందని అన్నారు. ఈమేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ట్రాన్స్‌జెండర్ల హక్కులను గుర్తించాలని, మానవహక్కుల విస్తృత కార్యాచరణ కింద వారికి రక్షణ కల్పించాలన్నారు. అలాగే విద్య, వైద్యం, ఉద్యోగాలతో సమాన అవకాశాలు ఉండేలా చూడాలన్నారు. ఆ వర్గానికి సామాజిక భద్రత కల్పించాలని నారాయణ నొక్కిచెప్పారు. ట్రాన్స్‌జెండర్ల సమస్యలను వ్యక్తిగతమైనవిగా కాకుండా సమ్మిళిత సామాజిక బాధ్యతగా భావించాలన్నారు. సామాజిక న్యాయానికి కట్టుబడి వ్యవహరించాలని సూచించారు. సీపీఐ ఇదే పద్ధతిని పాటిస్తున్నట్లు తెలిపారు. ట్రాన్స్‌జెండర్ల హక్కులు, సంరోణ కోసం చండీగఢ్‌లో జరిగిన సీపీఐ జాతీయ మహాసభలో తీర్మానాన్ని ఆమోదించడాన్ని నారాయణ గుర్తుచేశారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో ట్రాన్స్‌జెండర్లకు రిజర్వేషన్లను తప్పనిసరి చేస్తూ హైకోర్టు తీర్పు ఇవ్వడం హర్షణీయని ఆయన పేర్కొన్నారు.

అనిల్ అంబానీ కేసులో రూ.1400 కోట్ల ఆస్తులు ఈడీ అటాచ్

ముంబై: రిలయన్స్ గ్రూపు చైర్మన్ అనిల్ అంబానీకి చెందిన మనీల్యాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తాజాగా రూ.1400 కోట్ల ఆస్తులను అటాచ్ చేసింది. గతంలోనూ ఈ కేసుతో లింకున్న సుమారు రూ.7,500 కోట్ల ఆస్తులను అటాచ్ చేసింది. దేశంలో వివిధ ప్రాంతాల్లో ఉన్న ఆస్తులను మనీల్యాండరింగ్ కేసుతో జత కలిపారు. దీనిలో భాగంగానే కొత్తగా రూ.1400 కోట్ల ఆస్తులను ఆ కేసుతో కలిపారు. మనీ ల్యాండరింగ్ చట్టం ప్రకారమే ఈ ఆదేశాలు ఇచ్చారు. అయితే ఈడీ తీసుకున్న తాజా నిర్ణయంపై ఇప్పటి వరకు రిలయన్స్ గ్రూపు స్పందించలేదు.

మరింత బలంగా ముందుకెళదాం

సీపీఐ తమిళనాడు సమితి సమావేశంలో డి.రాజా పిలుపు

చెన్నై: ఐక్యంగా ముందుకెళదామని, నిరంకుశ పాలనను ప్రతిఘటిద్దామని, ప్రజలు, కార్మికులు, కర్షకుల వ్యతిరేక విధానాలను తిప్పికొడదామని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా పిలుపునిచ్చారు. కమ్యూనిస్టుల పునరేకీకరణ ప్రస్తుత రాజకీయ అవసరమని అన్నారు. సీపీఐ తమిళనాడు రాష్ట్ర సమితి సమావేశంలో తాజా రాజకీయ పరిణామాలపై డి.రాజా నివేదిక ఇచ్చారు. సీపీఐ రాష్ట్ర నాయకత్వానికి దిశా నిర్దేశం చేశారు. క్షేత్రస్థాయిలో సీపీఐని బలోపేతం చేసేందుకు అన్ని విధాలుగా కృషి చేయాలని, మరింతగా ప్రజల్లోకి వెళ్లాలని సూచించారు. వచ్చే ఏడాది రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్న దృష్ట్యా సీపీఐ మరింతగా బలపడటం కోసం ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని డి.రాజా కోరారు. కేంద్రంలో ఎన్డీయే పాలన, ఇటీవల బీహార్ ఎన్నికల్లో మహాగట్టబంధన్ ఓటమి గురించి మాట్లాడారు. సీట్ల సర్దుబాటులో లోపాలను పరిష్కరించుకోవాలని, భాగస్వామ్య పార్టీలు మరింతగా సమన్వయం చేసుకోవాలని అన్నారు. ఐక్యంగానే బలమైన ప్రత్యర్థిని ఓడించగలమన్నారు. దేశాన్ని మత రాజ్యంగా మార్చే లక్ష్యంతో బీజేపీ-ఆర్‌ఎస్‌ఎస్ మనువాద పాలనను ప్రతిఘటించాలని డి.రాజా పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య పోరాటంలో పాత్రలేని ఆర్‌ఎస్‌ఎస్ దేశభక్తిపై మాట్లాడటం విడ్డూరంగా ఉందని అన్నారు. జాతీయ జెండాను, రాజ్యాంగాన్ని గౌరవించని ఈ వర్గం మనుస్మృతి ప్రకారం నడుచుకుంటూ దేశాన్ని కూడా అదే బాటలో నడిపించాలని కలలు కంటోందని డి.రాజా వ్యాఖ్యానించారు. కమ్యూనిస్టు పార్టీ ఇలాంటి పోకడలను సాగనివ్వదన్నారు. సీపీఐ 100 ఏళ్ల చరిత్రలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్నదని, ఎల్లప్పుడు ప్రజలు, కార్మికులు, రైతుల పక్షాన నిలిచిందని, ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు చేసిందని తెలిపారు. ప్రజాస్వామ్యం-రాజ్యాంగం పరిరక్షణ కోసం మరోమారు ఉద్యమం తప్పబోదని, ఇందుకోసం భావసారూపత్యగల పార్టీలు, లౌకిక-ప్రగతిశీలవాదులు, కమ్యూనిస్టులు ఏకం కావాలని డి.రాజా అన్నారు. సమావేశంలో సీపీఐ జాతీయ కార్యదర్శులు అనీరాజా, రామకృష్ణ పాండా తదితరులు పాల్గొన్నారు.

స్టాలిన్‌తో భేటీ: తమిళనాడు పర్యటన క్రమంలో 'అన్నా అరివలయం' డీఎంకే కార్యాలయంలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌తో డి.రాజా భేటీ అయ్యారు. తాజా రాజకీయ పరిస్థితులు, వచ్చే ఏడాది జరగబోయే రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో భాగస్వామ్యం తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా డి.రాజాకు స్టాలిన్ శాలువా కప్పి చిరు సత్కారం చేశారు. సమావేశంలో డీఎంకే నేతలు కనిమొళి, ఆర్‌ఎస్ భారతి తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణ కుమార్తె దంపతులకు సీఎం ఆశీర్వాదం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ, సుజాత దంపతుల ఏకైక కుమార్తె సాయిలీల, సాయికృష్ణను సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆశీర్వదించారు. వారి వివాహ రిసెప్షన్ ఈనెల 16వ తేదీన విజయవాడలోని ఎస్ఎస్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగింది. ఆరోజు ముఖ్యమంత్రి హైదరాబాదులో ఉండటంతో హాజరు కాలేకపోయారు. పుట్టపర్తి, కడప పర్యటన పూర్తిచేసుకున్న ముఖ్యమంత్రి బుధవారం రాత్రి పదిగంటల సమయంలో తాడేపల్లిలోని అమరావతి ఐకాన్ టవర్స్‌లో నివసిస్తున్న రామకృష్ణ నివాసానికి విచ్చేశారు. నూతన దంపతులను సీఎం ఆశీర్వదించారు. దాదాపు 20 నిమిషాల పాటు రామకృష్ణ కుటుంబ సభ్యులతో చంద్రబాబు గడిపారు. ఆయన వెంట రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మనోహర్ నాయుడు ఉన్నారు.

ఎస్ఐఆర్ ప్రక్రియ నిలిపివేయండి

ప్రధాన ఎన్నికల అధికారికి వామపక్ష, రాజకీయ పార్టీల వినతి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రంలో ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను వ్యతిరేకిస్తూ వామపక్ష, రాజకీయ పార్టీల ప్రతినిధుల బృందం గురువారం సచివాలయంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) వివేక్ యాదవ్‌కు వినతిపత్రం అందజేసింది. శాసనసభ ఎన్నికలకు 2029 వరకు సమయం ఉన్న నేపథ్యంలో ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయాలని, అఖిలపక్ష సమావేశం వేయాలని కోరింది. స్పందించిన సీఈవో అఖిలపక్షం సమావేశం జరుపుతామని హామీ ఇచ్చారు. ప్రతినిధి బృందంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్, కాంగ్రెస్ నుంచి షేక్ మస్తాన్‌వలీ, వైసీపీ నుంచి మల్లాది విష్ణు, వై.వెంకటేశ్వరరావు (సీపీఎం), డి.హరినాథ్ (సీపీఐ-ఎంఎల్), చిట్టిపాటి వెంకటేశ్వర్లు (సీపీఐ-ఎంఎల్ న్యూడెమోక్రసీ), ఖాదర్ బాషా (ఎంసీపీఐ-యూ), జానకీరాములు (ఆర్ఎస్‌పీ), ఎం.రామకృష్ణ (సీపీఐ-ఎంఎల్ న్యూడెమోక్రసీ), సుధీర్ (ఎస్‌యూసీఐ(సీ) తో పాటు జై భీమ్‌భారత్ పార్టీ నాయకులు పరసా సురేశ్ కుమార్, విద్యాసాగర్ (వీసీకే), ఇతర సంఘాల నేతలు ఉన్నారు. ఎలాంటి నోటిఫికేషన్ లేకుండానే ఓటర్ల జాబితా సవరణ పేరిట బూత్ స్థాయి వరకు యంత్రాంగాన్ని నిమగ్నం చేయడం అసంబద్ధమని, చట్టవిరుద్ధమని బృందం పేర్కొంది. ఎన్నికల కమిషన్ ప్రజా ప్రతినిధుల చట్టం (ఆర్‌పీఏ) ప్రకారం ఇంతవరకు ప్రకటించకపోవడంతో పాటు విషయం ఇంకా సుప్రీం విచారణలో ఉందని, అలాంటి పరిస్థితుల్లో ఏపీలో ఎస్ఐఆర్‌కు సంబంధించిన ఏర్పాట్లు జరపడం చట్టపరంగా సరైనది కాదని, వెంటనే నిలిపి వేయాలని వారు డిమాండ్ చేశారు. బీహార్‌లో తీవ్ర వివాదాలు చెలరేగిన విషయాన్ని నేతలు గుర్తుచేశారు. హర్యానా, కర్నాటకల్లో లక్షలాది మందిని నకిలీ ఓటర్లను చేర్చిన విషయాలు బయటపడ్డాయని తెలిపారు. ఈ అంశంపై సుప్రీం కోర్టులో కేసు ఇంకా కొనసాగుతుందని గుర్తుచేశారు. అయినప్పటికీ మరో తొమ్మిది రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో కమిషన్ అమలు నోటిఫికేషన్ జారీ చేయడం ప్రశ్నార్థకమని పేర్కొన్నారు. ఆంధ్ర ప్రదేశ్ ఆ జాబితాలో లేకపోయినా, రాష్ట్రంలో ఎస్ఐఆర్ ఏర్పాటు పనులు జరుగుతున్నాయని, ఇది అక్రమ చర్యని, తక్షణమే పనులు రద్దు చేయాలని సీఈవోకు నేతలు విజ్ఞప్తి చేశారు.

పేట్రేగిపోతున్న పెట్టుబడిదారులు

- కార్మిక చట్టాలకు మోదీ తూట్లు
- పోరాటాలతో ప్రభుత్వ విధానాలు ఎండగట్టాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య

విశాలాంధ్ర-విజయవాడ: దేశంలో పెట్టుబడిదారులు పేట్రేగిపోవడంతో సామాన్య ప్రజలు, కార్మిక వర్గం తీవ్ర అన్యాయానికి గురవుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య తెలిపారు. పార్టీ శతాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా విజయవాడలోని ఇండియన్ మెడికల్ హాల్‌లో గురువారం ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రనాథ్ అధ్యక్షతన సదస్సు జరిగింది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటసుబ్బయ్య వక్తలను వేదిక పైకి ఆహ్వానించగా, గౌరవ అధ్యక్షుడు రాధాకృష్ణమూర్తి పరిచయం చేశారు. ముఖ్య అతిథిగా హాజరయిన ఈశ్వరయ్య సదస్సును ప్రారంభించి ప్రసంగించారు. దేశంలో రోజురోజుకు పేట్రేగిపోతున్న పెట్టుబడిదారీ వర్గాన్ని, ఫాసిజాన్ని అంతం చేసేందుకు కార్మిక వర్గం ఐక్య పోరాటాలతో ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. వర్గ పోరాటాల ద్వారా కార్మికులను చైతన్యం చేసి సోషలిజమే అంతిమ లక్ష్యంగా పని చేయాలని స్పష్టం చేశారు. మూడోసారి అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోదీ మతోన్మాద ప్రభుత్వం కార్మికులను కార్పొరేట్ శక్తులకు బానిసలుగా మార్చి దేశ సంపదను కొల్లగొడుతున్నారని విమర్శించారు. ఆర్‌ఎస్‌ఎస్ ఏర్పడక ముందే కార్మిక వర్గం తమ హక్కుల సాధన కోసం గళమెత్తిందని, బ్రిటీషు నాటి కాలంలో ఎదిరించి ఎర్రజెండా చేతబట్టి అనేక చట్టాలకు రూపకల్పన చేసిందని తెలిపారు. ఎన్నో ఉద్యమాలు, పోరాటాలు, త్యాగాలతో సాధించుకున్న చట్టాలకు నేడు మోదీ ప్రభుత్వం తూట్లు పొడుస్తూ కార్మిక లోకానికి తీరని అన్యాయం చేస్తోందన్నారు. కమ్యూనిస్టు పార్టీ వంద సంవత్సరాల చరిత్రతో ఎన్నో పోరాటాలు నిర్వహించిందని, కార్మిక, శ్రామిక హక్కుల రక్షణకు వెన్నుదన్నుగా నిలిచిందన్నారు. భారత రాజ్యాంగంపై రాజ్యాంగంపై దాడి జరిగితే కార్మిక వర్గంపై దాడి జరిగినట్టేనని... అలాంటి దాడులను తిప్పి కొట్టాలన్నారు. దేశంలో మోదీ, అమిత్ షా విచ్చలవిడిగా ప్రజలపై మతోన్మాదం రుద్దుతూ మైనార్టీలపై దాడులు చేస్తూ మానసిక ఆనందాన్ని పొందుతున్నారని, ఈ కారణంగా ఎంతోమంది సామాన్య ప్రజలు బలవుతున్నారని మండిపడ్డారు. ఈ సమయంలో సామాన్య ప్రజల పక్షంగా నిలబడి ప్రజా పోరాటాల ద్వారా మోదీ ప్రభుత్వ విధానాలను ఎండగట్టాల్సిన అవసరం ఉందన్నారు. రాబోయే రోజుల్లో కమ్యూనిజం రాజ్యాధికారం దిశగా సాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సీపీఐ కార్మిక వర్గ చైతన్యంతో వర్గ పోరాటాలతో కలిసి నడుస్తోందని... ఆ దిశగా రాబోయే రోజుల్లో పోరాటాలకు సమాయత్తం కావాలని ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. ఈ దేశ దిశ, దశ మార్చాలంటే ఎర్రజెండా ముందుండాలన్నారు.

రావులపల్లి రవీంద్రనాథ్ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు, కార్మికుల వేతనాల పెంపునకు, కార్మిక హక్కులు, చట్టాల రక్షణకు, కార్మికుల భద్రతకు ఏఐటీయూసీ ముందుండి పోరాటం కొనసాగించాలన్నారు. దేశంలో 105 సంవత్సరాల చరిత్ర కలిగిన ఏఐటీయూసీ... స్వాతంత్ర్యం కోసం అనేకమంది ప్రాణార్పణతో ఏర్పడిన కార్మిక సంఘమని తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని పోరాటాలతో కార్మిక వర్గ చైతన్య దృక్పథంతో రాజ్యాధికార స్థాపనే లక్ష్యంగా ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. తొలుత మొదటి సెషన్‌లో ఫాసిజం-పాలక పీడిత వర్గాలలో వైరుధ్యంపై మార్కిస్ట్ విశ్లేషకులు డి.రమేష్ పట్నాయక్, హిందుత్వ-లౌకికవాదం-భారత రాజ్యాంగం అనే అంశంపై మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు ప్రసంగించారు. అనంతరం జరిగిన రెండో సెషన్‌కు వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని రామారావు అధ్యక్షత వహించారు. ఏఐటీయూసీ విజయవాడ నగర కార్యదర్శి మూలి సాంబశివరావు వందన సమర్పణతో సదస్సు ముగిసింది. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎం.రమేష్ బాబు, జె.లలితమ్మ, ఎం.బాలకాశీ, నగర నాయకులు కొట్టు రమణ, తాతయ్య, ఎన్టీఆర్, గుంటూరు జిల్లా నాయకులు హనుమంతరావు, అరుణ్, త్యాగరాజ్, పుల్లారావు, ఫిలిప్స్, డాంగే, శైలజ, శారమ్మ, వాణి అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

25 నుంచి మత్తుమందు వైద్యుల జాతీయ సదస్సు

విశాలాంధ్ర-విజయవాడ: మత్తుమందు (ఎనస్థీషియా) వైద్యుల 72వ జాతీయ సదస్సు చత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని రాయ్‌పూర్‌లో ఈ నెల 25 నుంచి 30వ తేదీ వరకు జరుగుతుందని ఇండియన్ సొసైటీ ఆఫ్ ఎనస్థీషియా లాజిస్ట్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఉప్పులేటి తారకప్రసాద్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 25, 26 తేదీల్లో వర్కుషాప్ ఉంటుందని, 27, 28, 30 తేదీల్లో సదస్సు జరుగుతుందని పేర్కొన్నారు. దేశ విదేశాల నుంచి 300 మంది ఫ్యాకల్టీ నిపుణులు, నాలుగు వేల మంది ఎనస్థీషియా వైద్యులు హాజరౌతారని ఆయన చెప్పారు. సదస్సుకు ఆంధ్రప్రదేశ్ నుంచి ఐఆర్‌సీఎఫ్ చైర్మన్ డాక్టర్ ఎస్ఎస్‌సీ చక్రరావు, మాజీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎ.కామేశ్వరరావు, డీఆర్ఎంపీ భీమేశ్వర్, డాక్టర్ కుచేలబాబు, డాక్టర్ ఠాగూర్, మాజీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కిరణ్, డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ మోహన్ భాస్కర్, డాక్టర్ సూరిశెట్టి శ్రీనివాస్, రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దుర్గాప్రసాద్, కార్యదర్శి డాక్టర్ మదన్మోహన్‌రెడ్డి హాజరవుతారని వివరించారు.

వ్యవసాయ రంగంలో ఏపీ ముందంజ: అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర - సచివాలయం: వ్యవసాయ రంగంలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉందని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. ఆక్వా, ఉద్యాన, పట్టు, పశు పోషణ, పాలు, మాంసం ఉత్పత్తిలో ప్రగతి చూపుతున్నట్టు చెప్పారు. అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకం కింద 46.86 లక్షల భూయజమానులు, రైతు కుటుం బాలకు రు.6,309.44 కోట్లు అందజేశారు. ఏడాదికి రూ.20 వేలు చొప్పున ఆర్థిక సహాయం అందించడానికి చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. విత్తు నుంచి విక్రయం వరకు రైతులకు మద్దతుగా నిలుస్తున్నది కూటమి ప్రభుత్వం అని పేర్కొన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ రూ.310 కోట్లు అందించినట్టు చెప్పారు. తుపానుకు నష్టపోయిన 3.26 లక్షల మంది రైతులకు రు.390 కోట్లు పరిహారంగా చెల్లించబోతున్నట్టు పేర్కొన్నారు. రైతుల నుంచి రూ.15,955 కోట్ల విలువైన ధాన్యాన్ని కొనుగోలు చేసి 48 గంటలలోపు రైతు ఖాతాల్లో నగదు జమ చేసినట్టు చెప్పారు.

హిడ్మా, రాజే అంత్యక్రియలు పూర్తి

విశాలాంధ్ర-చింతూరు: మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు మడ్వి హిడ్మా, అతడి భార్య రాజే అంత్యక్రియలు గురువారం వారి స్వగ్రామమైన చత్తీస్‌గఢ్‌లోని సుఖ్మాజిల్లా పువర్తిలో నిర్వహించారు. వీరితో పాటు మరో నలుగురు మావోయిస్టులు అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం నియోజకవర్గం మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో మృతి చెందారు. రంపచోడవరంలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం హిడ్మా స్వగ్రామమైన పువర్తిలోని సీఆర్పీఎఫ్ క్యాంపునకు మృతదేహాలను తరలించారు. హిడ్మా, అతడి భార్య రాజే మృతితో పూవర్తిలో విషాదఛాయలు అలముకున్నాయి. క్యాంపులో ఉన్న మృతదేహాలను ఇళ్లకు తీసుకువెళ్లారు. హిడ్మా తల్లి కన్నీరు మున్నీరుగా విలపించింది. బంధువుల రోదనలు చెప్పనలవి కావు. కన్నీటి వీడ్కోలుతో హిడ్మా, రాజే అంత్యక్రియలు జరిగాయి. అశేషంగా జనం హాజరయ్యారు. హిడ్మా శకం పూర్తి అయిందని చెప్పవచ్చు.

ఢిల్లీ పేలుడు కేసులో మరో నలుగురి అరెస్ట్

శ్రీనగర్: ఢిల్లీ ఎర్రకోట సమీపంలో జరిగిన పేలుళ్లతో సంబంధం ఉన్న మరో నలుగురు నిందితులను శ్రీనగర్‌లో ఎన్ఐఏ అరెస్టు చేసింది. దీంతో ఈ కేసులో మొత్తం అరెస్టులు ఆరుకు పెరిగాయి. నవంబర్ 10న ఢిల్లీలోని ఎర్రకోట దగ్గర జరిగిన పేలుడు ఘటనపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) ముమ్మరంగా దర్యాప్తు కొనసాగిస్తోంది. జిల్లా సెషన్స్ జడ్జి, పటియాలా హౌస్ కోర్టు జారీ చేసిన ఆర్డర్ల మేరకు నలుగురు నిందితులను జమ్మూకశ్మీర్‌లోని శ్రీనగర్‌లో అదుపులోకి తీసుకున్నారు. వారిని జమ్మూ కశ్మీర్‌లోని పుల్వామాకు చెందిన డాక్టర్ ముజమ్మిల్ షకీల్ గనై, అనంత్‌నాగ్‌కు చెందిన డాక్టర్ అదీల్ అహ్మద్ రాథర్, ఉత్తరప్రదేశ్‌లోని లక్నోకు చెందిన డాక్టర్ షాహీన్ సయీద్, షోపియన్‌కు చెందిన ముఫ్తీ ఇర్ఫాన్ అహ్మద్ వాగేగా గుర్తించారు. వీరందరూ ఢిల్లీ పేలుడులో ముఖ్యమైన పాత్ర పోషించారని దర్యాప్తు సంస్థ చెబుతోంది. ఇటీవల ఈ కేసుకు సంబంధించి ఇద్దరు నిందితులను ఎన్ఐఏ అరెస్టు చేసింది. పేలుడుకు ఉపయోగించిన కారు ఎవరి పేరున రిజిస్టర్ అయిందో అతనిని(అమీర్ రషీద్ అలీ), దాడిలో పాల్గొన్న ఉగ్రవాదికి సాంకేతిక సహాయం అందించిన డానిష్ అలియాస్ జాసిర్ బిలాల్ వానిని ఎన్ఐఏ అదుపులోకి తీసుకుంది. ఈ కేసులో పూర్తి కుట్రను వెలికితీసే ప్రయత్నాలలో భాగంగా వీరిద్దరినీ విచారణ చేస్తోంది. కాగా, ఈ పేలుడు జరిగిన వెంటనే కేంద్ర హోం మంత్రిత్వ శాఖ దీనిపై దర్యాప్తును ఎన్ఐఏకి అప్పగించింది. దాడికి కారణమైన గ్రూపులోని ప్రతి సభ్యుడిని గుర్తించి అరెస్టు చేయడానికి ఎన్ఐఏ వివిధ రాష్ట్ర పోలీసు దళాలతో కలిసి పనిచేస్తోంది.

నా స్థానం పదిలం

2028లోనూ కాంగ్రెస్‌దే అధికారం

'నవంబరు విప్లవం' మీడియా సృష్టి: సిద్ధరామయ్య

చమరాజనగర్: తన స్థానానికి ఢోకా లేదని కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య దీమా వ్యక్తంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఐదేళ్ల పదవీ కాలాన్ని పూర్తి చేస్తుందని, 2028లో తిరిగి అధికారంలోకి రాబోతోందని అన్నారు. తన స్థానం ముందు నుంచే పదిలంగా ఉందని, భవిష్యత్‌లోనూ ఢోకా ఉండదని చెప్పారు. సీఎం గురువారం చమరాజనగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా హెలిప్యాడ్ వద్ద విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలప్పుడు ఇచ్చిన ఐదు హామీల అమలునకు కట్టుబడి ఉన్నట్లు చెప్పారు. నవంబరు విప్లవం మీడియా సృష్టిగా వ్యాఖ్యానించారు. సిద్ధరామయ్య ఐదేళ్ల పదవీ కాలాన్ని పూర్తి చేయగలరా అన్నది అవసర చర్చ అంటూ కొట్టిపారేశారు. రెండున్నరేళ్ల తర్వాత కేబినెట్ పునర్వ్యవస్థీకరణ నేపథ్యంలో సీఎం మార్పుపై చర్చ మొదలైంది. కేబినెట్ పునర్వ్యస్థీకరణపై నిర్ణయాన్ని పార్టీ అధిష్ఠానం తీసుకుంటుందని, మొత్తం 34 మంత్రి పదవులు ఉండగా, ఇందులో రెండు ఖాళీగా ఉన్నాయని, పునర్వ్యవస్థీకరణతో వీటిని భర్తీ చేస్తామని సిద్ధరాయమ్య అన్నారు. మీ నాయకత్వంలోనే 2028 ఎన్నికలు జరుగుతాయా అన్న ప్రశ్నకు భవిష్యత్‌లో దీనిపై తగు నిర్ణయం జరుగుతుందని ఆయన బదులిచ్చారు. ప్రజలు కోరుకునేంత వరకు బడ్జెట్ ప్రవేశపెడతానని చెప్పారు. డీకే శివకుమార్ సీఎం అవుతారన్న మాజీ ఎంపీ డీకే సురేశ్ వ్యాఖ్యలపై స్పందించేందుకు నిరాకరించారు. 'కాంగ్రెస్‌కు ప్రజలు పట్టంకట్టారు. ఈ ప్రభుత్వం ఐదేళ్ల పదవీ కాలం పూర్తి చేసుకుంటుంది. నిజాయతీగా పని చేస్తుంది. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేస్తుంది' అని సీఎం అన్నారు. చమరాజనగర్‌ను సందర్శిస్తే అధికారం పోతుందన్నది మూఢనమ్మకమని, దీనిని పోగొట్టేందుకే తన ఈ పర్యటన అని చెప్పారు. బెంగళూరు బ్యాంకులో చోరీపై పోలీసులకు కొన్ని ఆధారాలు లభించాయని, త్వరలోనే దొంగలు పట్టుబడతారని ఓ ప్రశ్నకు సిద్ధరామయ్య సమాధానం ఇచ్చారు. ప్రధాని మోదీతో సమావేశం గురించి మాట్లాడుతూ 'అధిక నష్టం-పరిహారం వినతుల క్రమంలో రాష్ట్రంలో అధిక వర్షపాతం వివరాలను కేంద్రానికి అందించాం. చక్కెర రైతుల సమస్యలను వివరించాం. రైతులు, ఫ్యాక్టరీల యజమానులతోనూ చర్చించాం' అని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య వెల్లడించారు.

సీబీఐ కోర్టుకు జగన్ హాజరు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి/ హైదరాబాద్: అక్రమాస్తుల కేసులో వైసీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం హైదరాబాద్‌లోని సీబీఐ ప్రత్యేక కోర్టుకు వచ్చారు. న్యాయమూర్తి ఎదుట విచారణకు వచ్చారు. విజయవాడ నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి ఉదయం 10.30 గం.ల సమయంలో బేగంపేట ఎయిర్‌పోర్టుకు వచ్చి అక్కడి నుంచి నాంపల్లిలోని సీబీఐ కోర్టుకు ఆయన చేరుకున్నారు. మరోవైపు వైఎస్సార్సీపీ నేత పేర్ని నాని, మరో ముగ్గురు నేతలను కోర్టు లోపలికి పోలీసులు అనుమతించలేదు. దీంతో వారు గేట్ వద్దే ఆగిపోయారు. ఈ కేసులో 2013 సెప్టెంబర్ నుంచి జగన్ బెయిల్‌పై ఉన్నారు. ఇప్పుడు కూడా వ్యక్తిగత హాజరు నుంచి తనకు మినహాయింపు ఇవ్వాలని ఆయన కోరగా సీబీఐ తీవ్రంగా వ్యతిరేకించింది. ఆరేళ్లుగా జగన్ కోర్టుకు ప్రత్యక్షంగా హాజరు కావడం లేదని, ఈ కేసుల్లో డిశ్చార్జి పిటిషన్లపై రోజువారీ విచారణ జరుగుతున్నందున ప్రత్యక్షంగా హాజరవ్వాలని సీబీఐ తెలిపింది. దీంతో ఈ నెల 21లోగా వ్యక్తిగతంగా హాజరవ్వాలని కోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఒకరోజు ముందే ఆయన కోర్టుకు హాజరయ్యారు.

పార్టీశ్రేణుల ఘన స్వాగతం

అటు ఏపీలోని గన్నవరం, ఇటు బేగంపేట విమానాశ్రయాల వద్ద పార్టీ శ్రేణులు, అభిమానులు జగన్‌కు ఘన స్వాగతం పలికారు. బేగంపేట దగ్గర వాహనాలు నిలిచిపోవడంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించేవారు ఇబ్బందులకు గురయ్యారు. దీంతో పోలీసులు చర్యలు చేపట్టారు. ఒక్కసారిగా విమానాశ్రయంలోకి వెళ్లేందుకు వైసీపీ శ్రేణుల్ని పోలీసులు అడ్డుకోవడంతో వాగ్వాదం నెలకొంది. ఈ క్రమంలోనే కార్యకర్తలపై పోలీసులు లాఠీఛార్జ్ చేశారు. జగన్ పర్యటనతో నాంపల్లి కోర్టు వద్ద పోలీసులు భారీగా భద్రత ఏర్పాటు చేశారు. కోర్టుకు వచ్చే రెండు మార్గాలను ఆధీనంలోకి తీసుకుని, న్యాయవాదులను మాత్రమే లోపలికి అనుమతించారు. జగన్ తన కాన్వాయ్ నుంచి కార్యకర్తలు, అభిమానులకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. కోర్టు పని ముగిసిన తర్వాత జగన్ లోటస్‌పాండ్‌లో ఉన్న తన నివాసానికి చేరుకోగా...అక్కడకూ భారీగా వైసీపీ శ్రేణులు తరలిరావడంతో పోలీసులు కట్టుదిట్ట చర్యలు చేపట్టారు. తల్లి వైఎస్ విజయలక్ష్మీతో జగన్ భేటీ అయ్యారు. ఆపై పర్యటన ముగించుకుని రాష్ట్రానికి తిరిగొచ్చారు.

జనాన్ని చూసి ఓర్వలేకనే దుష్ప్రచారం: వైసీపీ

వైఎస్ జగన్‌ను చూసేందుకు వెల్లువలా తరలివచ్చిన జనాలను చూసి ఓర్వలేకే టీడీపీ, ఎల్లో మీడియా దుష్ప్రచారం చేస్తున్నాయని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి ప్రభాకరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ లో ఆయన మాట్లాడుతూ లండన్ పర్యటన తర్వాత హాజరు కావాలన్న కోర్టు నిబంధన మేరకు జగన్ ఈరోజు కోర్టుకు హాజరయ్యారని స్పష్టం చేశారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో వైసీపీ నేత అంబటి రాంబాబు మాట్లాడుతూ... కోర్టు ఆదేశాలను గౌరవించి హైదరాబాద్‌లోని నాంపల్లి సీబీఐ కోర్టుకు హాజరుకాబోతూ అందు కోసం షెడ్యూల్‌ని విడుదల చేస్తే కోర్టుకే జగన్ టైమిచ్చారంటూ సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేసి కోర్టులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని ధ్వజమెత్తారు. జెడ్ ప్లస్ కేటగిరీ భద్రత ఉన్న నాయకుడిగా నిబంధనల ప్రకారం ఆయన ఎక్కడికెళ్లినా షెడ్యూల్ విడుదల చేస్తున్న విషయాన్ని గుర్తుచేశారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.